శనివారం
27•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 230
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



శుక్రవారం 69వ గణతంత్ర వేడుకల సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్



69వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో యుద్ధ ట్యాంకర్లతో సైనికుల వందనం

దేశానికే ఆదర్శం

ప్రగతిపథంలో దూసుకుపోతున్న తెలంగాణ

- త్వరలోనే బంగారు తెలంగాణ
- అవినీతి నిర్మూలనకు పారదర్శక పాలన
- సంక్షేమానికి రూ.40వేల కోట్లు
- 24గంటల విద్యుత్ అన్నదాతకు వరం
- ఇక ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్
- బీసీలకు, కులవృత్తులకు భరోసా
- ఫలితమిస్తున్న పాలనాసంస్థలు
- గణతంత్ర వేడుకలో గవర్నర్

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చెప్పారు. విప్లవాత్మక విధానాలు, పారదర్శక పరిపాలనతో బంగారు తెలంగాణ సాధన దిశలో వడివడిగా అడుగులేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం సమగ్ర ప్రగతిని సాధించడమే కాకుండా జాతి నిర్మాణానికి కూడా పెద్దఎత్తున దోహదపడుతున్నదని వివరించారు. ప్రభుత్వ లక్ష్యం బంగారు తెలంగాణ సాధన మరెంతో దూరంలో లేదని ప్రకటించారు. అవినీతిని నిర్మూలించడానికి ప్రభుత్వం పూర్తిపారదర్శక విధానాలను అమలుపరుస్తున్నదని

మిగతా 2వ పేజీలో



గణతంత్ర వేడుకలకు వచ్చిన గవర్నర్ నరసింహన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం కేసీఆర్

అద్వితీయం.. అపురూపం

రాజ్‌పథ్‌లో చారిత్రక గణతంత్ర ఘట్టం

తొలిసారిగా 10 ఆసియాన్ సభ్యదేశాల అధినేతలు హాజరు

ఆకట్టుకున్న సైనిక విన్యాసాలు.. అలరించిన శకటాలు

69వ గణతంత్ర వేడుకల్లో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగిన రిపబ్లిక్‌డే వేడుకలకు తొలిసారిగా పది ఆసియాన్ సభ్యదేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సైనికవందనాన్ని స్వీకరించారు. భారత అజేయ యుద్ధశక్తిని, ఆగ్నేయాసియా దేశాలతో భారత్‌కు ఉన్న సాంస్కృతిక సంబంధాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించారు. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణులతోపాటు శత్రుక్షిపణి విధ్వంసక స్వాతి, అశ్వని రాడార్ వ్యవస్థల్ని ప్రదర్శించారు. సుఖోయ్‌తోపాటు తొలిసారిగా రుద్ర యుద్ధ విమానాల విన్యాసాలు ఒళ్లు జలదరింపజేశాయి. బీఎస్ఎఫ్ మహిళా కమెండోల 'సీమాభవాని' బృందం మోటర్‌బైక్ విన్యాసం ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించింది. గాంధీతత్త్వం, బౌద్ధం ప్రధానంగా రూపొందించిన 23 శకటాలు అందరినీ అలరించాయి.

5



దావోస్ సదస్సు సందర్భంగా సుజ్లాన్ చైర్మన్ తులసి తంతితో మంత్రి కేటీఆర్, ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్

పరిశోధనలతోనే ప్రగతి

- ఆర్‌అండ్‌డీకి ప్రాధాన్యం పెరుగాలి
- హైదరాబాద్‌లో 50 సంస్థలతో 'రిచ్'
- టీవర్క్స్, రిచ్‌లతో భాగస్వాములుకండి
- మంత్రి కే తారక రామారావు పిలుపు
- రాష్ట్రంలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి చూపిన సుజ్లాన్ సంస్థ

11

దావోస్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో మంత్రి కేటీఆర్‌కు అపూర్వమైన గౌరవం దక్కింది. శుక్రవారం పలు దేశాల ఉప ప్రధానులు, ఆయా దేశాల మంత్రులు పాల్గొన్న 'లివరేజింగ్ డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ' అనే సెషన్‌లో.. మంత్రి కేటీఆర్ ఒక్కరికే రాష్ట్రమంత్రిగా పాల్గొనే అవకాశం లభించింది.

ప్రజా ఫిర్యాదుల కోసం జనహిత

ప్రతిరోజూ ఆన్‌లైన్లో ఫిర్యాదులు చేసే అవకాశం

ఇక త్వరితగతిన సమస్యల పరిష్కారం

త్వరలో అందుబాటులోకి తేనున్న ప్రభుత్వం.. పైలట్ ప్రాజెక్టు విజయవంతం

బాగాపనిచేసినవారికి రివార్డులు.. జాప్యంచేసే అధికారులకు మైనస్ మార్కులు

11

బయటి రాష్ట్రాల డిస్టెన్స్ డిగ్రీలు చెల్లవు

అనుమతి నిరాకరిస్తున్న ఉన్నతవిద్యామండలి

ఇగ్నో, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలకు అనుమతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

బయటిప్రాంతాల వర్సిటీలు జారీచేసే ధ్రువపత్రాలు ఇక మీదట చెల్లవు. నిబంధనలకు విరుద్ధంగా ఇతరరాష్ట్రాల యూనివర్సిటీలు రాష్ట్రంలో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసి ధ్రువపత్రాలను జారీచేస్తున్నాయి. విద్యార్థులు ఆ ధ్రువపత్రాలను పొంది పలు కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఇతరరాష్ట్రాల వర్సిటీలు జారీచేసే ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవద్దని ఉన్నతవిద్యామండలి రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలలకు సూచించింది. ప్రత్యేకచట్టం ద్వారా ఏర్పడ్డ ఇగ్నో, బీఆర్ అంబేద్కర్ వర్సిటీలు జారీచేసే ధ్రువపత్రాలను మాత్రమే అనుమతిస్తామని ఉన్నతవిద్యామండలి పేర్కొన్నది. యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం దూరవిద్య కేంద్రాలకు అనుమతి తెచ్చుకున్న యూనివర్సిటీలు ఆయా రాష్ట్రాల పరిధిలోనే స్టడీసెంటర్లు ఏర్పాటు చేసుకోవాలి. అందుకు విరుద్ధంగా వర్సిటీలు జారీచేస్తున్న ధ్రువపత్రాలను ఉన్నతవిద్యామండలి అంగీకరించడం లేదు. విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, న్యాయవిద్య, ఎంటెక్, ఎంఫార్మసీ వంటి కోర్సుల సర్టిఫికెట్లను ఇతర రాష్ట్రాల యూనివర్సిటీల ద్వారా పొందుతున్నట్టు తమ పరిశీలనలో తేలిందని ఉన్నత విద్యామండలి అధికారులు

మిగతా 12వ పేజీలో

సిరిసిల్ల జిల్లాలో విజయభగీరథ

ట్రయల్‌రన్ సక్సెస్

12

ఫిబ్రవరిలో రెండు మున్సిపాల్టీలు, 466 ఆవాసాలకు మంచినీరు

ముందుచూపుతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిన మంత్రి కేటీఆర్



తెలంగాణ భవన్‌లో జాతీయజెండాను ఎగురవేస్తున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి బండ ప్రకాశ్, టీఆర్‌ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబు



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ జాతీయజెండాను ఎగురవేసిన అనంతరం వందనం చేస్తున్న మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, శ్రవణ్‌రెడ్డి తదితరులు

మొదటిపేజీ తరువాయి...

దేశానికే ఆదర్శం

చెప్పారు. హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సైనికుల గౌరవవందనం స్వీకరించిన గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 'తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు' అని తెలుగులో తెలిపిన ఆయన అనంతరం ఇంగ్లిష్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని వివరించారు. గవర్నర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

సరిగ్గా మూడేండ్ల కిందట ఇదే వేదిక మీద కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని అవరోధాలను అధిగమించి, సవాళ్లను ఛేదించి అభివృద్ధి పథాన పయనించనున్నదని చెప్పాను. ఈరోజు సగర్వంగా ప్రకటిస్తున్నా.. ఆరోజు చెప్పినట్టే నేడు రాష్ట్రం శరవేగంగా ప్రగతిపథంలో దూసుకుపోతున్నది. ప్రజల ఆకాంక్షలను, ఆశయాలను నెరవేరుస్తూ దేశానికే మార్గదర్శకంగా.. రోల్‌మోడల్ స్టేట్‌గా మారింది. త్వరలోనే బంగారు తెలంగాణ లక్ష్యం సాకారమవుతుందని నాకు పూర్తి నమ్మకం ఉన్నది.

విద్యుత్‌రంగంలో విప్లవాత్మక ఫలితాలు.. అన్నదాతకు వరం

విద్యుత్‌రంగంలో రాష్ట్రం అతితక్కువ కాలంలోనే అనితర ప్రగతిని సాధించింది. రాష్ట్రం ఆవిర్భవించిన సమయంలో విద్యుత్ ఉత్పాదన కేవలం 6,574 మెగావాట్లు మాత్రమే. నేడు 14,845 మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉన్నది. విద్యుత్ మిగులు రాష్ట్రంగా మార్చడానికి, నిర్దేశిత 28 వేల మెగావాట్ల ఉత్పాదనను సాధించడానికి ప్రభుత్వం పలుచోట్ల పవర్‌ప్లాంట్లను నెలకొల్పుతున్నది. నిర్దిష్ట ప్రణాళిక, వ్యూహాత్మక విధానం, ఉద్యోగుల సహకారం వల్ల రాష్ట్రం ఏర్పడిన ఆరెళ్లలోనే విద్యుత్ సంక్షోభం నుంచి గట్టెక్కాం. ఈరోజు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను సరఫరాచేస్తూ సగర్వంగా తలెత్తుకుంటున్నాం. ప్రభుత్వం అన్నదాతలకు దీనిని వరంగా ఇచ్చింది.

సంక్షేమ పథకాలకు రూ.40 వేల కోట్లు

పేదల సంక్షేమం, వ్యవసాయరంగం అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు, పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా సాధించిన అద్భుతఫలితాలు జనం ముఖంపై చిరునవ్వులను పూయిస్తున్నాయి. పేద, బడుగువర్గాల సంక్షేమానికి ఏటా సుమారు రూ.40వేలకోట్ల రూపాయలను ఖర్చుచేస్తున్నాం. వృద్ధులకు, వితంతువులకు రూ.వెయ్యి, దివ్యాంగులకు రూ.1,500 చొప్పున మొత్తం 38.87లక్షల మంది ఆసరా పెన్షన్లను పొందుతున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద ఆడపిల్లల వివాహాలకు ఒక్కొక్కరికి రూ.75,116 ఇస్తున్నాం. ఆరోగ్యలక్ష్మి పథకం కింద గర్భిణులకు, తల్లులకు, శిశువులకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు సరఫరా చేస్తున్నాం. పేదలు గౌరవంగా బతుకడానికి రెండు పడకల గదుల ఇండ్లను నిర్మిస్తున్నాం. అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, హోంగార్డులు, వీఏవోలు, ఐకేపీ వర్కర్లకు భారీగా వేతనాలు పెంచాం.

ఈసారి నుంచి వ్యవసాయ బడ్జెట్

వ్యవసాయరంగాన్ని, వారసత్వంగా వచ్చిన వృత్తులను అన్నిరకాలుగా ప్రోత్సహించాలని నా ప్రభుత్వం నిశ్చయించుకున్నది. వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చడానికి పలు చర్యలు తీసుకుంటున్నది. పంటలకు కనీస గిట్టుబాటు ధరను అందించడానికి క్రాప్‌కాలనీల విధానాన్ని అమలుపరుస్తాం. ప్రభుత్వం 2018-19 వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టబోతున్నది. 35 లక్షల రైతులకు రూ. 17వేల కోట్ల రుణాన్ని మాఫీచేసింది. కోటి ఎకరాల పంటకు పుష్కలంగా నీరందించడానికి వీలుగా నీటిపారుదలరంగానికి ఏటా రూ.25 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నాం. దేవాదుల, భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేశాం. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నాం. కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీ పునరుజ్జీవం పొందడమే కాకుండా తెలంగాణలోని అధిక ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయి. మిషన్ కాకతీయలో 46 వేల చెరువుల పునరుద్ధరణ వల్ల భూగర్భజలాల మట్టం బాగా పెరిగింది. ఎకరాకు రెండు పంటలకు రూ.8 వేల చొప్పున అందించే వ్యవసాయ పెట్టుబడికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయిస్తాం. రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు 4 లక్షల టన్నులు మాత్రమే ఉన్న గోదాముల నిల్వసామర్థ్యం ఇప్పుడు 22.5 లక్షల టన్నులకు పెరిగింది. భూరికార్డుల ప్రక్షాళన గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయింది. పాస్‌పుస్తకాలను త్వరలోనే పంపిణీచేస్తాం.

బీసీలకు.. కులవృత్తులకు పూర్తి భరోసా

రాష్ట్ర ఆర్థికవ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి, సంపదను, మానవ వనరులను సక్రమంగా ఉపయోగించుకోవడానికి నా ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నది. వెనుకబడిన కులాలకు, వారి వృత్తులకు భరోసా కల్పిస్తున్నది. గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీపై ఇప్పటివరకు 40 లక్షల గొర్రెలను పంపిణీచేశాం. మత్స్య పరిశ్రమను పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నాం. నాయీబ్రాహ్మణులకు ఆధునిక హెయిర్ డ్రెసింగ్ సెలూన్ల కోసం ఒక్కొక్కరికి రూ. లక్ష సాయం అందించేందుకు ప్రత్యేక పథకానికి రూపకల్పన చేశాం. విద్యుత్ వాడకంలో సెలూన్లను కమర్షియల్‌గా కాకుండా గృహ అవసరాల కిందకు తెచ్చి భారం తగ్గిస్తాం. రజకులకు సబ్సిడీపై వాషింగ్ మెషీన్లను అందజేయాలని ప్రతిపాదించాం. వరంగల్‌లో కాకతీయ హ్యాండ్లూమ్ మెగా టెక్స్‌టైల్ పార్క్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశాం. కల్లుగీత కార్మికులను ప్రోత్సహిస్తున్నాం. కంసాలీలకు ఆధునిక యంత్రాలు ఇవ్వాలని నిర్ణయించాం. ఎంబీసీల సంక్షేమం కోసం రూ. వెయ్యి కోట్ల నిధిని ఏర్పాటుచేశాం.

కేజీ టు పీజీ ఉచిత విద్య

కేజీ నుంచి పీజీ వరకు ఉచితవిద్యను అందించడానికి పలు చర్యలను ప్రారంభించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నాణ్యమైన విద్యను అందించడానికి 542 గురుకులాలను, ఎస్సీ మహిళల కోసం 30, ఎస్టీ మహిళల కోసం 22 డిగ్రీ కాలేజీలను స్థాపించాం. ఒక్కొక్క పేద విద్యార్థికి ఏడాదికి రూ.1.25 లక్షల చొప్పున వెచ్చిస్తున్నాం.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రజారోగ్యం

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ దవాఖానలలో వైద్యసేవలను మెరుగుపరచడానికి రూ.265 కోట్లు వెచ్చించాం. మా ప్రభుత్వం పేద గర్భిణులకు ప్రసవానికి ముందు, తర్వాత సహాయం కింద రూ.12వేలు, ఆడ శిశువుకు అదనంగా మరో వెయ్యి రూపాయలను అందిస్తున్నది. ప్రతి ఇంటికి మంచినీటిని అందించడానికి మిషన్ భగీరథ కింద రూ.42 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. రోడ్డునెట్‌వర్క్‌ను విస్తృతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. హరితహారంలో 80 కోట్ల మొక్కలను నాటాం.

ఫలితమిస్తున్న పరిపాలనా సంస్కరణలు

పరిపాలనా సౌలభ్యం కోసం చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలనిస్తున్నాయి. ప్రజలకు పాలనను మరింత అందుబాటులోకి తేవడానికి కొత్తగా 21 జిల్లాలను, 25 రెవెన్యూ డివిజన్లను, 125 మండలాలను, ఏడు పోలీస్ కమిషనరేట్లను, 23 పోలీస్ సబ్‌డివిజన్లను, 28 సర్కిళ్లను, 94 కొత్త పోలీస్‌స్టేషన్లను ఏర్పాటుచేశాం. గిరిజన తండాలకు పంచాయతీ హోదా కల్పించాలని నిర్ణయించాం.

టీఎస్‌ఐపాస్ విజయవంతం

నూతన పారిశ్రామిక విధానం టీఎస్‌ఐపాస్ విజయవంతమైంది. దీనికింద 6,070 పరిశ్రమలకు అన్ని అనుమతులు లభించాయి. రెండువేల పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయి. కొత్త పరిశ్రమల వల్ల రాష్ట్రానికి రూ.1,18,000 కోట్ల పెట్టుబడులు, రెండులక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. 2016-17లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్డీపీ) 13.9 శాతానికి పెరిగింది. ఇది జాతీయ సగటు 11శాతం కంటే మించింది. వ్యక్తిగత తలసారి ఆదాయం జాతీయస్థాయిలో రూ.1,03,219 ఉండగా, తెలంగాణలో రూ.1,55,216గా ఉన్నది. గత డిసెంబర్‌లో తెలంగాణ వృద్ధిరేటు 18%గా నమోదైంది. ఐటీ ఎగుమతులలో 12% వృద్ధి చోటుచేసుకుంది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్ నగరాలలో ఉపాధి కల్పన కోసం పరిశ్రమలను స్థాపిస్తున్నాం. శాంతి, భద్రతలను కాపాడటానికి నా ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నది. నా ప్రభుత్వం రాష్ట్రంలో కనీస మానవీయ విలువలను, అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడుతూ సాంకేతిక అభివృద్ధితో సమన్వయం చేసుకుంటూ అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నది. సామాజిక అసమానతలను తొలిగించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరచడం, పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి చర్యల ద్వారా ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచడానికి పటిష్ఠ పునాదులు వేస్తున్నది. దేశంలో నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అవకాశాలను అనుకూలంగా మలుచుకుంటూ అభివృద్ధి పథంలో నడుస్తూ దేశ నిర్మాణానికి పెద్దఎత్తున చేయూతనిస్తున్నది. ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి మనమంతా మరలా అంకితమవుదాం. 'మీ అందరికీ మరోసారి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకొంటూ.. ధన్యవాదాలు' అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ముగించారు.



ప్రగతి భవన్‌లో జాతీయజెండాను ఎగురవేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ప్రగతిభవన్‌లో గణతంత్ర దినోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్, సీఎంవో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ ఇచ్చిన తేనీటి విందుకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ఏపీ అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్



రాజ్‌భవన్‌లో తేనీటి విందుకు హాజరైన మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పలుకరిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో ఈటల, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు



రాజ్‌భవన్‌లో తేనీటి విందుకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కరచాలనం చేస్తున్న బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు కిషన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు రామచంద్రారెడ్డి, ప్రభాకర్

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.05 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం, దశమి ఉదయం 11.16 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: కృత్తిక ఉదయం 6.03 వరకు, తదుపరి రోహిణి, అమృతఘడియలు: తె. 3.48 నుంచి 5.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.14 నుంచి సాయంత్రం 4.50 వరకు, రాహుకాలం: ఉదయం 9.41 నుంచి 11.05 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.53 నుంచి 8.22 వరకు, వర్జ్యం: రాత్రి 8.45 నుంచి 10.21 వరకు.

రాజ్‌భవన్‌లో ఎట్‌హోం సందడి

- గవర్నర్ తేనీటి విందుకు హాజరైన సీఎం కేసీఆర్
- పాల్గొన్న మంత్రులు, ఇతర ప్రముఖులు
- అతిథులను ఆత్మీయంగా పలుకరించిన గవర్నర్ దంపతులు
- ఎట్‌హోంకు ముఖం చాటేసిన కాంగ్రెస్ నాయకులు



శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గణతంత్ర దిన వేడుకల ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు (ఎట్‌హోం) కార్యక్రమం సందడిగా జరిగింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతోపాటు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మంత్రులు, పలువురు ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్, ఆయన సతీమణి విమలా నరసింహన్ అతిథులను ఆత్మీయంగా పలుకరించారు. అనంతరం సీఎం కేసీఆర్, ఇతర మంత్రులతో కలిసి తేనీటి విందును స్వీకరించారు. విందు పూర్తయ్యేవరకు పక్కనే కూర్చున్న సీఎం కేసీఆర్‌తో నరసింహన్ పలు విషయాలపై మాట్లాడుతూ, నవ్వులు చిందిస్తూ కనిపించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య, రాష్ట్ర మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, జోగురామన్న, జూపల్లి కృష్ణారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ఎంపీలు డీ శ్రీనివాస్, బీ వినోద్‌కుమార్, మల్లారెడ్డి, బాల్కసుమన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సలహాదారు వివేక్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, బీజేపీ ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, ఇతర ఎమ్మెల్యేలు, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పలురంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు ఎట్‌హోంకు హాజరుకాలేదు. ఏపీ నుంచి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాసరావు, మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు, ఏపీ శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి, ఎంపీ సుబ్బరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు హాజరైన ఎంపీలు డీ శ్రీనివాస్, అసదుద్దీన్ ఒవైసీ, మాజీ ఎంపీ సుబ్బరామిరెడ్డి, మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు, ఏపీ శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి

హాజరుకాని కాంగ్రెస్ నేతలు

రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చిన తేనీటి విందుకు కాంగ్రెస్ నాయకులు ముఖం చాటేశారు. అధికారికంగా ప్రకటించకపోయినా ముందస్తుగా నిర్ణయించుకున్న ప్రకారం వారు తేనీటి విందుకు హాజరుకాలేదు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, మాజీ మంత్రి దానం నాగేందర్ మాత్రం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇతర నాయకుల గైర్హాజరుపై మీడియా ప్రతినిధులు ఎంపీ రాపోలును ఆరా తీయగా.. ఎట్‌హోంకు హాజరుకావొద్దంటూ తమ పార్టీ నుంచి సమాచారం లేకపోవడంతోనే తాను వచ్చినట్టు చెప్పడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ నాయకుల అనైక్యత రాజ్‌భవన్ సాక్షిగా బయటపడింది.

లోకం పోకడ



ఇక్కడి నుంచి అధికఫీజులు వసూలు చేస్తే అక్కడి నుంచి జరిమానాలు వసూలు చేస్తారట!

646 దేవాలయాల అర్చకులు, ఉద్యోగులకు వేతనాలు

- 5,625 మంది అర్చక ఉద్యోగ సిబ్బందికి పీఆర్సీ
- సిద్ధమవుతున్న మార్గదర్శకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీ ప్రకారం దేవాదాయశాఖ పరిధిలోని 646 దేవాలయాల్లోని అర్చకులు, ఉద్యోగులందరికీ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 2015-పీఆర్సీని అమలుచేసేందుకు జాబితాలను సిద్ధంచేస్తున్నారు. అడ్డంకులన్నీ తొలిగిపోయే విధంగా ఉన్నతాధికారులు మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. మార్చి నుంచి జాబితాలలో ఉన్న 5,625 మంది ఉద్యోగులకు వేతన వ్యవస్థను అమల్లోకి తేనున్నారు. ప్రతి అర్చకుడు, ఉద్యోగి స్థిరమైన వేతనాలను అందుకొనే విధంగా ఉన్నతాధికారులు ఇప్పటికే నివేదికలను సిద్ధంచేశారు. 2005 అక్టోబర్ 15న దేవాదాయశాఖ నియామకాలపైన నిషేధం విధించారు. అయినప్పటికీ వేల సంఖ్యలో నియామకాలు జరిగినట్టు ఉన్నతాధికారుల కమిటీలు ఇచ్చిన నివేదికల్లో పేర్కొన్నారు. గతంలో జరిగిన విషయాలను తవ్వకుండా ఉద్యోగులందరికీ న్యాయం చేయాలనే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. 2017 సెప్టెంబర్ నాటికే ఉద్యోగుల జాబితాలు అందుబాటులో తెచ్చారు. కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కావడం, కొందరు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా మార్గదర్శకాలను రూపొందించడం వంటి పరిపాలన ప్రక్రియలను పూర్తిచేయాల్సి రావడంతో ఈ విధానంలో కొద్దిగా ఆలస్యం జరిగింది. దేవాదాయ శాఖ చట్టం 30/87, 33/2007 చట్టాలు, నిబంధనల ప్రకారం ఇప్పటికే రెండు వేల మంది ఉద్యోగులకు పీఆర్సీ -2015ను అమలులోకి తెచ్చారు. ఇందులో 1,100 మంది ఉద్యోగులు 2017కు పూర్వమే రెగ్యులర్ విధానంలో పీఆర్సీ ప్రకారం వేతనాలను అందుకొంటున్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్క ఉద్యోగి సర్వీస్‌బుక్, నియామక విధానం, విద్యార్హతలు, ఎంతకాలంగా పనిచేస్తున్నారు? తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత సక్రమంగా ఉన్న మరో 800 ఉద్యోగులను పీఆర్సీ పరిధిలోకి తీసుకొచ్చారు. దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం 646 దేవాలయాలలో 5,625 మంది అర్చకులు, ఉద్యోగులు ఉన్నారని, వీరందరికీ రెగ్యులర్ వేతనాలివ్వాల్సిన అవసరం ఉన్నదని నివేదికలో స్పష్టంచేసింది. దేవాదాయశాఖ కార్యదర్శి శివశంకర్, సీనియర్ అధికారులు కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, వినోద్‌రెడ్డితో ఉద్యోగుల వివరాల తనిఖీకోసం కమిటీని నియమించారు. ఈ కమిటీ ప్రతి అర్చకుడు, ఉద్యోగి వివరాలతో రాష్ట్ర దేవాదాయశాఖ కార్యదర్శికి జాబితాను అందజేసింది. మంత్రి వర్గ ఉపసంఘం, ఉన్నతాధికారుల కమిటీ ఇచ్చిన నివేదికల ప్రకారం జాబితాలలోని ఉద్యోగులందరికీ మార్చి -2018 నుంచి వేతనాలను అమలులోకి తేనున్నారు. ప్రభుత్వం పీఆర్సీని ఇస్తామని ప్రకటించిన తర్వాత కొందరు ఉద్యోగులు జాబితాల్లోకి వచ్చారనే ఆరోపణలున్నాయి. వీరందరిపైన విచారణలు చేపట్టాలని, విచారణకు తాము సహకరిస్తామని తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ ఇదివరలోనే ప్రకటించారు. పీఆర్సీ ప్రకటించిన తర్వాత దేవాలయాల జాబితాల్లోకి వచ్చిన ఉద్యోగులందరిపైన విచారణ జరుగాల్సిందేనని దేవాదాయశాఖ ఉద్యోగసంఘాలు పేర్కొంటున్నాయి.



సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం వందనంచేస్తున్న గవర్నర్ నరసింహన్



సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకులకు హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, ఎంపీలు జితేందర్‌రెడ్డి, డీ శ్రీనివాస్, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఈటల రాజేందర్, పద్మారావుగౌడ్, జోగు రామన్న, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు



వేడుకలకు హాజరైన మండలి వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రామచంద్రు, ఎంపీ వినోద్‌కుమార్, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సోమారపు సత్యనారాయణ, బొడిగె శోభ, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీ వెంకటేశ్వర్లు, భూపాల్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, సీతారాంనాయక్, కార్పొరేషన్ చైర్మన్ రాజయ్యయాదవ్, మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బాల్కసుమన్, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి

పరేడ్‌గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



సైనిక అమరవీరుల స్తూపం వద్ద విజిటర్స్ బుక్‌లో సందేశాన్ని రాస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో శుక్రవారం 69వ గణతంత్ర వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. సైనికుల కవాతులు, వివిధశాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన విన్యాసాలు, గగనతలాన్ని తాకే రంగురంగుల బెలూన్లతో పరేడ్‌గ్రౌండ్‌లో ఆహ్లాదకర వాతావరణం కనిపించింది. ఉదయం 9.10 గంటలకు పరేడ్‌గ్రౌండ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు సైనిక అధికారి లెఫ్టినెంట్ జనరల్ పరమ్‌జిత్‌సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి పరేడ్‌గ్రౌండ్‌లోని సైనిక అమరవీరుల స్తూపాల వద్ద నివాళులు అర్పించారు. సైనికుల విజిటర్స్ బుక్‌లో తన సందేశాన్ని రాశారు. ఉదయం 9.20 గంటలకు పరేడ్‌గ్రౌండ్‌కు చేరుకున్న గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌కు సీఎం కేసీఆర్ స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ జాతీయజెండాను ఆవిష్కరించి సైనికుల గౌరవ వందనం స్వీకరించారు. సైనికులు, ఇతర శాఖల పరేడ్‌ను పర్యవేక్షించారు. గణతంత్ర వేడుకలలో అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, జోగురామన్న, ఎంపీలు కేశవరావు, జితేందర్‌రెడ్డి, బాల్కసుమన్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు బహూకరించిన గవర్నర్ నరసింహన్

అమర సైనికులకు నివాళులర్పించిన సీఎం కేసీఆర్ ● టీఎస్‌ఐపాస్‌కు ప్రత్యేక అవార్డులు

ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు

విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అవార్డులతో సత్కరించింది. ఈ అవార్డులను గణతంత్ర వేడుకలలో గవర్నర్ నరసింహన్ బహూకరించారు. గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులలో అనితారామచంద్రన్ (ఐఏఎస్, యాదాద్రి కలెక్టర్), శశాంక్ (ఐఏఎస్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్), రాజేశ్‌కుమార్ (డీఐజీ, కౌంటర్ ఇంటలిజెన్స్), స్వాతిలక్రా (అదనపు పోలీస్ కమిషనర్, హైదరాబాద్), శోభ (ఐఎఫ్‌ఎస్, అటవీశాఖ 'కంపా' అధికారి), సొర్గం శ్రీనివాస్ (ఐఎఫ్‌ఎస్, అటవీశాఖ, అడిషనల్ పీసీసీఎఫ్) ఉన్నారు.

టీఎస్‌ఐపాస్‌కు ప్రత్యేక అవార్డులు

టీఎస్‌ఐపాస్ విధానంలో పరిశ్రమలకు అనుమతులను వెంటవెంటనే జారీచేయడానికి ప్రత్యేక కృషిచేసిన అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులనిచ్చింది. పరిశ్రమల కోసం దాఖలైన దరఖాస్తులను తక్కువకాలంలో పరిష్కరించినందుకు ఫ్యాక్టరీల డైరెక్టర్ పీఎం చంద్రమోహన్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి పీ సత్యనారాయణరెడ్డి, టీఎస్ ఎస్పీడీసీఎల్ సీఎండీ జీ రఘుమారెడ్డి, అత్యంత సమర్థంగా దరఖాస్తులను పరిష్కరించినందుకు టీఎస్‌ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ప్రభుత్వ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఏజీ రమణప్రసాద్, జాయింట్ డైరెక్టర్ (కమిషనర్ ఆఫ్ లేబర్) సంఘ సురేశ్, అసిస్టెంట్ డైరెక్టర్ (కమిషనర్ ఆఫ్ లేబర్) కే చంద్రశేఖర్‌బాబుకు గవర్నర్ అవార్డులను బహూకరించారు. అత్యుత్తమ కవాతు ప్రదర్శనకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ విద్యార్థి ఎం భగత్ బృందానికి, రిజర్వ్‌పోలీస్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ చౌదరి బృందానికి గవర్నర్ బహుమతులను ప్రదానం చేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్ర పుస్తకాన్ని రచించిన నుపూర్‌కుమార్, అందుకు సహకరించిన ఫొటోగ్రాఫర్ డీ రవీందర్‌రెడ్డి కూడా గవర్నర్ చేతుల మీదుగా అవార్డులనందుకున్నారు.



యాదాద్రి కలెక్టర్ అనితారామచంద్రన్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శశాంక్, కౌంటర్ ఇంటెలిజెన్స్ డీఐజీ రాజేశ్ కుమార్, అదనపు పోలీస్‌కమిషనర్ స్వాతి లక్రా, ఐఎఫ్‌ఎస్ అధికారి శోభ, ఐఎఫ్‌ఎస్ అధికారి స్వర్గం శ్రీనివాస్, పీసీబీ సభ్య కార్యదర్శి పీ సత్యనారాయణ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ జీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ఫ్యాక్టరీల డైరెక్టర్ పీఎం చంద్రమోహన్, విద్యుత్‌శాఖ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్ జేడీ(కమిషనర్ ఆఫ్ లేబర్) సంఘ సురేశ్, ఏజీ రమణ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ (కమిషనర్ ఆఫ్ లేబర్) కే చంద్రశేఖర్‌బాబు, హైదరాబాద్ పోలీస్ చరిత్ర పుస్తకాన్ని రచించిన నూపుర్‌కుమార్, ఫొటోగ్రాఫర్ డీ రవీందర్‌రెడ్డి

అన్ని ప్రాంతాలకూ అవకాశముండాలి

- తెలంగాణకు 'పద్మ' అవార్డులు రాకపోవడం బాధాకరం
- ప్రధాని మోదీకి ఎంపీ వినోద్‌కుమార్ లేఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతిష్ఠాత్మకమైన పద్మ అవార్డుల ఎంపికలో అన్ని ప్రాంతాలవారికి అవకాశం దక్కేలా చూడాలని కరీంనగర్ ఎంపీ బీ వినోద్‌కుమార్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖరాశారు. గురువారం ప్రకటించిన పద్మ అవార్డుల జాబితాలో తెలంగాణ నుంచి ఒక్కరిని కూడా అవార్డుకు ఎంపిక చేయకపోవడం బాధ కలిగించిందని అందులో పేర్కొన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ఎంపిక చేయడం ద్వారా మరింత ప్రతిష్ఠ పెరుగుతుందని చెప్పారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన అనేకమంది తెలంగాణ నుంచి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అవార్డులకు ఎంపిక చేయాలని పలువురి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం కూడా సిఫారసు చేసిందని, ముఖ్యంగా సాహిత్యరంగానికి చెందినవారు కూడా ఇందులో ఉన్నారని లేఖలో గుర్తుచేశారు. పద్మ అవార్డులకు అర్హులో కాదో తెలుసుకొన్న తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిందని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన ఎక్కువ మంది అవార్డులకు ఎంపికయ్యారని, ఇదే సమయంలో తెలంగాణ నుంచి ఒక్కరూ లేకపోవడం నిరాశపరిచిందని చెప్పారు. గతంలో అవార్డుల ఎంపికకు మార్గదర్శకాలు కూడా ఉండేవి కావని, 2011 నుంచి మార్గదర్శకాలు ఖరారు చేశారని, ఆ ప్రకారమే అవార్డుల కోసం దరఖాస్తులు చేస్తున్నారని పేర్కొన్నారు. పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియను మరింత నిష్పక్షపాతంగా చేపట్టి.. దేశంలోని అన్ని ప్రాంతాలవారికి జాబితాలో అవకాశం కల్పించాలని ప్రధానిని వినోద్ కోరారు.

యాసంగి ఆయకట్టును కాపాడాలి

- చివరి భూములకు కూడా సాగునీరివ్వాలి
- సిబ్బంది నుంచి చీఫ్ ఇంజినీర్ల వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ఎస్సారెస్పీ, ఎన్నెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం



శుక్రవారం జలసౌధలో యాసంగి సాగుకు నీటిసరఫరా క్రమబద్ధీకరణపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల పరిధుల్లోని యాసంగి ఆయకట్టును కాపాడాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మూడు ప్రాజెక్టుల ఆయకట్టు చివరి భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వారితో చెప్పారు. ఇందుకోసం ప్రాజెక్టుల నీటి సరఫరాలను క్రమబద్ధం చేయాలన్నారు. ఎస్సారెస్పీ, ఎల్‌ఎండీ ఎగువ ప్రాంతాల్లో 4,07,417 ఎకరాలు, ఎల్‌ఎండీ దిగువన 1,52,588, నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) కింద 5,25,629, నిజాంసాగర్ కింద 1,51,666 ఎకరాలకు ఈ యాసంగిలో తప్పనిసరిగా సాగునీరు అందించాలని ప్రాజెక్టుల అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ప్రాజెక్టుల ఆయకట్టులకు సాగునీటి సరఫరాను మంత్రి హరీశ్‌రావు శుక్రవారం జలసౌధలో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సాగునీటి సరఫరా తీరును పరిశీలించడానికి చీఫ్ ఇంజినీర్లు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర సిబ్బంది నిరంతరం కాల్వల వెంట పర్యటించాలని ఆయన చెప్పారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ల సహకారం తీసుకోవాలన్నారు. సంబంధిత జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగించాలని, రెవిన్యూ సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. నీరు అత్యంత విలువైనదని, కాబట్టి సరఫరాలో చుక్కనీరు కూడా వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటిని వదిలినపుడు అప్రమత్తంగా ఉండాలని, రాత్రింబవళ్లు పర్యవేక్షించాలన్నారు. సాగునీటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో ఎలాంటి లోటుపాట్లు జరిగినా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లదే బాధ్యత అని, వారిపై చర్యలకు ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. ప్రధాన కాలువలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగునీటి సరఫరా చేస్తున్నందున ఆయకట్టు దిగువన ఉన్న పొలాలకు కూడా నీరందేవిధంగా చూడాలని మంత్రి పేర్కొన్నారు. శ్రీరాంసాగర్, లోయర్ మానేరు డ్యాం ఎగువన, దిగువన, ఎన్నెస్పీతో పాటు నిజాంసాగర్ కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీలు, కాల్వల పరిధిలోనూ జరుగుతున్న సాగునీటి సరఫరా వివరాలను మంత్రి పరిశీలించారు. సమావేశంలో ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఈలు శంకర్, సునీల్, మధుసూదన్‌రావు, ఎస్ఈ, ఈఈలు పాల్గొన్నారు.



శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్

హైకోర్టులో అదనపు పీపీల నియామకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి హైకోర్టులో ఇద్దరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (అదనపు పీపీ)లను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జువ్వాడి శ్రీదేవి, ఏఎస్ జయరాజ్ మూడేండ్లపాటు అదనపు పీపీలుగా కొనసాగనున్నారు. ఇటీవలి వరకు అదనపు పీపీలుగా బాధ్యతలు నిర్వర్తించిన డీ రామిరెడ్డి, పీ వినోద్‌కుమార్ పదవీకాలం ముగియడంతో వీరి స్థానంలో కొత్తవారిని ప్రభుత్వం నియమించింది.

వర్కింగ్ మాన్యువల్‌పై కృష్ణాబోర్డు హడావుడి!

- ఈ నెల 30న భేటీ ఏర్పాటు చేస్తూ లేఖ
- రిమోట్ సెన్సింగ్ సర్వేపై చర్చలంటూ మరో ఉత్తరం
- అదే రోజున పదవీ విరమణ చేయనున్న బోర్డుచైర్మన్
- ఈ లోగానే నిర్ణయాల కోసం ఎత్తులు
- ఆరోజు సమావేశాలకు రాలేమని చెప్పిన తెలంగాణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు వర్కింగ్ మాన్యువల్ ఆమోదం అంశాన్ని బోర్డు మరోసారి ముందుకు తెచ్చింది. ఈ నెల 30వ తేదీన సమావేశమై ఈ విషయమై చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని తెలుపుతూ హడావుడిగా లేఖ రాసింది. అదేరోజున నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సర్వేపై చర్చలు జరుపుదామంటూ మరో లేఖను పంపించింది. బోర్డు పరిధిలోకి రెండు రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులను తీసుకురావడంతో సహా అనేక కీలక అంశాలతో ముడిపడి ఉన్న ఈ మాన్యువల్‌ను తెలంగాణ ఆది నుంచి వ్యతిరేకిస్తున్నది. అయినా బలవంతంగానైనా బోర్డుతో మాన్యువల్‌ను ఆమోదింపజేసేందుకు ఆంధ్రప్రదేశ్ పావులు కదుపుతున్నది. మాన్యువల్‌లోని పలు అంశాలపై తెలంగాణ ఇప్పటికే పలుమార్లు అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ప్రధానంగా ప్రాజెక్టులవారీగా కేటాయింపులు జరుగనిదే బోర్డు పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకోవడం వల్ల ఫలితం ఉండదని స్పష్టం చేసింది. అయినా ఏపీ పరోక్ష ఒత్తిడితో కృష్ణాబోర్డు అధికారులు మాన్యువల్‌ను ఆమోదించేందుకు పలుమార్లు యత్నించారు. ఒకదశలో ఆమోదించినట్లేనని అధికారికంగా ప్రకటించడంతో తెలంగాణ తీవ్రస్థాయిలో గళమెత్తింది. దీంతో వెనుకకు తగ్గినట్టు కనిపించిన బోర్డు ఇప్పుడు మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. 30వ తేదీన ఈ అంశంపై తుదినిర్ణయం తీసుకుందామని పేర్కొంటూ బోర్డుసభ్య కార్యదర్శి పరమేశం రెండు రాష్ట్రాలకు లేఖలు రాశారు. వాస్తవానికి ఆ రోజున బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ పదవీ విరమణ చేయనున్నారు. ఆయనకు వీడ్కోలు పలుకాల్సి ఉంది. ఈ తరుణంలో బోర్డు కీలకమైన సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. నిజానికి తేల్చాల్సిన కీలకాంశాలు బోర్డు ముందు మరి కొన్ని ఉన్నాయి. పట్టిసీమ ద్వారా ఏపీ గోదావరిజలాల్ని కృష్ణాలోకి మళ్లించడం, ఆ రాష్ట్రంలోని చెరువుల నీటి వినియోగం సమస్యల గురించి తెలంగాణ ఎప్పటి నుంచో ప్రస్తావిస్తున్నా ఆ అంశాలను బోర్డు పెండింగులో పెడుతూ వస్తున్నది. తెలంగాణ వాదనను దారి మళ్లించి అడ్డుకోవడానికి తెలంగాణలోని చెరువుల నీటి వినియోగంపై ఏపీ అశాస్త్రీయ లెక్కల్ని ముందుకు తెచ్చింది. ఈ క్రమంలో తెలంగాణ నీటి వినియోగంపై వాస్తవాలను బోర్డుకు తెలియజేసింది. ఏదిఏమైనా పట్టిసీమ ద్వారా ఏపీ గోదావరిజలాల్ని మళ్లిస్తున్నందున ఆ మేరకు తమకు కృష్ణాజలాల్లో వాటా ఇవ్వాల్సిందేనని, ఈ సంగతి తేల్చాలని బోర్డుకు కరాఖండిగా చెప్పింది. అయినా బోర్డు అందుకు చర్యలు తీసుకోలేదు. కానీ తెలంగాణ చెరువుల కింద నీటి వినియోగంపై కీలక నిర్ణయం తీసుకునేందుకు బోర్డు హడావుడిగా సిద్ధమైంది. నీటి వినియోగంపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో సర్వే చేయించడానికి 30వ తేదీన ఆ సంస్థ ప్రతినిధులతో చర్చలు, ప్రజెంటేషన్ కార్యక్రమం ఉంటుందని తెలుపుతూ మరో లేఖను కూడా బోర్డు రెండు రాష్ట్రాలకు పంపించింది. అంటే బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ పదవీ విరమణకు ముందే ఇటు వర్కింగ్ మాన్యువల్‌తోపాటు అటు తెలంగాణ చెరువుల నీటి వినియోగంపై తుది నిర్ణయాలు తీసుకోబోతున్నారని అర్థమవుతున్నది. ఏపీ తెస్తున్న ఒత్తిడితోనే తెలంగాణకు వ్యతిరేకంగా శ్రీవాత్సవ నిర్ణయాలు తీసుకునేందుకు పథకం వేసినట్లు అనుమానించాల్సి వస్తున్నది.

సమావేశం వాయిదా వేయాలని కోరిన తెలంగాణ

ఈ నేపథ్యంలో 30వ తేదీనాటి సమావేశాలకు తాము హాజరుకాలేమని తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు కృష్ణాబోర్డుకు తెలిపారు. ఆ రోజున రాష్ట్రనీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎస్కే జోషితోపాటు, తాను వేరే కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని, ఆ కార్యక్రమాలు చాలా రోజుల ముందుగానే ఖరారయ్యాయని పేర్కొంటూ బోర్డు సభ్యకార్యదర్శికి లేఖ రాశారు. కాబట్టి 30వ తేదీన బోర్డు తలపెట్టిన సమావేశాన్ని వాయిదా వేసి, వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో నిర్వహించాలని కోరారు. ఈ స్థితిలో బోర్డు ఏం చేస్తుందో చూడాలి.



నేను కూడా రాజ్‌పుత్‌ను. ఒక రాజ్‌పుత్‌గా పద్మావత్ సినిమా కేంద్రంగా జరుగుతున్న హింసాదౌర్జన్యాలను తీవ్రంగా నిరసిస్తున్నాను. ముఖ్యంగా పాఠశాల పిల్లలపై దాడులు చేయటం హేయం. జరుగుతున్న హింసాకాండపై రాజ్‌పుత్ నేతలతో చర్చించటానికి నేను సిద్ధం. ఇప్పటికైనా హింసకు ముగింపు పలుకాలి.

మనీష్ సిసోడియా, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి

పద్మావత్ సినిమాను నిషేధించేవరకు మా ఆందోళన కొనసాగుతుంది. గుర్‌గాంలో పాఠశాల బస్సుపై జరిగిన సంఘటనపై సీబీఐ లేదా జ్యుడిషియల్ విచారణ జరిపించాలి. దాన్ని మేం ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. మేం అమాయక పిల్లలపై ఎప్పుడూ దాడులకు పాల్పడలేదు.

లోకేంద్రసింగ్ కల్వీ, రాజ్‌పుత్ కర్ణిసేన అధినేత




చరిత్రలో నేడు



1710

రష్యాలో మొదటి సారి 'బడ్జెట్'ను రూపొందించిన జార్ చక్రవర్తి పీటర్ ది గ్రేట్.

1880



విద్యుత్ బల్బ్‌ను తయారుచేసిన థామస్ ఎడిసన్.



1948

'టేప్ రికార్డర్' తయారీ. మార్కెట్‌లోకి విడుదల.

వివాదాస్పద 'రామ్ రహీమ్' ఉదంతంలో అల్లరిమూకలు చేసిన హింస, విధ్వంసకాండ నుంచి మన ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకున్నట్లు లేదు. 'పద్మావత్'సినిమాను వివాదం చేస్తూ కొన్నిశక్తులు సృష్టిస్తున్న హింస, దౌర్జన్యాలు, దహనకాండలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దేశరాజధాని ఢిల్లీకి సమీపంలోని గుర్‌గాంలో పాఠశాల విద్యార్థులపై జరిగిన దాడిని చూసి ప్రపంచం నివ్వెరపోతున్నది. ఒక వైపు ఆసియాన్ దేశాధినేతలను ఢిల్లీకి ఆహ్వానించి పెట్టుబడులను కోరుతున్న సమయంలోనే, ఇలాంటి హింసాకాండ జరుగటం దేశానికే సిగ్గుచేటు.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

సాధారణంగా 'బంద్'లు డిమాండ్లను, రాజకీయపార్టీల ఆకాంక్షలను ప్రజల ముందుకు తెస్తాయి. ఈ మధ్య కర్ణాటకలో నిర్వహిస్తున్న బంద్‌లు మరో అర్థాన్ని చెబుతున్నాయి. కర్ణాటక-గోవాల మధ్య మహాదాయి నదీ జలాల పంపకం విషయంలో తలెత్తిన వివాద నేపథ్యంలో కేంద్రం వైఖరికి నిరసనగా కొన్ని కన్నడ గ్రూపులు జనవరి 25, ఫిబ్రవరి 4న బంద్‌లు నిర్వహిస్తున్నాయి. అయితే ఒకే సమస్యపై రెండు బంద్‌లు నిర్వహించటం దేనికని అనుమానం రాకమానదు. ఈ రెండు బంద్‌ల రోజుల్లో బీజేపీ అగ్రనేతలు అమిత్‌షా, ప్రధాని పర్యటనలుండటం కాకతాళీయం కాదు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా జీవనాన్ని సంక్షోభంలోకి నెట్టడం సమర్థనీయం కాబోదు.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ఆసియాన్ అనుబంధం

ప్రధాని నరేంద్ర మోదీ రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఆతిథ్యం పేరిట సరికొత్త సమీకరణానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా గణతంత్ర దినోత్సవానికి ఏదో ఒకదేశాధినేతను అతిథిగా పిలువటం ఆనవాయితీ. కానీ ఈసారి ఏకంగా ఆగ్నేయాసియా పది దేశాల అధినేతలను రిపబ్లిక్ డే ఉత్సవాలకు అతిథులుగా ఆహ్వానించటంలో పెద్ద విశేషమే ఉన్నది. ఇప్పటివరకూ అనుసరిస్తున్న 'లుక్ ఈస్ట్' విధానానికి ప్రధాని మోదీ తన కార్యాచరణ 'యాక్ట్ ఈస్ట్'తో మరింత పదును పెట్టారు. ఏదో రూపంలో చైనా ఆధిపత్యాన్ని, వివాదాలను ఎదుర్కొంటున్న కొన్ని ఆగ్నేయాసియా దేశాలకు దన్నుగా భారత్ నిలుస్తుందన్న భరోసాతో ఆ దేశాలతో వర్తక, వాణిజ్య సంబంధాలతోపాటు, వ్యూహాత్మ ఒప్పందాలకు పునాది వేశారు. ఆగ్నేయాసియా దేశాలైన సింగపూర్, బ్రూనై, మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా, వియత్నాం, ఫిలిప్పీన్స్, లావోస్, కాంబోడియాలతో భారత్‌కు ఎలాంటి సరిహద్దుల్లేవు. కాబట్టి ఈ దేశాలతో ఎలాంటి వైరుధ్యాలు, వివాదాలూ లేవు. ఈ పది దేశాల జనాభా సుమారు 65 కోట్లు. వీటి ఉమ్మడి స్థూల జాతీయోత్పత్తి 2.60 లక్షల కోట్ల డాలర్లు. 120 కోట్ల జనాభాతో 2.26 లక్షల కోట్ల డాలర్ల జీడీపీ కలిగి ఉన్న భారత్‌తో మైత్రి సంబంధాలు రెండుపక్షాలకూ మేలు చేస్తుందనటంలో సందేహం లేదు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఆగ్నేయాసియా దేశాలకు దూరంగా ఉన్న భారత్ పీవీ నరసింహారావు పాలనాకాలం నుంచి సంబంధ బాంధవ్యాలకు పునాది పడింది. లుక్ ఈస్ట్ విధానానికి పునాది వేసిన పీవీ ఆగ్నేయాసియా దేశాలతో దౌత్య, వర్తక సంబంధాలకు అంకురార్పణ చేశారు. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో రష్యాకు అనుకూలంగా ఉన్న భారత్ సోవియట్ యూనియన్ పతనమైన తర్వాత క్రమంగా అమెరికాకు చేరువవుతూ వచ్చింది. ఆ క్రమంలోనే భారత్ ఆగ్నేయాసియా దేశాలతోనూ దౌత్యసంబధాలకు ప్రాముఖ్యం ఇస్తున్నది. ఈ నేపథ్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఆసియాన్ సదస్సుకు విశేష ప్రాధాన్యం ఉన్నది.

భౌగోళికంగా, ఆర్థికంగా ఆగ్నేయాసియా దేశాలతో అనుబంధం భారత్‌కు అన్నివిధాలా కలిసి వచ్చే అంశం. ఇప్పటికే ఇరుపక్షాల మధ్య వర్తక వాణిజ్యం ఏడు వేల కోట్ల డాలర్లకు చేరుకున్నది. భారత్‌తో వాణిజ్యంలో ఆసియాన్ దేశాలు నాలుగో అతి పెద్ద భాగస్వాములుగా ఉన్నాయి. ఈ వాణిజ్యాన్ని మరింత పెంచుకునే దేశగా ప్రయత్నిస్తున్నాయి. అయితే సువిశాల గ్రామీణ భారతంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం పట్ల అమితాసక్తితో ఉన్న ఆసియాన్ దేశాలు భారత్‌తో తమ వర్తక వాణిజ్యాలకు పెద్ద పీటవేసే దిశగా ఆలోచించటంలో ఆశ్చర్యం లేదు. దీంతో ఇరుపక్షాలకూ అనేక విధాలుగా లబ్ధి చేకూరుతుంది అనటంలో సందేహం లేదు. ఇలాంటి వ్యూహాత్మక భాగస్వామ్య విధానాల క్రమంలోంచే 2009లో ఆసియాన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత 2014లో దాన్ని వివిధ సేవలకు విస్తరించటంతో అనుబంధం మరింత బలపడింది. ఈ క్రమంలోనే ఆసియాన్ దేశాలతో విభిన్న రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవటానికి, కార్యాచరణ, సంభాషణలు జరుపటానికి 30రకాల బృందాలు ఏర్పాటయ్యాయి. విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం, పర్యాటకం, వ్యవసాయం, పర్యావరణం, పునరుత్పాదక ఇంధన వనరులు, టెలికమ్యూనికేషన్ల రంగాల్లో మంత్రుల స్థాయి సమావేశాలు కూడా జరుగుతున్నాయి. అయితే ఈ దేశాలతో వర్తక వాణిజ్యాలను కొనసాగిస్తున్న చైనాను తక్కువ అంచనా వేయటానికి లేదు. ఇప్పటికే అనేక విధాలుగా ఆ దేశాలను తన అదుపాజ్ఞల్లో ఉంచుకోవటానికి ఎత్తులు వేస్తున్నది. పెద్ద పెద్ద ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టి ఆయా దేశాలను గుప్పిట్లో పెట్టుకోవటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలోంచే ఢిల్లీ కేంద్రంగా భారత్-ఆసియాన్ దేశాలు ఢిల్లీ ప్రకటనను విడుదల చేయటం గమనార్హం.

> **ఏదేమైనా దౌత్య, వర్తక వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకోవటంలో భాగంగా దేశ దేశాలతో సంబంధ బాంధవ్యాలను పటిష్ఠపర్చుకోవటం మంచిదే. ఈ కోవలోనే ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం చేసుకోవాలనుకోవడం ఆహ్వానించదగిందే. కానీ చైనా ఆధిపత్యాన్ని నిలువరించే వ్యూహంలో భాగంగా కూటముల ఏకీకరణకు పాల్పడితే అది దీర్ఘకాలంలో అశాంతికి హేతువుగా మారే ప్రమాదమున్నది.**

ఆసియాన్ దేశాలతో వర్తకవాణిజ్యాలు ఒక ఎత్తు అయితే, దక్షిణ చైనా సముద్రంలో ఆధిపత్యాన్ని నెరుపుతున్న చైనా విధానాలకు చెక్ పెట్టడం కూడా మోదీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తున్నది. తూర్పు-పడమరలను ఏకం చేసేందుకు చైనా తలపెట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ) ప్రాజెక్టులో ఆసియాన్ దేశాలు భాగస్వాములుగా ఉన్నా, చాలా విషయాల్లో ఆ ప్రాజెక్టు విషయంలో అభ్యంతరాలున్నాయి. కానీ చైనా ఆర్థికశక్తితో తాను చెప్పిందే వేదంగా, చేసిందే సరియైనదిగా దూసుకుపోతున్నది. ఈ ఫిలిప్పీన్స్, మలేషియా, సింగపూర్, వియత్నాం లాంటి దేశాలతో సరిహద్దు వివాదాలున్నా చైనా తన ఆధిపత్యంతో అన్నింటినీ తనకు అనుకూలంగా సరిపెట్టుకుపోతున్నది. పెద్దన్న పాత్రతో ఆగ్నేయాసియా దేశాల నోళ్లు మూయిస్తున్నది. ఇట్లాంటి పరిస్థితుల్లోనే ఢిల్లీలో ఆసియాన్‌దేశాలు-భారత్ సంయుక్తంగా దక్షిణా చైనా సముద్రంలో ప్రవర్తనా నియమావళిని తర్వగా అమలులోకి తీసుకురావాలని స్పష్టం చేయటం గమనించదగినది. ఏదేమైనా దౌత్య, వర్తక వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చుకోవటంలో భాగంగా దేశ దేశాలతో సంబంధబాంధవ్యాలను పటిష్ఠపర్చుకోవటం మంచిదే. ఈ కోవలోనే ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం చేసుకోవాలనుకోవడం ఆహ్వానించదగిందే. కానీ చైనా ఆధిపత్యాన్ని నిలువరించే వ్యూహంలో భాగంగా కూటముల ఏకీకరణకు పాల్పడితే అది దీర్ఘకాలంలో అశాంతికి హేతువుగా మారే ప్రమాదమున్నది. ఏకీకరణలు, పునరేకీకరణలు ఉద్రిక్తతలకు, ఆధిపత్యాలకు నెలవుగా మారకూడదు. ఈ అర్థంలో ఢిల్లీ ఆసియాన్ సదస్సును ఆహ్వానిద్దాం.

జనగళం

ఇంకుడు గుంతల నిర్మాణం

ఇంకుడు గుంతల నిర్మాణంతో ఎన్నో ప్రయోజనాలుంటాయి. ప్రధాన నగరాల్లో వర్షపు నీరు భూమిలో ఇంకేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. ఇవి మంచి ఫలితాలిచ్చాయి. అయితే ఇంకా క్షేత్రస్థాయిలో దీన్ని అమలుచేయాలి. ప్రతి వర్షపు చుక్క వినియోగమయ్యేలా చూడాలి. రాష్ట్రంలో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వరంలో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. కానీ నగర ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించాలి. అందరూ ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకునేలా చూడాలి. అప్పుడు భూగర్భజలాలు పైకి వచ్చి నీటి కొరత తీరుతుంది. అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

- ఎం.సంజీవ్, హైదరాబాద్

పౌరసమాజం బాధ్యత

ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం విజయవంతం కావాలంటే పౌరసమాజం బాధ్యత ప్రధానం. కొన్ని గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా చెట్లు నాటి వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు. వాటి సంరక్షణ బాధ్యత గ్రామపంచాయితీతో పాటు ప్రజలు తీసుకున్నారు. ఎవరి ఇంటిముందు చెట్టు ఉంటే దాని సంరక్షణ బాధ్యత వాళ్లే తీసుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చారు. అలా ప్రజలు తమ బాధ్యతను తాము నిర్వర్తిస్తే పచ్చని తెలంగాణ ఆవిష్కృతమవుతుంది.

- వి.సతీష్, వనపర్తి

మరిన్ని బస్సులు నడుపాలె

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ నడిపే పల్లెవెలుగు బస్సుల సర్వీసులు బాగున్నాయి. అయితే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో మరిన్ని బస్సులు నడుపాలి. ఎందుకంటే నిర్ణీత సమయంలో బస్సులు రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ బస్సులు నడిపితే ఈ సమస్యను అధిగమించవచ్చు.

- జి.అజయ్, జమ్మికుంట, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ముక్తసరి



దేవులపల్లి ప్రభాకరరావు

సబర్మతీ ఏమీగతి!

డెబ్బై ఏండ్ల కిందట జనవరి 30 సకల భారతావనిని, సమ స్త ప్రపంచాన్ని, అన్ని దేశాలను, అన్ని మతాలను, జాతులను, మొత్తం మానవాళిని అపార విషాదంలో ముంచిన రోజు. ప్రపంచంలోని ప్రజలందరూ విభేదాలన్నింటికీ అతీతంగా తమ ఒక ఆత్మీయుడిని, ఆశాజ్యోతిని, మార్గదర్శిని కోల్పోయినట్లు విలపించిన రోజది. 'తీస్ జనవరి షామ్‌కు బాపు బిర్లా ఘర్ సే బాహ ర్ ఆయే'.. పాట రికార్డు ఆ రోజుల్లో ఊరూరా, వాడ వాడ, ఇంటింటా వినిపించి, ప్రతిధ్వనించి విషాదం కలిగించేది.

గుండెను పిండే ఆ పాట విన్న పిదప చెమ్మగిల్లని కన్నులుండకపోయేవి. ఇటీవలి సంవత్సరాలలో ఆ పాట వినిపించడం లేదు. ఆ విషాద గీతం వీనులలో వినిపిస్తున్నవారు, ఆ గీతాన్ని నెమరువేసుకొని హృదయాలను ద్రవింపజేసుకుంటున్నవారు ఈ రోజుల్లో బహుశా ఎక్కువమంది ఉండరు. గాంధీజీ అంటే సుల్తాన్‌బజార్‌లోని 'గాంధీ కిరాణా స్టోర్ ఓనరా' అన్న అనుమానం కలుగుతున్న రోజుల్లో, సినిమాల పేర్లు మాత్రమే తటుక్కున జ్ఞాపకంవచ్చే పరిజ్ఞానం మాత్రమే ఉన్న పరిస్థితిలో ఓ కవి జాతిపిత గాంధీజీ చివరి క్షణాలపై సమర్పించిన అక్షర నీరాజనం జ్ఞాపకం ఉంటుందనుకోలేం. ఆ రోజు, డెబ్బై ఏండ్ల కిందట జనవరి 30 సాయంకాలం వేళ గాంధీజీ బిర్లా ఘర్‌కు వాపస్ పోలేదు. ఆ మహాత్ముని పార్థివశరీరాన్ని, రక్తసిక్తమైన దేహాన్ని కొందరు లేపి, హృదయభారంతో మోసుకొని లోపలికి తీసుకువెళ్లారు. ఆరోజు పగలు ఉప ప్రధాని, దేశ వ్యవహారాల మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో సుదీర్ఘ చర్చల కారణంగా సాయంత్రం ప్రార్థనా సమావేశంలో పాల్గొనడానికి ఆలస్యమైందని గాంధీజీ త్వర త్వరగా అడుగులువేస్తూ ప్రార్థనా వేదిక వైపు నడిచారు. రోజటి వలె సభికులకు గాంధీజీ నమస్కారం చేస్తుండగానే ఒక మతోన్మాది ముసుగుతో ముందుకు తోసుకుంటూ వచ్చి ఆ మహాత్ముని ఛాతీమీదికి తన చేతిలోని పిస్టల్‌తో మూడు బుల్లెట్లను పేల్చాడు. పడగవిప్పి బుసలుకొట్టిన భయంకర, అమానుష మతోన్మాదానికి, మతోన్మాదంతో మతిభ్రమించిన ఒక దుండగుని, మూఢుడి మూడు బుల్లెట్లకు గురై భారత జాతిపిత గాంధీ మహాత్ముడు అస్తమించాడు. ఇది ఆ రోజు సాయంత్రం రోజటి వలెనే గాంధీజీ ప్రార్థనా సందేశం వినడానికి అక్కడికి చేరిన వేలాది సభికులు, ప్రేక్షకుల కళ్లముందు సంభవించిన విషాదకర సంఘటన. సకల ప్రపంచాన్ని దుఃఖ సముద్రంలో ముంచిన సంఘటన. అయినప్పటికీ, శాంతిదూత, అహింసామూర్తి, సత్యాన్వేషి, గాంధీజీ భారత ప్రజల మధ్య భౌతికంగా లేనప్పటికీ మతోన్మాదులు సహించలేకపోతున్నారు. గాంధీజీ ఆత్మకు అశాంతి కలిగించే కుట్రలు, అకృత్యాలు అనేకం జరుగుతున్నాయి. ఇటీవల 4వ బుల్లెట్ కథ ఒకటి ప్రచారంలోకి వచ్చి, సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. మతోన్మాది నాథూరామ్ గాడ్సే మూడు బుల్లెట్లు గాంధీజీని చంపలేదని, నాలుగవ బుల్లెట్ మహాత్ముని హత్యకు కారణమన్నది మతోన్మాద పైత్యం ప్రకోపించినవాళ్ల కుట్ర తాత్పర్యం. వీళ్ల కుట్ర ఫలించలేదు. గాంధీజీ హత్యపై తిరిగి విచారణ జరిపించాలన్న దుష్ట ప్రయత్నం చిత్తయింది. గాంధీజీ హత్యపై పునర్విచారణ అవసరమన్న విషపూరిత వాదనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. గాడ్సేకు గుళ్లు కట్టించి పూజలు జరిపించాలనుకుంటున్న వాళ్లకు ఆశాభంగం తప్పలేదు. అయినా, గాంధీజీ హత్యతో ఆరంభమైన మతోన్మాదుల పరమత ద్వేషం, అసహనం అంతటితో ఆగలేదు. గాంధీజీ హత్య అనంతరం గత డెబ్బై ఏండ్లలో అసహనశక్తుల అరాచకత్వం, పైశాచిక ధోరణి కట్టలు తెంచుకు విజృంభించాయి. సహనన శక్తుల అనైక్యత, స్పర్ధలు, ఛిద్రాలు, అసహనశక్తుల విజృంభణ జ్వాలలకు ఆజ్యంగా ఉపకరిస్తున్నాయి.

డెబ్బై ఏండ్ల కిందట ఈవేళ గాంధీజీ తన జీవితం, తన ఉద్యమం అప్పుడే ఆగిపోతాయనుకోలేదు. "My Life is My Mission" అని భావించిన గాంధీజీ తన జీవితం అప్పుడే ముగియనుందని, మతోన్మాదానికి వ్యతిరేకంగా నౌఖాలీలో, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో తాను నిర్వహిస్తున్న కార్యకలాపాలు, శాంతిస్థాపన యత్నాలు నిలిచిపోతాయని ఊహించలేదు. శాంతియుత, మత సామరస్య, సహనశీల, విద్వేషరహిత, సమసమాజ, నవభారత నిర్మాణంలో తాను నిర్వహించవలసిన పాత్ర ఇంకా ఎంతో ఉందని గాంధీజీ భావించారు. తన హత్యకు రెండు రోజుల ముందు 1948 జనవరి 27న ఉదయం గాంధీజీ 'హరిజన్' పత్రికలో ప్రచురణకు పంపిన సందేశంలోని వాక్యాలివి.. "..The Con-gress has won for us poitical freeodm, but it has yet to win economic freedom for the people and social fre-edom and moral life. These freedoms are harder to achieve than political freedom, if only because they are constructive..." దేశానికి లభించిన రాజకీయ స్వాతంత్ర్యం గాంధీజీకి సంతృప్తి కలిగించలేదు. ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యం, నైతిక జీవనం దేశప్రజలకు అత్యావశ్యకమని గాంధీజీ గాఢంగా విశ్వసించారు. డెబ్బై ఏండ్ల స్వాతంత్ర్యం పిదప ఈరోజు తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం గాంధీజీ విశ్వాసానికి అనుగుణంగా, ఆయన కలలు కల్లలు గాకుండా చేయడానికి రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యం కోసం, తద్వారా నైతిక జీవనం కోసం (అధ్యాత్మిక వాతావరణాన్ని కూడా సృష్టించడం ద్వారా) అహోరాత్రులు అవరోధాలను ఎదుర్కొంటూ అవిరళ, నిర్విరామ కృషి కొనసాగిస్తున్నది. ప్రతిరోజు వలెనే ఆ రోజు కూడా గాంధీజీకి ఉదయం (సూర్యోదయం కంటే ముందే) 3 గంటల నుంచే క్షణం తీరికలేదు. ప్రఖ్యాత బ్రిటిష్ జర్నలిస్ట్, సంపాదకుడు కింగ్‌స్లీ మార్టిన్ ఆ రోజంతా గాంధీజీని ఇంటర్వ్యూ చేశారు. ఆరోజు ఢిల్లీ సమీపంలో మెహ్రౌలీలో ఒక ఉర్స్ కార్యక్రమంలో పాల్గొని గాంధీజీ మనస్పర్థలు, వైషమ్యాలు మంచివికావని హిందువులు, ముస్లింలు, సిక్కులు, తదితర మతాల వారికి విజ్ఞప్తి చేశారు. గాంధీజీ హత్యకు రెండు రోజల ముందు 1948 జనవరి 28వ తేదీన అమెరికన్ పత్రికా రచయిత, గ్రంథకర్త, గాంధీజీ విదేశీ అభిమానుల్లో ప్రముఖుడు, గాంధీజీ జీవిత చరిత్ర రచయిత విన్సెంట్ షీన్ కూడా ఆయనను (గాంధీజీని) ఇంటర్వ్యూ చేశారు. కింగ్‌స్లీ మార్టిన్, విన్సెంట్ షీన్ జరిపిన ఇంటర్వ్యూలలో గాంధీజీ ఎంతో ఓపికతో తన అహింసా సిద్ధాంతాలను, శైశవ దశలో స్వతంత్ర భారతదేశంలో ఎదుర్కొంటున్న సమస్యలను, భవిష్యత్ భారతదేశం పట్ల తన స్వప్నాలను వివరించారు. జనవరి 27 సాయంత్రం ప్రార్థనా సమావేశంలో గాంధీజీ జమ్మూ-కాశ్మీర్‌లో పాకిస్థాన్ జరుపుతున్న దాడుల గురించి ప్రస్తావించి ఈ మాటలు అన్నారు.. "..I must ask the raiders and the Government of Pakistan, for the sake of humanity and for the sake of God to return all the abducted with due respect. It is their duty to do so. I have enough knowledge of Islam..." విన్సెంట్ షీన్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా గాంధీజీ "..I do not go by reuslts. It is enough, if I take care of the means..." తమ గమ్యాలను చేరడానికి మార్గం ఏదైనా, సాధనం ఏదైనా ఫరవాలేదననే వారికి ఇది గాంధీజీ ఇచ్చిన సమాధానం. 1948 జనవరి 26వ తేదీ ప్రార్థనా సమావేశంలో సందేశం ఇస్తూ గాంధీజీ అన్నారు.. "Independence me-ans equality of all classes and creeds in India, never the domination fo the major community over the mi-nor ones...."

దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి 125 ఏండ్లు జీవించాలనుకున్నారు గాంధీజీ. తన జీవితకాలంలోనే దేశ సమస్యలు పరిష్కారం కావాలని గాంధీజీ తపించారు. భారత జాతీయ కాంగ్రెస్ నియమావళికి కాలదోషం పట్టిందని, నియమావళిలో మార్పులు జరుగాలని ఆయన తన చివరి రోజు జనవరి 30 నాడు కూడా ఆలోచించారు. అంతకుముందు రోజు జనవరి 29నాడు ఆయన నియమావళి మార్పుల గురించి (భారత జాతీయ కాంగ్రెస్‌ను లోక్‌సేవక్ సంఘ్‌గా మార్చడానికి) జవహర్‌లాల్ నెహ్రూ, బాబు రాజేంద్రప్రసాద్, రాజ్‌కుమారి అమృతకౌర్, ఆర్.ఆర్.దివాకర్, ఆచార్య జుగల్ కిషోర్ తదితర నాయకులతో చర్చించారు. 1948 నాటికి గాంధీజీ వయస్సు 79 ఏండ్లు. జనవరి 29 రోజు, తన నిష్క్రమణకు ఒకరోజు ముందు సహచరులతో గాంధీజీ అన్నారు.. "I am very tired. Yet I must finish this task.." జనవరి 30 ఉదయం గాంధీజీ తన నిత్య సహచరి, మనుమరాలు మనూగాంధీకి ఒక ఉర్దూగీతంలోని ఒక వాక్యాన్ని చదివి వినిపించారు. ఈ వాక్యం అర్థం.. 'ప్రపంచ ఉద్యానవనంలో వసంతం కొద్దిరోజులే ఉంటుంది. ఈ వసంతాన్ని కొదిసేపు చూడాలె'. గాంధీజీ మానవాళికి, ప్రపంచానికి, తన మాతృభూమికి శాశ్వత విలువలున్న సత్యం, అహింస అమూల్య సిద్ధాంతాలను ప్రసాదించారు. తన సిద్ధాంతాలకు పవిత్ర ప్రతిబింబాలుగా, తన ఉద్యమాల నిర్వహణ కేంద్రాలుగా, భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకంగా, గాంధీజీ సబర్మతి ఆశ్రమాన్ని (1917లో), తర్వాత వార్ధా ఆశ్రమాన్ని స్థాపించారు. ఆది శంకరాచార్యులు దేశం నలుమూలలా పీఠాలను స్థాపించినట్లు. 1930 మార్చి 12వ తేదీన సబర్మతి ఆశ్రమం నుంచే గాంధీజీ చరిత్రాత్మక దండియాత్ర ప్రారంభించారు. సబర్మతిలో పన్నెండేండ్లు, వార్ధాలో పన్నెండేండ్లు క్రియాత్మక జీవితం గడిపి గాంధీజీ భారతజాతీయ, స్వాతంత్ర్య ఉద్యమాలకు నాయకత్వం వహించారు. దండియాత్ర తర్వాత గాంధీజీ స్వాతంత్ర్యం దొరికేవరకు తిరిగి సబర్మతిలో అడుగుపెట్టబోనని ప్రతిజ్ఞ చేశారు. కేవలం హింసా సిద్ధాంతాల్లో మాత్రమే ప్రబల విశ్వాసం ఉన్న అధినేతలు, సత్యం, అహింస, సహనం సిద్ధాంతాలను అపహాస్యం చేసే నేతలు తన పవిత్ర ఆశ్రమం సబర్మతిలో అడుగుపెట్టి ఊయల ఊగుతారని, పతంగులు ఆడుతారని, సబర్మతి పవిత్రస్థలాన్ని కప పరిష్వంగ కేంద్రంగా మార్చుతారని, అపవిత్రం చేస్తారని బహుశా గాంధీజీ కలలోనైనా ఊహించి ఉండడు!

> **1930 మార్చి 12వ తేదీన సబర్మతి ఆశ్రమం నుంచే గాంధీజీ చరిత్రాత్మక దండియాత్ర ప్రారంభించారు. సబర్మతిలో పన్నెండేండ్లు, వార్ధాలో పన్నెండేండ్లు క్రియాత్మక జీవితం గడిపి గాంధీజీ భారతజాతీయ, స్వాతంత్ర్య ఉద్యమాలకు నాయకత్వం వహించారు. దండియాత్ర తర్వాత గాంధీజీ స్వాతంత్ర్యం దొరికేవరకు తిరిగి సబర్మతిలో అడుగుపెట్టబోనని ప్రతిజ్ఞ చేశారు.**

శతవసంతాల పెండ్యాల

స్మరణ



కొండపల్లి నీహారిణి

తెలంగాణ చైతన్య దీప్తులను ప్రసరిస్తున్న ఈ వేళ.. తన చరిత్రనంతా శతవత్సరాల నుంచి తవ్వుకొంటున్నది. పారేసుకున్న చోటనే ఎత్తుకోవాలని ఎతుకులాటలో పడింది. ఇది పెండ్యాల రాఘవరావుగారి విషయంలో సందర్భానికి తగినట్టు పండుగ చేసుకుంటున్నది.1917లో పుట్టిన రాఘవరావుగారి రాజకీయ, సాంఘిక, సామాజిక, సాహిత్య జీవనగమనాన్ని నేటితరానికి తెలుపాల్సిన బాధ్యత మనది. 1952 మొదటి సార్వత్రిక ఎన్నికల్లో ఏకకాలంలో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాల్లో పోటీచేసి గెలిచిన రాఘవరావు ఆదర్శ జీవితం కొత్తతరాలకు స్ఫూర్తిదాయకం.

చిన్నపెండ్యాల గ్రామం పెండ్యాల రాఘవరావుగారు పుట్టిన ఊరు. ఆనాడు వరంగల్ జిల్లాలో ఉండేది. ఇప్పుడు జనగాం జిల్లాలో ఉన్నది. వీరి తల్లిదండ్రులు పిరాట్యమ్మ, పెండ్యాల రామచంద్రారావులు. రాఘవరావు భూస్వామ్య కుటుంబంలో పుట్టినా గర్వం అనేది లేకుండా సమానత్వ భావనతో పెరిగారు. తనదైన నూతన చైతన్యాత్మక దృష్టికోణంతో సమాజాన్ని పరిశీలించారు. విప్లవ యోధుడుగా ప్రజల పక్షాన నిలిచాడు. ఆ కాలపు గడ్డు జీవనాన్ని, స్వేచ్ఛారహిత జీవనాన్ని చూసి కారణాలను వెతుక్కుంటూ పరిష్కారాలను కనుగొన్నాడు.1936 నుంచి దేశ స్వాతంత్ర్య సంగ్రామాలు ఉధృతమైనవి.1938లో స్వాతంత్ర్య పోరాటంలో మొట్టమొదటి సత్యాగ్రహాన్ని వరంగల్ బీట్ బజార్‌లో చేయడంతో రాఘవరావు అరెస్ట్ అయ్యారు. తబ్లీగ్ ఉద్యమం, నిజాం అనుయాయులు చేస్తున్న దారుణాలకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టాడు. అసమానతలు, అంటరానితనం రూపుమాపాలన్నారు.

ఆర్యసమాజం కార్యక్రమాలతో ప్రజాజీవితాన్ని ప్రారంభించి దళితులకు తమ ఇంట్లోకి తీసుకొచ్చి తన సంస్కరణ ఉద్యమాన్ని తన ఇంటి నుంచే ప్రారంభించాడు. ఈ క్రమంలో కన్నతండ్రిని ఎదిరించాడు. ఈ విధమైన కార్యాచరణతో ఇదేదో పిచ్చి పట్టిందని అనుకున్న కుటుంబసభ్యులు రాఘవరావుకు భూత వైద్యం చేయించే పనికి పూనుకున్నారు. నిమ్మకాయలతో విభూతులతో మంత్రతంత్రాలు చేయించారు. కర్రెకోడి తిప్పడాలు, భూతవైద్యునితో తాయెత్తు కట్టించడాలు వంటివెన్నో చేశారు. అయినా దెయ్యం వదలలేదు.., ఆయన మరిన్ని సంఘసంస్కరణ ఉద్యమాలకు పూనుకున్నాడు.'రాజు పోతాడు, ప్రజలే ప్రభుత్వాన్ని నిర్మించుకుంటారు, కులాలు మధ్య అంతరాలొద్దు, అంతా సమానమే, అంటరానితనం మహాపాపం' అనే నినాదాలతో ఊరూరా తిరిగాడు. ప్రజల్లో ఉన్న సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పర్చాడు. పెండ్యాల, చుట్టుపక్కల ఊళ్లనుంచి హరిజనులు (ఆనాడు అట్లే పిలిచేవారు) హైదరాబాద్‌కు తీసుకొని పోయి, సహపంక్తి భోజనాలు, ఉపన్యాసాలు వంటివి వినిపించేవాడు. ఇలాంటి కార్యక్రమాలతో సాటి కుల పెద్దలు ఆయన్ను ఇంటి నుంచే కాదు, కులం నుంచి బహిష్కరించారు. దీంతో ఆయన మరింత స్వేచ్ఛ లభించినట్లుగా భావించి ఊరూరా తిరుగుతూ స్వాతంత్ర్య ప్రచారోద్యమాన్ని నిర్వహించాడు. నాటి నిజాం నిరంకుశ రాజ్యంలో 'నా స్టేట్ నా ఇష్టం' అంటూ ఎదిరించి 'ఓం' జెండాను ఎగురవేసిన ఘనుడాయన. ఆంధ్ర మహాసభలో జాతీయపక్ష కార్యకర్తగా ఎన్నోపనులు చేశారు. అవిద్యే అన్ని అనర్థాలకు కారణమని ఊళ్ళల్లో పాఠశాలలు పెట్టించాడు. గ్రంథాలయాలు స్థాపించాడు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలకు లెక్క చేయక తెగించిపోరాడిన రాఘవరావుగారిని ఆనాడు ప్రజలు తమ గుండెల్లో దాచుకునే వారు. రకరకాల మారువేశాలతో బుడుబుక్కలవారిగా, గంగిరెద్దుల వారిగా, స్త్రీ రూపంలో, బిచ్చగాడిగా, మార్వాడీ సేటుగా.. ఇట్లా రకరకాల మారు రూపాలతో ఊళ్ళు తిరిగి తాము చేయాలనుకునే కార్యక్రమాలను నిర్వహించాడు.

రాఘవరావు గారి దీక్షా దక్షతను, ధైర్య సాహసాలను నాటి పెద్దమనుషులు మిగిలినవాళ్ళు కళ్ళ ముందుకు తెచ్చుకుంటూ ఎన్నో సాహస గాథలను ఇప్పటికీ వినిపిస్తుంటారు. అజ్ఞాత వీరునిగా ఎన్నో ఏండ్లు ఇటు జనగాం నుంచి అటు వరంగల్ వరకు గల ఊళ్ళన్నీ తిరుగుతూ కమ్యూనిస్టు నాయకునిగా ప్రజలలో చైతన్యాన్ని కలిగిస్తూ ఉద్యమస్ఫూర్తిని నింపాడు. రజాకార్ల దోపిడీ దౌర్జన్య కాండకాలంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని భూస్వాములను ఎదిరించి పోరాడాడు రాఘవరావు . ఇందులో విసునూరు దొరపై వీరి విజయం గొప్పది. అక్కడ చాకలి ఐలమ్మ భూమి దొర వశం కాకుండా పెండ్యాల రాఘవరావు దళం ఎంతో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నది.

రాఘవరావుగారిని యూనియన్ సైన్యాలొచ్చి అరెస్టు చేసి 'జాల్నా' జైలుకు పంపించి కఠిన శిక్షలు వేశారు. ఈ క్రమంలోనే స్వాతంత్ర్యోద్యమం ఉధృతం కావటం, భారత యూనియన్ సైన్యాల ముందు నిజాం లొంగిపోవటం, హైదరాబాద్ ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు వెంట వెంటనే చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే మూడేండ్ల జైలు జీవితం తర్వాత మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. అప్పుడాయన మూడు స్థానాల్లో పోటీ చేసి అన్నింట్లో గెలుపొందటం చరిత్రాత్మకం.

ఆ రోజుల్లో కమ్యూనిస్టులపై నిషేధం ఉండింది. పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా జైలు నుంచే నామినేషన్ వేసిన రాఘవరావు విడుదలయ్యారు. వరంగల్ లోక్‌సభ స్థానాన్ని, హనుమకొండ, వర్ధన్నపేట శాసనసభ స్థానాలనూ గెలుచుకున్నారు.1952 నుంచి 1957 వరకు పార్లమెంట్ సభ్యులుగా సేవలు అందించిన పెండ్యాల రాజకీయ జీవితం స్ఫూర్తిదాయకం.

పార్లమెంట్‌లో పెండ్యాల గారు ప్రజాగళం వినిపించాలని కమ్యూనిస్టు పార్టీ ఆలోచించి ఎంపీ స్థానాన్నే ఎన్నుకోమన్నారు. హిందీ, ఉర్దూ భాషలోల అనర్గళంగా మాట్లాడగలిగే రాఘవరావుగారు తమదైన భావ పటిమతో ఎన్ని ప్రజోపయోగ చర్చల్లో పాల్గొన్నారు.

సంస్థానాలు విలీనమైనందుకు జమీందార్లకు, దేశ్‌ముఖ్‌లకు లక్షల్లో పారితోషికాలు ఇస్తూ, పేదలకు కనీస వేతనం కూడా ఇవ్వరా? అని పార్లమెంటులో ప్రభుతాన్ని నిలదీశాడట. రైతు కూలీల పక్షాన నిలిచి రుణాలు, సమస్యల గురించి నిరంతరం పోరాడారు. స్త్రీల హక్కుల విషయమై చర్చకు వచ్చినప్పుడు నష్టాలు, కట్టుబాట్లు అనేవి పేద స్త్రీలకే కాదు అన్నివర్గాల వారికీ ఉన్నాయనీ మహిళా సాధికారతతోనే స్త్రీకి స్వేచ్ఛ లభిస్తుందని మహిళల పక్షాన మాట్లాడారు. స్త్రీలు విద్యావంతులైతేనే దేశం అభివృద్ధి చెందుతుందని వాదించారు. 1954 మే 20న రాఘవరావుగారు పార్లమెంట్‌లో గీతకార్మికుల విషయమై చట్టం తెప్పించడానికి ప్రతిపాదనలు చేశారు. 1953-54లో బడ్జెట్ సవరణ విషయంలో రాఘవరావుగారు స్థానిక సమస్యలను వివరిస్తూ.. తాటిబెల్లం తయారీ, విషయమూ, ప్రత్యేక వివాహాల విషయమూ చెప్తూ బడ్జెట్ కేటాయింపులు చేసేలా పోరాడారు. ప్రజా హృదయాలను గెలుచుకున్న పెండ్యాల రాఘవరావుగారు 1987 న స్వర్గస్థులయ్యారు.

నేడు పెండ్యాల రాఘవరావుగారి శతజయంతి సందర్భంగా ఆయన స్వగ్రామం చిన్నపెండ్యాలలో విగ్రహస్థాపన చేస్తూ సభను నిర్వహించడం ముదావహం, స్ఫూర్తిదాయకం.

(నేడు పెండ్యాల రాఘవరావు శతజయంతి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



డిల్లీలోని రాజ్‌పథ్‌లో గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం కవాతు నిర్వహిస్తున్న పదాతి దళాలు (ఇన్‌సెట్‌లో) గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, ఆసియాన్ దేశాధినేతలు



అద్వితీయం.. అపూర్వం

న్యూఢిల్లీ, జనవరి 26:

డిల్లీలోని రాజ్‌పథ్‌లో శుక్రవారం చారిత్రక సన్నివేశం ఆవిష్కృతమైంది. 69వ గణతంత్ర వేడుకలు కన్నులపండువగా సాగగా, తొలిసారిగా పది దేశాల అధినేతలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రాజ్‌పథ్‌లో వేల మంది సమక్షంలో గణతంత్ర సంబురాలు అంబరాన్ని తాకాయి. సైనిక కవాతు, దేశభక్తి నినాదాలతో రైసినాహిల్స్‌లోని పొగమంచు కరిగిపోయింది. అంతకుముందు ఇండియా గేట్‌లోని అమర్‌జవాన్ జ్యోతి వద్ద ప్రధాని మోదీ, రక్షణమంత్రి నిర్మలాసీతారామన్, త్రివిధ దళాధిపతులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ప్రధాని మోదీ కాషాయం, ఎరుపు, ఆకుపచ్చరంగులతో కూడిన తలపాగాను ధరించారు. లెఫ్టినెంట్ జనరల్ ఆసిత్ మిస్త్రీ కవాతుకు నాయకత్వం వహించారు. త్రివిధ దళాధిపతి హోదాలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సైనిక గౌరవవందనాన్ని స్వీకరించారు. కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల్ని హతమార్చి తానూ ప్రాణాలు కోల్పోయిన వాయుసేన గరుడ్ కమెండో జ్యోతిప్రకాశ్ నిరాలాకు దేశ అత్యున్నత సైనిక పురస్కారం అశోకచక్రను ప్రభుత్వం ప్రకటించింది. నిరాలా తరపున ఆయన భార్య సుష్మానంద్, తల్లి మాలతీదేవి రాష్ట్రపతి కోవింద్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. త్రివర్ణ పతాక ఆవిష్కరణ తర్వాత జాతీయగీతాలాపనతోపాటు ఆనవాయితీగా 21తుపాకులను గాల్లోకి పేల్చి జవాన్లు గౌరవవందనం సమర్పించారు. వేడుకల ముగింపులోనూ జాతీయ గీతాన్ని ఆలపించడంతోపాటే వేలాది మువ్వన్నెల బెలూన్లను గాల్లోకి విడిచిపెట్టారు. రాజ్‌పథ్‌లోని రిపబ్లిక్‌డే వేడుకలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ సహా పలువురు కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

రాజ్‌పథ్‌లో చారిత్రక 'గణతంత్ర' ఘట్టం

తొలిసారిగా 10 ఆసియాన్ సభ్యదేశాల అధినేతలు హాజరు

ఆకట్టుకున్న సైనిక విన్యాసాలు.. అలరించిన శకటాలు

ఆకట్టుకున్న కవాతు

గణతంత్ర వేడుకల్లో 'ఆసియాన్' పతాకాన్ని చేబూని సైనిక దళాలు కవాతు ప్రారంభించాయి. పది సభ్య దేశాల పతాకాలనూ ఇందులో ప్రదర్శించారు. సరిహద్దు భద్రతాదళం(బీఎస్‌ఎఫ్)కు చెందిన 'సీమాభవాని' మహిళా కమెండోల బృందం ప్రదర్శించిన మోటార్‌బైక్ విన్యాసం వీక్షకుల ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది. వారు ప్రదర్శన సాగుతున్నంతసేపు రాష్ట్రపతి కోవింద్‌తో పాటు, ఆసియాన్ దేశాధినేతలు హర్షధ్వానాలు చేశారు. భారత సైన్యానికి చెందిన టీ-90 యుద్ధట్యాంక్ 'భీష్మ', బాల్‌వే మెషీన్ పికెట్, బ్రహ్మోస్ క్షిపణి విధ్వంసక వ్యవస్థ, ఆయుధాలను గుర్తించే రాడార్ 'స్వాతి', బ్రిడ్జిలేయింగ్ ట్యాంకర్ టీ-72, ఆకాశ్, తేజస్ క్షిపణులను ప్రదర్శించారు. తర్వాత అశ్వికదళాలు, వివిధ రెజిమెంట్ల సైనిక బృందాలు కవాతులో పాల్గొన్నాయి. 144మంది యువనావికులతో భారత నౌకాదళం, బీఎస్‌ఎఫ్, పారామిలిటరీ, పోలీసు బలగాలు వాటిని అనుసరించాయి. తీరగస్తీ బృందాలు, ఒంటెలతో కూడిన సైనిక దళం, సశస్త్ర సీమాబల్, ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసులు, ఢిల్లీ పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కూడా మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. భారత వాయుసేన నిర్వహించిన గగనతల విన్యాసాలు మొత్తం కార్యక్రమంలో హైలెట్‌గా నిలిచాయి. తొలిసారిగా అత్యాధునిక యుద్ధవిమానం 'రుద్ర'ను ఈసారి వేడుకల్లో ప్రదర్శించారు. సూపర్ హెర్క్యులస్, నేత్ర, సీ-17, సుఖోయ్-30ఎంకేఐ యుద్ధ విమానాలు వరుసగా గాలిలో చక్కర్లు కొడుతూ చేసిన ప్రదర్శను చూసేందుకు రెండుకండ్లూ చాలలేదు.

ఆసియాన్ ఐక్య సందేశం

69వ రిపబ్లిక్ వేడుకలకు మయన్మార్ స్టేట్ కౌన్సిలర్ అంగ్‌సాన్ సూకీ, వియత్నాం ప్రధాని ఎన్‌గుయెన్ జువాన్ ఫూక్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టె, ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో, థాయ్‌లాండ్, సింగపూర్ ప్రధానులు ప్రయూత్ చానోచా, లీసీయెన్ లూంగ్, బ్రూనై సుల్తాన్ హాజీ హసన్‌లాల్ బోల్కియా, మలేషియా, కాంబోడియా, లావోస్ ప్రధానులు వరుసగా నజీబ్ రజాక్, హున్‌సేన్, తోంగియన్ సిసోలిత్ తదితరులు హాజరయ్యారు. ప్రపంచ జనాభాలో నాల్గోవంతు (185కోట్ల మంది) భారత్ సహా ఆసియాన్ దేశాల్లోనే ఉండటం గమనార్హం. చైనా ప్రాబల్యానికి అడ్డుకట్ట వేసేదిశగా ఆగ్నేయాసియా దేశాలు ఒకేవేదికపైకి రావడం ద్వారా వ్యూహాత్మకంగా భారత్ శక్తివంతమైన సందేశాన్నిచ్చినట్లయ్యిందని భావిస్తున్నారు. 'ఆసియాన్ దేశాధినేతల హాజరుతో గణతంత్ర వేడుకలు సుహృద్భావ వాతావరణానికి ప్రతీకగా నిలిచాయి' అని ప్రధాని మోదీ ట్విట్టర్‌లో తెలిపారు.

ఆగ్నేయాసియా సాంస్కృతిక బంధాన్ని ప్రదర్శించిన శకటాలు

గాంధీతత్త్వం, బౌద్ధం ప్రధానంగా ఈసారి గణతంత్ర వేడుకల్లో శకటాల ప్రదర్శన సాగింది. ఆగ్నేయాసియా దేశాలతో భారత్‌కు సాంస్కృతిక సామీప్యత ఉన్న అంశాలనే ఈసారి ఎంపికచేశారు. 14రాష్ట్రాలు ప్రదర్శించిన శకటాలు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పాయి. భారత నౌకాదళం 'యుద్ధానికి సిద్ధం' థీమ్‌తో రూపొందించిన శకటం ఐఎన్‌ఎస్ విక్రాంత్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. డీఆర్‌డీవో శకటం 'నిర్భయ్' క్షిపణిని, 'అశ్విని' అధునాతన రాడార్ వ్యవస్థను ప్రదర్శించింది. ఇక మోదీ రేడియో కార్యక్రమం 'మన్‌కీ బాత్' అంశంతో ఆలిండియా రేడియో రూపొందించిన శకటం అందరినీ ఆకట్టుకున్నది. ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం, బాలి జాతర (ఒడిశా), మహాబోధి ఆలయం-బోధి వృక్షం, ఆగ్నేయాసియా దేశాల్లోని రామాయణ గాథలు వంటివి ప్రదర్శనాంశాల్లో ఉన్నాయి. బుద్ధుడు ధాన్యముద్రలో ఉన్న శకటాన్ని హిమాచల్ ప్రదేశ్, గాంధీ చరఖా తిప్పుతున్నట్లుగా గుజరాత్, హస్తకళల్ని త్రిపుర, వనసౌందర్యాన్ని కర్ణాటక, గ్రామీణ పర్యాటకాన్ని ఉత్తరాఖండ్, కశ్మీర్ జీవనశైలిని జమ్ముకశ్మీర్, మాస్కుల తయారీరంగంపై అసోం తమ తమ శకటాలను ప్రదర్శించాయి.

భద్రతను దాటుకుని.. ప్రజల వద్దకు మోదీ

రిపబ్లిక్ డే వేడుకల అనంతరం ప్రధాని మోదీ నడుచుకుంటూ ప్రజల వద్దకు వెళ్లారు. వీక్షకుల సమీపానికి వెళ్లి చేతులు ఊపారు. ఆయనను చూసి మోదీ మోదీ అంటూ ప్రేక్షకులు నినాదాలు చేశారు. ప్రధాని చర్యతో భద్రతాసిబ్బంది పరుగులు పెట్టాల్సి వచ్చింది. గత ఏడాది కూడా స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జెండాను ఎగురవేసిన అనంతరం మోదీ ఇలా ప్రజల వద్దకు వెళ్లి పలువురితో కరచాలనం చేశారు. మరోవైపు 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశప్రజలకు ప్రధాని మోదీ ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.



పరేడ్‌లో ఆకాశ్ క్షిపణుల ప్రదర్శన



యుద్ధట్యాంకులు, క్షిపణి విధ్వంసక రాడార్లు



బీఎస్‌ఎఫ్ 'సీమాభవాని' మహిళాజవాన్ల ప్రదర్శన

కంటతడి పెట్టిన రాష్ట్రపతి

అశోకచక్ర ప్రదానం చేస్తూ భావోద్వేగానికి గురైన కోవింద్

ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టి అమరుడైన జ్యోతిప్రకాశ్‌నిరాల

న్యూఢిల్లీ: గణతంత్ర వేడుకల్లో అరుదైన ఘటన చోటు చేసుకున్నది. గత ఏడాది వీరమరణం పొందిన వాయుసేన కమాండో కార్పొరల్ జ్యోతిప్రకాశ్ నిరాలకు ప్రకటించిన దేశ అత్యున్నత సైనిక పురస్కారం అశోకచక్రను ఆయన భార్య సుష్మానంద్, తల్లి మాలతీదేవిలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అందించారు. ఈ సందర్భంగా కోవింద్ భావోద్వేగానికి గురై ఉబికి వస్తున్న కన్నీళ్లను దస్తీతో తుడుచుకున్నారు. గత ఏడాది నవంబర్ 18న బండిపొరా జిల్లా చందేర్గర్ గ్రామంలోని ఓ ఇంటిలో నక్కిన ఆరుగురు ఉగ్రవాదుల కోసం సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌లో నిరాల చాకచక్యంగా వారికి సమీపానికి వెళ్లి అన్ని మార్గాలను మూసివేశారు. దీంతో ముష్కరులు కురిపించిన బుల్లెట్ల వర్షం శరీరాన్ని తూట్లు పొడుస్తున్నా లెక్కచేయకుండా ఇద్దరిని మట్టుబెట్టి తానూ మృతి చెందారు.



జ్యోతిప్రకాశ్‌నిరాల కుటుంబ సభ్యులకు అశోకచక్ర ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి; (ఇన్‌సెట్‌లో) కోవింద్ భావోద్వేగం

'వనజీవి'కి అరుదైన గౌరవం

హస్తినలో ఎట్‌హోం విందుకు రామయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: 69వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఎట్‌హోం విందులో తెలంగాణలోని ఖమ్మం జిల్లా వాసి పద్మశ్రీ వనజీవి రామయ్యకు అరుదైన గౌరవం లభించింది. 69వ గణతంత్ర దినోత్సవం నాడు కేంద్రం ఆహ్వానం మేరకు శుక్రవారం వనజీవి రామయ్య ఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విందులో భారత ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌లను కలిశారు. ఈ సందర్భంగా భారత ప్రధాని మోదీ రామయ్యను ఆప్యాయంగా పలుకరించారు. పర్యావరణ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని మోదీ మరోసారి అభినందించారు.



రామయ్యను ఆప్యాయంగా పలుకరిస్తున్న ప్రధాని మోదీ

ఉప్పొంగిన దేశభక్తి

రాష్ట్రాల్లో ఘనంగా గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ: రంగురంగుల శకటాలు, క్రమశిక్షణతో సాగిన కవాతులు, విద్యార్థులు, చిన్నారుల్లో ఆసక్తి, ఉత్సాహం వెరసి 69వ గణతంత్ర వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆయా రాష్ట్రాల గవర్నర్లు మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. మహారాష్ట్రలోని ముంబై శివాజీ పార్కులో గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు జెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తూ రాజ్యాంగ విలువల కోసం నిబద్ధతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. పంజాబ్ గవర్నర్ వీపీ సింగ్ బాద్నోర్ పఠాన్‌కోట్‌లో.. హర్యానా గవర్నర్ కేఎస్ సోలంకి అంబాలాలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో శాటిలైట్ ఫోన్ గల ఇద్దరు సౌదీ పౌరులతోపాటు ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్ రాజధాని పాట్నాలో గవర్నర్ సత్యపాల్ మాలిక్ జెండాను ఆవిష్కరించారు. జార్ఖండ్‌లో గవర్నర్ ద్రౌపది ముర్ము.. కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేఎన్ త్రిపాఠీ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. గోవాలో గవర్నర్ మృదులా సిన్హా, అరుణాచల్‌ప్రదేశ్‌లో గవర్నర్ బ్రిగేడియర్ (రిటైర్డ్) బీడీ మిశ్రా, ఒడిశాలో గవర్నర్ ఎస్సీ జమీర్, త్రిపురలో గవర్నర్ తథాగత్‌రాయ్ మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు. ఉగ్రవాదులు దాడి చేసే అవకాశం ఉన్నదన్న హెచ్చరికల నేపథ్యంలో జమ్ముకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో వేడుకలు కొంత నిరుత్సాహంగా సాగాయి. అసోం రాజధా ని గువాహటిలో తక్కువ సామర్థ్యం గల మూడు బాంబులు పేలాయి. గురువారం జరిగిన పోలీసు కాల్పుల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం మృతి చెందారు.కర్ఫ్యూ నీడలో గువాహటిలో గణతంత్ర వేడుకలు జరిగాయి.



రిపబ్లిక్‌డే సందర్భంగా ముంబైలోని రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోం కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు దంపతులు, సీఎం ఫడ్నవీస్ దంపతులు

రాహుల్‌కు ఆరోవరుసలో సీటు



న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఆరో వరుసలో సీటు కేటాయించారు. దీంతో ఆయన రాజ్యసభలో ప్రతిపక్ష నేత కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ తో కలిసి కూర్చున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ మీడియా ఇంచార్జి రణ్‌దీప్ సుర్జేవాలా స్పందిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్‌కు మొదటి వరుసలో సీటు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం చేస్తున్న నీచ రాజకీయాలు ఈ రోజు కండ్లముందు కనిపిస్తున్నాయన్నారు.

పాక్‌తో మిఠాయిలకు బీఎస్‌ఎఫ్ నిరాకరణ

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాకిస్థాన్ సైనికులతో మిఠాయిలను పంచుకోవడానికి బీఎస్‌ఎఫ్ జవాన్లు నిరాకరించారు. బంగ్లాదేశ్ సరిహద్దు సైనికులతో మాత్రం మిఠాయిలను పంచుకున్నారు. బీఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ కేకే శర్మ మాట్లాడుతూ భారత్, పాక్ సైనికులు మిఠాయిలను పంచుకునే సానుకూల వాతావరణం లేదని చెప్పారు. ఇరు దేశాల మధ్య జరిగిన ఫ్లాగ్ మీటింగ్‌లో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనపై చర్చించామని, ఈ ఉల్లంఘనలను తగ్గించడానికి అంగీకరించాయని పేర్కొన్నారు. పాక్ కాల్పులను నిరసిస్తూ గతంలో కూడా పలుసార్లు స్వీట్లు పంచుకోలేదని గుర్తుచేశారు.

కేరళలో జెండా ఎగురవేసిన మోహన్ భగవత్

పాలక్కాడ్: గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం నాటి మాదిరిగానే ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేరళలోని పాలక్కాడ్ నగరంలోని ఓ పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం విద్యా సంస్థ అధిపతి మాత్రమే ఆ పనిచేయాలి. ఈ నిబంధనకు వ్యతిరేకంగా మోహన్ భగవత్ జెండాను ఎగురవేయడంతో మండిపడ్డ సీపీఎం, కాంగ్రెస్.. ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. ఆరెస్సెస్ వర్గాలు మాత్రం ఆయన చర్యను సమర్థించుకున్నాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని పాఠశాల యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించింది.

భారత్-ఆగ్నేయాసియా బంధం బలపడాలి

- రిపబ్లిక్‌డే, ఆసియాన్ సదస్సు సందర్భంగా రాసిన వ్యాసంలో ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్ష
- ఆసియాన్ దేశాలకు చెందిన 27 పత్రికల్లో వ్యాసం ప్రచురణ



సింగపూర్, జనవరి 26: భారత్ – ఆగ్నేయాసియా దేశాల మధ్య రెండు వేల ఏండ్ల కిందటి నుంచే సంబంధాలున్నాయని, భవిష్యత్తులో ఈ సంబంధాలు మరింత పెరుగాలని ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షించారు. వరక్త, వాణిజ్య తదితర రంగాలతో సంబంధాల ద్వారా నవభారత అభివృద్ధిలో ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సంఘం) దేశాలు కూడా పాలుపంచుకోవాలని కోరారు. భారత 69వ గణతంత్ర దినోత్సవం, ఆసియాన్-భారత సంస్మరణ సదస్సు రజతోత్సవం సందర్భంగా మోదీ ఈ మేరకు ఒక వ్యాసం రాశారు. ఈ వ్యాసం ఆసియాన్ దేశాలకు చెందిన పది భాషల్లోని 27 పత్రికలు ప్రచురించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రవీశ్‌కుమార్ శుక్రవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. సింగపూర్‌లోని ఆంగ్ల పత్రిక స్ట్రెయిట్స్ టైమ్స్ కూడా 'భాగస్వామ్య విలువలు, ఉమ్మడి లక్ష్యాలు' శీర్షికతో ఈ వ్యాసాన్ని ప్రచురించింది. భారత్ – ఆసియాన్ దేశాల మధ్య పోటీలు, వివాదాలు లేని సంబంధాలున్నాయని నరేంద్రమోదీ తన వ్యాసంలో పేర్కొన్నారు. విస్తీర్ణంలో చిన్నవైనా, పెద్దవైనా సార్వభౌమత్వం విషయంలో అన్ని దేశాలూ సమానమేనని ఆసియాన్ దేశాలు విశ్వసిస్తాయని, వాణిజ్యం తదితర విషయాల్లో స్వేచ్ఛా విధానాలుండాలని కోరుకుంటాయని తెలిపారు. ఇండియా-ఆసియాన్ దేశాల మధ్య విశేషమైన స్నేహం, భాగస్వామ్య సంస్కృతి, నాగరికత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. ఆసియాన్ సభ్య దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాల ప్రాధాన్యం గురించి మోదీ వ్యాసంలో వివరించారు. 'సమ్మిళితత్వం, సమగ్రత, విశ్వాసం, సమాన సార్వభౌమత్వ భావనలతో నిర్మితమైన భవిష్యత్తుపై మనందరి ఉమ్మడి దృక్పథం ఒక్కటే' అని ఆయన తెలిపారు. ఆసియాన్-భారత భాగస్వామ్య రజతోత్సవం సందర్భంగా ఆసియాన్ దేశాల నాయకులకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం లభించడం తాను గౌరవంగా భావిస్తున్నానని, ఆసియాన్-భారత దేశాల మైత్రిలో ఇది ఒక మైలురాయి అని పేర్కొన్నారు. ఆగ్నేయాసియా దేశాలతో భారత్‌కు రెండువేల సంవత్సరాలుగా మతం, సంస్కృతి, కళలు, వాణిజ్యం, భాష, సాహిత్యరంగాల్లో శాంతియుత, మైత్రీ సంబంధాలున్నాయన్నారు. భారత్ రెండు దశాబ్దాలకన్నా ముందు నుంచే తూర్పుదేశాల వైపు సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించిందని మోదీ వెల్లడించారు. వాణిజ్యం, పెట్టుబడుల రంగంలో ఆసియాన్ దేశాలు భారత్‌కు నాలుగో పెద్ద భాగస్వామి కాగా, ఆ దేశాలకు ఇండియా ఏడో పెద్ద భాగస్వామి అని వెల్లడించారు. భారత్ పెట్టుబడుల్లో 20శాతానికి పైగా ఆసియాన్‌కు వెళ్తున్నాయన్నారు. 60 లక్షల మందికిపైగా భారతీయ సంతతి ప్రజలు ఆగ్నేయాసియా దేశాల్లో నివసిస్తున్నారని తెలిపారు.

ఆసియాన్ అధినేతలతో మోదీ చర్చలు

ద్వైపాక్షిక, పరస్పర ప్రయోజన అంశాలే ఎజెండా

మలేషియా, లావోస్ ప్రధానులతోపాటు పది ఆసియాన్ దేశాల అధినేతలతో ప్రధాని నరేంద్రమోదీ ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార రంగాల్లో పరస్పరం సహకారంపై శుక్రవారం చర్చలు జరిపారు. వారంతా 69వ గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మలేషియా ప్రధాని నజీబ్ రజాక్‌తో జరిగిన చర్చల్లో ఉగ్రవాదాన్ని నిరోధించడంతోపాటు రక్షణ, వాణిజ్య, పెట్టుబడుల రంగాల్లో పరస్పర సహకారం, ఇరు దేశాల ప్రజల మధ్య నేరుగా సంబంధాల బలోపేతంపై దృష్టి సారించారు. 'భారత్‌కు మలేషియా వ్యూహాత్మక భాగస్వామి' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. లావోస్ ప్రధాని పీడీఆర్ తోంగియన్ సిసోలిత్‌తో ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనం చేకూర్చే అంశాలపై ప్రధాని మోదీ చర్చించారని విదేశాంగశాఖ ప్రతినిధి ట్వీట్ చేశారు.

పుతిన్ నుంచి ఒబామా వరకు..

న్యూఢిల్లీ: భారత గణతంత్ర దినోత్సవాలకు పలు దేశాల అధినేతలు అతిథులుగా హాజరయ్యారు. గతేడాది అబుదాబి రాజు మహ్మద్ బిన్ జాయిద్ అల్ నాహ్యాన్, 2016లో ఫ్రాంకోయిస్ హోలాండే, 2015లో అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా, 2014లో జపాన్ ప్రధాని అబె, 2013లో భూటాన్ రాజు జిగ్మే ఖేసార్ నాంగ్యేల్, 2012లో థాయ్‌లాండ్ ప్రధాని ఇంగ్లాక్ షినవత్రా, 2011లో ఇండోనేషియా అధ్యక్షుడు సుశీలో బాంబాంగ్, 2010లో దక్షిణకొరియా అధ్యక్షుడు లీ మ్యుంగ్ బాక్, 2009లో కజకిస్థాన్ అధ్యక్షుడు నూర్ సుల్తాన్ నజార్‌బాయేవ్, 2008లో ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీ, 2007లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



వన్యప్రాణి సంరక్షణపై కర్ణాటక శకటం



ప్రదర్శనలో ఆసియాన్ దేశాల కళాబృందాలు



పరేడ్‌లో ఆకట్టుకున్న ఆలిండియా రేడియో శకటం

వివిధ దేశాల్లో గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ/ బీజింగ్/ సింగపూర్: 69వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ దేశాల్లో భారత రాయబారులు శుక్రవారం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. చైనాలో భారత రాయబారి గౌతం బాంబావాలే.. బీజింగ్‌లోని రాయబార కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇండోనేషియా రాజధాని జకార్తా, బాలి, మెడాన్‌ల్లోని భారత దౌత్య కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు జరిగాయి. సింగపూర్‌లో తాత్కాలిక భారత హైకమిషనర్ నినాద్ ఎస్ దేశ్‌పాండే మూడు రంగుల జెండాను ఎగురవేశారు. కాగా, భారత్‌లోని వివిధ దేశాల రాయబారులు భారతీయులకు 69వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'భారత గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొంటున్నందుకు గౌరవంగా ఉన్నది' అని అమెరికా రాయబారి కెన్ జస్టర్ ట్వీట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆస్ట్రేలియా హై కమిషనర్ హరిందర్ సిద్ధూ కూడా భారతీయులకు, జనవరి 26న 'ఆస్ట్రేలియా డే' సందర్భంగా ఆస్ట్రేలియన్లకూ శుభాకాంక్షలు తెలిపారు. కెనడా రాయబారి నదీర్ పటేల్, ఫ్రాన్స్ రాయబారి అలెగ్జాండ్రే జీగ్లర్, ఇజ్రాయెల్ రాయబారి డానియల్ కార్మోన్ కూడా భారతీయులకు శుభాకంక్షలు చెప్పారు.



శాసనమండలి వద్ద జెండా ఎగురవేస్తున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ. కార్యక్రమంలో విప్‌లు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, నారదాసు లక్ష్మణ్‌రావు, బీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు.



అసెంబ్లీ భవనం వద్ద జెండా ఎగురవేసి వందనం చేస్తున్న స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి. కార్యక్రమంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, శాసనసభ విప్‌లు గొంగిడి సునీత, గంప గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు మూడు నెలల్లో గ్రూప్-4 ప్రకటన

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండు మూడు నెలల్లో గ్రూప్-4 నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. ప్రభుత్వాన్ని సంప్రదించిన అనంతరం నోటిఫికేషన్ వెలువరిస్తామన్నారు. శుక్రవారం ఆయన టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఉద్యోగాల భర్తీలో పారదర్శకత, వేగం, టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో టీఎస్‌పీఎస్సీకి వివిధ వర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయని గుర్తుచేశారు. ఉద్యోగుల పనితీరు వల్లే టీఎస్‌పీఎస్సీకి గుర్తింపు దక్కిందన్నారు. కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి, సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పక్కాగా సాక్ష్యాలు.. వేగంగా తీర్పులు

సిటీ పోలీసింగ్‌లో ఫలితమిస్తున్న సంస్కరణలు

టెక్నాలజీ సాయంతో వేగంగా దర్యాప్తు పూర్తి

అన్ని ఆధారాలు న్యాయస్థానాల ముందుకు.. పెరుగుతున్న శిక్షల శాతం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో తీసుకొచ్చిన టెక్నాలజీ పరమైన సంస్కరణలు మంచి ఫలితాలిస్తున్నాయి. పోలీసులు పక్కాగా ఆధారాలు సేకరిస్తుండడంతో న్యాయస్థానాల్లో దోషులకు వేగంగా శిక్షలు పడుతున్నాయి. సంచలనాత్మకమైన కేసుల్లో చిక్కుముడులను వేగంగా విప్పుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. అత్యాధునిక టెక్నాలజీ వినియోగం, సిబ్బంది పనితీరులో మార్పు, పారదర్శకతతో నగరంలో శాంతి భద్రతలను కాపాడుతూ, నేరాలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చేందుకు ఓవైపు ప్రయత్నిస్తూనే.. మరోవైపు నేరం చేసిన వారికి శిక్ష పడేలా తగిన సాక్ష్యాలను కోర్టు ముందుంచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. 2013లో నగరంలో జరుగుతున్న నేరాల్లో శిక్షల శాతం 19 శాతంగా ఉండగా, పోలీసుల కృషి ఫలితంగా గత ఏడాదికి 24 శాతానికి చేరింది. ఈ ఏడాది మరింతగా పెరుగనున్నట్టు అధికారులు తెలిపారు. నేరం చేయాలనే ఆలోచన రావద్దు.. నేరం చేస్తే కచ్చితంగా పట్టుబడుతారు.. శిక్ష తప్పదు అని ఆచరణలో నిరూపిస్తున్నారు.

సమగ్ర దర్యాప్తునకు సహాయ కేంద్రం

నిందితులను పట్టుకోవడంతోపాటు వారు నేరం చేసిన తీరు, అందుకు పకడ్బందీ సాక్ష్యాలను కోర్టులలో ప్రవేశపెట్టినప్పుడు తప్పకుండా శిక్షలు పడుతాయి. సంబంధిత అధికారి ఘటనా స్థలానికి వెళ్లి ఏం జరిగిందో తెలుసుకోవడంతోపాటు అన్ని వైపుల నుంచి సమగ్ర దర్యాప్తు జరిపి, సాక్ష్యాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించేందుకు సంబంధిత అధికారి ఎంతో కష్టపడాలి. అప్పుడే శిక్ష పడే అవకాశం ఉంటుంది. ఇలా ప్రతి కేసులోనూ శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులకు సహాయం చేసేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 'ఇన్వెస్టిగేషన్‌సపోర్ట్ సెంటర్'ను అందుబాటులోకి తెచ్చారు. సంచలనాత్మక కేసుల్లో దర్యాప్తు అధికారికి కావాల్సిన సమాచారం, సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతున్నది. మరోవైపు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని విభాగాల వారీగా విభజించి బాధ్యతలు అప్పగించారు. వారి పనితీరును ప్రతి నెల ఉన్నతాధికారులు విశ్లేషిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఉదాహరణకు కేసులకు సంబంధించిన కోర్టు వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్‌కు సిబ్బందిని కేటాయించారు. దీంతో ఎవరి బాధ్యతలను వారు నిర్వహిస్తూ సమన్వయంగా పనిచేయడంతో శిక్షల శాతం పెరుగుతున్నదని అధికారులు తెలిపారు. కేసుల దర్యాప్తు, వాటి పురోగతి కోసం యూఐ(అండర్ ఇన్వెస్టిగేషన్) మేళాలతో దర్యాప్తులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

ఈ ఏడాది పెరుగనున్న శిక్షల శాతం

ఫ్రెండ్లీ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజలకు పోలీసులు దగ్గరయ్యారు. నగరమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలనే లక్ష్యంతో ఇప్పటివరకు సుమారు 2.5 లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తరుచూ నేరాలు చేసే వారిపై పీడీ యాక్టులు ప్రయోగిస్తున్నారు. కేసుల దర్యాప్తు కోసం సంబంధిత అధికారికి కావాల్సిన సగ్రమ సమాచారం తన ట్యాబ్‌లోకి వచ్చేలా టీఎస్ కాప్స్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. నేరస్థులపై సర్వే నిర్వహించి, పాత నేరస్థులపై జియో ట్యాగింగ్‌తో నిఘా కొనసాగిస్తున్నారు. హోంగార్డు నుంచి ఏసీపీ స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరి పనితనాన్ని గుర్తిస్తూ ప్రతి నెల ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేకంగా ఒక ఫైల్‌ను కేటాయిస్తూ, కంప్యూటర్‌లో దానిని అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ ఫిర్యాదుపై దర్యాప్తు ఎలా కొనసాగుతున్నదో ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. 2015 తరువాత జరిగిన నేరాలపై ఇప్పుడిప్పుడే శిక్షలు ఖరారవుతున్నాయి. 2015 కంటే 2016లో నమోదయ్యే కేసుల్లో టెక్నాలజీ పరమైన సాక్ష్యాలను పోలీసులు ఎక్కువగా సేకరించారు. దీంతో ఆయా కేసుల్లో ఈ ఏడాది పక్కాగా శిక్షలు పడుతాయని, నగరంలో శిక్షల శాతం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

22 నెలల్లోనే శిక్ష

పోలీసుల పనితీరుకు నగరానికి చెందిన పదో తరగతి విద్యార్థి అభయ్ కిడ్నాప్, హత్య కేసు ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. పోలీసులు 24 గంటల్లోనే నిందితులను గుర్తించడంతో పాటు పక్కా ఆధారాలు సమర్పించడంతో ఫాస్ట్‌టాక్ కోర్టు కేవలం 22 నెలల్లోనే దోషులకు శిక్షలు ఖరారు చేసింది. 2016 మార్చి 16వ తేదీన అభయ్‌ని దుండగులు కిడ్నాప్ చేశారు. అయితే విద్యార్థి మృతి చెందడంతో మృతదేహాన్ని అట్టపెట్టెలో ఉంచి రాత్రి సికింద్రాబాద్‌లో వదిలేసి అభయ్ తండ్రికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు 24 గంటల్లోనే నిందితులను గుర్తించారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నిందితులు ఏపీ, ఒడిశాకు పారిపోయారు. దీంతో నిందితులను గుర్తించేందుకు ఒక బృందం, నగరంలోని సీసీ కెమెరాల పుటేజీలను విశ్లేషించేందుకు మరో బృందం, ఒక్కో నిందితుడు వెళ్తున్న మార్గాన్ని గుర్తించి వెంబడించేందుకు ప్రత్యేక బృందాలు ఇలా మొత్తం 10కి పైగా బృందాలు తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లో గాలించి పట్టుకున్నాయి. మార్చి 20న నిందితులను కోర్టులో హాజరుపరిచారు. 22 నెలల్లోనే శిక్షలు పడ్డాయి.

హైదరాబాద్ భిన్న సంస్కృతులకు నిలయం

- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్**
- **ప్రారంభమైన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఐటీ హబ్‌గా ప్రపంచఖ్యాతిని గడించిన హైదరాబాద్ గొప్ప సాంస్కృతిక వారసత్వం గల నగరమని, భిన్న భాషలు, సంస్కృతుల సమ్మేళనమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ పేర్కొన్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమైన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ 8వ ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మఖ్దూం, సరోజినీ నాయుడు వంటి రచయితలకు హైదరాబాద్ పుట్టినిల్లని గుర్తుచేశారు. రచయితల్లోని సృజనాత్మకతకు ఈ ఫెస్టివల్ పదును పెడుతుందన్నారు. ప్రపంచ, స్థానిక రచయితల మధ్య అర్థవంతమైన చర్చలకు వేదికగా నిలుస్తున్నదన్నారు. వర్తమాన సాహిత్యంలోని భిన్న దృక్పథాలను అర్థం చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఫెస్టివల్‌లో కళారూపాలకూ స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. ఈ ఫెస్టివల్ దేశంలోని ఐదు ప్రధాన సాహిత్య వేడుకల్లో ఒకటిగా ఉన్నదని, భవిష్యత్తులో నంబర్ వన్ స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఈ ఫెస్టివల్ కళ, సాంస్కృతుల సమ్మిళిత వేడుకన్నారు. సాహితీ ఉత్సవంలో పాల్గొనేందుకు దేశవిదేశాల నుంచి వచ్చిన సాహితీ ప్రియులను అభినందించారు. స్పెయిన్ ఎంబసీ డిప్యూటీ హెచ్ ఆఫ్ మిషన్ ఎడ్వర్డో శాంచెజ్ మోరేనో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యాపారం, సాంస్కృతి రంగాల్లో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నదన్నారు. రాష్ట్రానికి అద్భుతమైన భవిష్యత్తు ఉన్నదన్నారు. కార్యక్రమంలో స్పెయిన్ ఎంబసీ కల్చరల్ అటాచ్ విటోరికా హమిల్టన్, ఫెస్టివల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, కిన్నెరమూర్తి, ప్రముఖ నృత్యకారిణి పద్మవిభూషణ్ సోనల్ మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న సీఎస్ ఎస్పీసింగ్. చిత్రంలో పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

ఐదునెలల్లో మెట్రో రెండోదశ డీపీఆర్

- **మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు రెండోదశ డీపీఆర్ మరో ఐదునెలల్లో రూపొందిస్తామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. డీపీఆర్ రూపకల్పన బాధ్యత చేపట్టిన ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్(డీఎంఆర్సీ) ప్రతినిధులు, ఇంజినీర్లతో శుక్రవారం మెట్రో రైలు భవన్‌లో రెండోదశపై మేధోమధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి పలు సూచనలు చేశారు. ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని విభిన్నమైన, వినూత్నమైన ఆలోచనలతో ముందుకు రావాలన్నారు. కనెక్టివిటీని దృష్టిలో ఉంచుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధంగా ఉంచాలన్నారు. కావాల్సిన భూమిని అంచనా వేయాలన్నారు. ప్రయాణ చార్జీలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టు వ్యయంపై పూర్తి వివరాలు అందించాలని సూచించారు. పర్యావరణ, సామాజిక ప్రభావాన్ని అంచనా వేయాలన్నారు. సమావేశంలో డీఎంఆర్సీ డైరెక్టర్ ఎస్‌డీశర్మ, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఇంజినీర్స్ డీవీఎస్ రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజినీర్లకు సూచనలు ఇస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

మూడు మార్గాలపై చర్చ!

రెండో దశలో మూడు మార్గాలు చర్చించినట్టు విశ్వసనీయ సమాచారం. కారిడార్-1లో నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు, కారిడార్-3లో రాయదుర్గం నుంచి రాజేంద్రనగర్ మీదుగా ఎయిర్‌పోర్టు వరకు పొడిగించాలని చర్చించారు. బీహెచ్‌ఈఎల్ నుంచి కొండాపూర్ మీదుగా లక్డీకాపుల్ వరకు కొత్త కారిడార్ వేయాలని భావిస్తున్నారు.

హెచ్‌ఎండీఏకు 'జెమ్స్ ఆఫ్ డిజిటల్ తెలంగాణ' అవార్డు

- **31న అందుకోనున్న కమిషనర్ చిరంజీవులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ)కు జెమ్స్ ఆఫ్ డిజిటల్ తెలంగాణ అవార్డు వరించింది. డిజిటల్ తెలంగాణలో భాగంగా ఆధునిక సాంకేతిక వ్యవస్థను ఉపయోగించుకుంటూ పారదర్శకమైన సేవలు అందించడంలో హెచ్‌ఎండీఏ అమలు చేస్తున్న ఈ-డీపీఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం) విధానానికి ఈ అవార్డు దక్కింది. దేశంలోని 36 రాష్ట్రాల్లో అందిస్తున్న డిజిటల్ సేవలపై స్వతంత్ర సంస్థ ద్వారా చేపట్టిన సర్వేలో హెచ్‌ఎండీఏను ఎంపిక చేశారు. అదేవిధంగా డిజిటల్ సేవలు అందించడంలో రాష్ట్రానికి దేశంలో ఏడో స్థానం దక్కింది. ఈ నెల 31న హోటల్ ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరుగనున్న కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రదానం జరుగనున్నది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులును అభినందిస్తూ ఢిల్లీకి చెందిన కౌస్(COEUS) ఏజ్ కన్సల్టింగ్ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ కపిల్‌దేవ్ సింగ్ నుంచి లెటర్ అందింది.

డీపీఎంఎస్ పురోగతి..

సర్వీస్ పేరు	దరఖాస్తులు	అనుమతి	తిరస్కరణ	పురోగతి
బిల్డింగ్ దరఖాస్తు	1,159	551	326	122
ఎన్‌వోసి(పెట్రోల్ పంపు)	29	11	10	5
సీఎల్‌యూ	166	53	38	28
లే అవుట్ ఓపెన్ ప్లాట్	322	177	57	37
గేటెడ్ కమ్యూనిటీ	31	9	8	6
మోడల్ హౌజ్, క్లబ్ హౌజ్‌లు	13	3	3	0
అక్యూపెన్సీ	11	7	0	3
టీఎస్ ఐపాస్ (బిల్డింగ్ పర్మిషన్)	9	0	5	4

హీరో నానికి తప్పిన ప్రమాదం

స్తంభాన్ని ఢీకొట్టిన కారు



దెబ్బ తిన్న కారును తరలిస్తున్న దృశ్యం



బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: ప్రముఖ సినీ నటుడు నానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున 4.30 ప్రాంతంలో నాని షూటింగ్ ముగించుకొని గచ్చిబౌలిలోని తన ఇంటికి కారులో వెళ్తుండగా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45లో కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. సకాలంలో బెలూన్లు తెరుచుకోవడంతో నాని, డ్రైవర్ శ్రీనివాస్ సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం నాని మరో కారులో ఇంటికి వెళ్లిపోయాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కారు డ్రైవర్ శ్రీనివాస్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా మద్యం సేవించలేదని తేలింది. నిద్రమత్తులో ప్రమాదం జరిగిందని డ్రైవర్ వివరించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఆ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వల్పగాయాలతో బయటపడ్డా

ప్రమాదంపై హీరో నాని ట్విట్టర్‌లో స్పందించారు. తాను క్షేమంగా ఉన్నానని.. స్వల్ప గాయాలతో బయటపడ్డాడని వెల్లడించారు. ప్రస్తుతం తాను నటిస్తున్న కృష్ణార్జున యుద్ధం సినిమా షూటింగ్‌కు విరామం తీసుకుంటున్నట్టు తెలిపారు.

ప్యాట్స్ రాష్ట్ర అధ్యక్షురాలిగా హిమబిందు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పిడియాట్రిక్ అకాడమీ ఆఫ్ తెలంగాణ స్టేట్ (ప్యాట్స్) అధ్యక్షురాలిగా నిలోఫర్ దవాఖానలోని నియోనాటలాజి విభాగం అధిపతి డాక్టర్ హిమబిందు ఎంపికయ్యారు. ఈ మేరకు ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ.. తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. పిల్లల ఆరోగ్యసంరక్షణ, వ్యాక్సినేషన్ తదితర అంశాలపై కృషి చేస్తానన్నారు.



చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ బషీరాబేగంకు 2016లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి అవార్డు ప్రకటించింది. ఈ అవార్డు జైళ్ల శాఖకు చేరుకోవడంలో జాప్యం జరిగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జైళ్ల శాఖకు అవార్డును అందజేయడంతో జైళ్ల శాఖ డీజీ వినయ్ కుమార్ సింగ్ శుక్రవారం చంచల్‌గూడ జైలులో బషీరాబేగంకు రాష్ట్రపతి అవార్డును అందజేశారు. - మాదన్నపేట

పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నగరంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతుండటంతో చలి తీవ్రత పెరుగుతున్నది. పగలు ఎండగా ఉంటున్నా, రాత్రి చలి వణికిస్తున్నది. గురువారం ఉదయం 9గంటల నుంచి శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 13 డిగ్రీలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మరో వారంరోజులు చలి ప్రభావం కొనసాగే అవకాశాలున్నాయన్నారు.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 27 జనవరి 2018
WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

లక్ష్మీ దేవి పద్మ పీఠం మీద కూర్చొని పద్మ హస్తంతో కనిపిస్తూ ఉంటుంది. లలితా త్రిపుర సుందరి మహా పద్మాటవిలోనే విహరిస్తుంది. అంటే.. పద్మం దేవతలకు ఆసనంగా.. అందంగా.. అలంకారంగా కనిపిస్తూ ఉంటుంది. అందుకే కవులు స్త్రీలను.. పద్మాక్షి.. పద్మ నయన.. పద్మానన.. అని వర్ణిస్తుంటారేమో. వికసించిన పద్మం.. జ్ఞానానికి, చైతన్య వికాసానికి ప్రతీకలు అని కూడా అంటారు. విరబూసిన ఈ 'పద్మ'లు.. కూడా అచ్చంగా అలాంటి ప్రతీకలే. ఎగురుతున్న పతాకలే. వివిధ రంగాల్లో దేశానికి సేవలందించిన మొత్తం **85** మందిని ఈ ఏడాది 'పద్మ'లు వరించిన విషయం తెలిసిందే. అందులో సమాజ సేవే పరమావధిగా స్వచ్ఛంద సేవలందిస్తున్న తెరచాటు కథానాయకీనాయకులకు చోటు కల్పించడం విశేషం. ముగ్గురికి పద్మవిభూషన్, తొమ్మిది మందికి పద్మభూషణ్, **73** మందికి పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. గ్రహీతల్లో **14** మంది మహిళలున్నారు. వీరిలో ఒకరిని పద్మభూషణ్ వరించగా, 13 మందికి పద్మశ్రీ లభించింది. ఆ 'పద్మ' స్త్రీల గురించే ఈ అవలోకనం.

పద్మ స్త్రీలు



బంగారు చాను



అమెరికా వేదికగా జరిగిన ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారిణి మీరాభాయ్ చాను.. 194కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని సాధించారు. 1995లో కరణం మల్లీశ్వరి స్వర్ణం సాధించారు. 22 ఏండ్ల తర్వాత మీరాభాయ్ చాను స్వర్ణం సాధించడంతో.. కేంద్ర ప్రభుత్వం ఆమెను భారత విశిష్ట సేవా పతకాల్లో ఒకటైన పద్మశ్రీతో గౌరవించింది.

సామాజిక సేవలో..



కర్ణాటకకు చెందిన 60 ఏండ్ల సీతవ్వ జొడ్డాటి తన ఏడో ఏట నుంచే సామాజిక సేవలో తనదైన ముద్ర వేశారు. కర్ణాటక రాష్ట్రం బెల్గం ప్రాంతంలోని దళితవాడల్లో బాలికలపట్ల మరణశాసనంగా మారిన దేవాదాసీ వ్యవస్థను రూపుమాపేందుకు ఎంతో కృషిచేశారు సీతవ్వ. ప్రత్యేకంగా మహిళా అభివృద్ధి మట్టు సంస్కరణ సమితి(మాస్) అనే సంస్థను నెలకొల్పి దాదాపు దేవాదాసీ వ్యవస్థలో మగ్గిపోతున్న 4 వేల మంది మహిళలకు ఆశ్రయం కల్పించారు. ఆ వ్యవస్థను రూపుమాపేందుకు ఎన్నో అవగాహన సదస్సులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఫైనాన్స్ సంస్థల ద్వారా రుణాలు ఇప్పించారు.

ప్రజారోగ్యం కోసం..




రాణీ, అభయ్ అనే మహారాష్ట్రకు చెందిన ఈ దంపతులు ప్రజారోగ్యం కోసం ఎన్నో సేవలు చేశారు. అనేక పరిశోధనలు చేపట్టారు. బాలలు, మహిళ ఆరోగ్యం, భ్రూణహత్యలపై అవగాహన కల్పిస్తూ.. పరిశోధనలు చేపట్టారు. ఇందుకు ప్రత్యేకంగా ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ఆరోగ్యపరంగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారు. వీరిద్దరూ వైద్యులు కావడంతో సమాజంతో శిశుమరణాలకు తగ్గించి, బాలిక పునరుత్పత్తిపై అధ్యయనాలు చేసి సఫలీకృతమయ్యారు. వీరి సేవలకు గుర్తుగా ఎన్నో అవార్డులు వచ్చాయి.

గ్రాండ్‌మదర్ లెంతిన



నాగాలాండ్‌కు చెందిన 84 ఏండ్ల లెంతిన థక్కర్ సామాజిక సేవకురాలిగా గుర్తింపు పొందారు. తాను చిన్నతనంలో ఏడో తరగతి చదివింది తన గ్రామం నుంచి థక్కర్ ఒక్కరే. ఆ తర్వాత గాంధేయవాద సిద్ధాంతాన్ని ఆచరిస్తూ.. 1950లో కస్తూర్బా ఆశ్రమాన్ని గౌహతిలో స్థాపించారు. థక్కర్ భర్త నట్వర్ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక కార్యకర్త. తాను చిన్నతనం నుంచి నాగాలాండ్‌లోని చుచుయిమ్‌లాంగ్ గ్రామంలో గాంధీ ఆశ్రమాన్ని నిర్వహిస్తూ.. గ్రాండ్‌మదర్‌గా గుర్తింపుతెచ్చుకున్నారు.

యోగాతో యోగ్యం..



సౌదీ అరేబియాకు చెందిన నౌఫ్ మర్వాయి.. మన వారసత్వ యోగాను అక్కడ నేర్పించి గుర్తింపు తెచ్చుకున్నారు. సౌదీ అరేబియాలో యోగాకు సంబంధించి మొదటి గురువుగా గుర్తింపు తెచ్చుకున్నారు మర్వాయి. 3 వేల మందికిపైగా యోగా నేర్పారు. వీరిలో 70 మందికిపైగా టీచర్లను తయారు చేశారు. యోగా నేచురోపతిలో దాదాపు 19 ఏండ్ల నుంచి తన సేవలను కొనసాగిస్తున్నారు.

సాహిత్యానికి వన్నె..



అసోంకు చెందిన మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రఫుల్ కుమార్ మొహంతా భార్య జయశ్రీ గోస్వామి మొహంత. ఈమె సాహిత్యం, జర్నలిజం, విద్యారంగంలో ఎన్నో సేవలు అందించారు. ఎన్నో పుస్తకాలు, నవలలు రాశారు. అంతేకాకుండా రాష్ట్రంలో జరిగిన ఆందోళనలు, వర్తమాన అంశాలపై వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆమె సేవలకు గుర్తుగా ఎన్నో అవార్డులు అందాయి.

పాముకాటుకు వైద్యం




కేరళకు చెందిన 75 ఏండ్ల గిరిజన మహిళ లక్ష్మీకుట్టి ఎంతోమంది పాముకాటు బాధితులకు ప్రాణం పోశారు. పాముకాటుకు దాదాపు 500 ఔషధాలను కనుగొన్నారు. దీంతో పాముకరిచిన వేలాది మంది ప్రాణాలు కాపాడారు లక్ష్మీకుట్టి. తన పూర్వీకుల ద్వారా నేర్చుకున్న ప్రాచీన ఆయుర్వేద వైద్యాన్ని భవిష్యత్ తరాలకు నేర్పుతున్నారు. దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల్లోని ఎన్నో మెడికల్ ఇనిస్టిస్టూషన్స్‌లో పాముకాటు వైద్యంపై ప్రసంగించారు. ఆమె చేసిన సేవలకు ఎన్నో అవార్డులు వచ్చాయి.

ఒంటికి మంచిదేగా..



కాలుష్యం కారణంగా ఇప్పుడంతా యోగా, జిమ్‌లు అంటూ మొదలుపెట్టారు. కానీ ఈ 98 ఏండ్ల మహిళ మాత్రం తన 8 ఏండ్ల వయసులోనే యోగాభ్యాసం మొదలుపెట్టారు. కోయంబత్తూర్‌కి చెందిన ఈవిడ గతేడాదే 20 వేల మందికి ఒకేసారి యోగా నేర్పి గిన్నీస్ రికార్డులో కూడా స్థానం సంపాదించుకున్నది. ఈమె కుటుంబం నుంచి దాదాపు 36మంది యోగా టీచర్లు ఉన్నారు. ఈమె దగ్గర యోగా నేర్చుకొని 600మంది ప్రపంచవ్యాప్తంగా యోగా గురువులున్నారు. పెళ్లయిన దగ్గరి నుంచి ఆమె ప్రకృతి వైద్యాన్నే నమ్ముకున్నది. సకల రోగాలకు యోగానే దివ్య ఔషధంగా భావించే నానమ్మాల్ 2003లో మొదటిసారి యోగా పోటీల్లో పాల్గొన్ని తన సత్తా ఏంటో నిరూపించుకున్నది. ఎన్నో ఇనిస్టిట్యూషన్లు యోగా నేర్పించమని ఆహ్వానాలు పంపినా ఇంగ్లీషు రాని కారణంగా ఆమె ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి దగ్గరే యోగా నేర్పిస్తున్నది.

జానపదాల ఎన్‌సైక్లోపీడియా..



జానపదాలు ఆ సమయానుకూలంగా కొన్ని పుడుతాయి. అలా పుట్టిన జానపదాలు కాలగర్భంలో ఇప్పటికీ చాలా కలిసిపోయాయి. అలాంటి తమిళ జానపదాలను ఒకచోట చేర్చి డాక్యుమెంటేషన్ చేస్తున్నదీ విజయలక్ష్మి. మధురై కామరాజ్ యూనివర్సిటీటో ఫోక్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయింది. ఆమె పదివేలకు పైగా తమిళ జానపదాలను ఆడియో రూపంలో తీసుకొచ్చింది. అంతేకాదు.. కొన్ని పాటలను 11 పుస్తకాల రూపంలో కూడా ప్రచురించిన ఘనత ఈమెది. ఇంకా చెప్పాలంటే.. విజయలక్ష్మికి.. తమిళ జానపద ఎన్‌సైక్లోపీడియా అని పేరు. తమిళనాడులో జరిగిన భక్తి మూమెంట్‌లో కూడా ఈమె చురుకుగా పాల్గొన్నది.

పేదింటి కళ నెరవేరింది..



కోల్‌కతాకు సమీపంలో హన్సుపుకుర్ గ్రామంలో ఉంటారు సుభాషిణీ. ఎర్రటి ఎండల్లో, పెద్దవాళ్ల ఇంట్లో కూలీ పనిచేసేది. వీధి వీధి తిరుగతూ కూరగాయలు అమ్మేది. అలాంటావిడ దవాఖాన కట్టి పేదలకు ఉచిత వైద్యం అందించాలనుకుంది. 23 ఏండ్ల వయసులోనే వైద్యం అందక భర్త చనిపోయాడు. అప్పటినుంచి ఈ కోరిక బలంగా నాటుకుపోయింది. ఈ కల కోసం చివరకు పిల్లలను కూడా సాకాలేనేమోనని వారిని అనాథశ్రమంలో ఉంచి చదివించింది. 1993లో గ్రామస్తుల సహకారంతో ఒకే ఒక్కగదిలో 'హ్యూమానిటీ హాస్పిటల్' పేరుతో మొదలైన దవాఖాన ఇప్పుడు ఎన్నో వేల మందికి వైద్యం అందించేంత ఎత్తుకు ఎదిగింది. కనీసం గడియారం కూడా చూసి టైమ్ చెప్పాలేని ఆవిడ.. ఇప్పుడు అందరూ మెచ్చుకోదగ్గ స్థాయిలో ఉన్నది.

ఉచిత ప్రసవాలు..



సూలగిట్టి నరసమ్మను 'జనని అమ్మ'గా పిలుచుకుంటారు. ఎందుకంటే ఎలాంటి వైద్య విద్య చదువకుండా ఇప్పటికీ దాదాపు 15వేలకు పైగా ప్రసవాలు చేసింది. అది కూడా ఉచితంగా, రూపాయి ఆశించకుండా! కర్ణాటకకు చెందిన ఈ పెద్దావిడ ఉన్నత కుటుంబంలో ఏమీ జన్మించలేదు. మామూలు మధ్యతరగతిలో పుట్టి రైతుగా జీవనం కొనసాగిస్తున్నది. ఈ అమ్మ ఎలాంటి వైద్య పరికరాలు లేకున్నా కడుపులో ఉన్న బిడ్డ ఏ పొజిషన్‌లో ఉందో, ఆ బిడ్డ నాడీని ఇట్టే చెప్పేయగల టెక్నిక్ ఆమెకు తెలుసు. అలా ఎన్నో ప్రసవాలు చేసిన ఈమెకు తుమ్‌కూర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. 97 ఏండ్ల ఈ నరసమ్మ ప్రస్తుతం ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

వీరితో పాటుగా మణిపూర్‌కు చెందిన సుబదాని దేవి కళలు(అల్లికలు) విభాగం, మధ్యప్రదేశ్‌కు చెందిన సాహితీవేత్త ఎంఎస్ మాలతీజోషిని పద్మశ్రీలు వరించాయి.

పాటకు పద్మభూషణ్





బీహార్‌కు చెందిన శారద సిన్హా జానపద సంగీత కళాకారిణి. ఈమె సుపౌల్ జిల్లాలోని హులాస్‌లో జన్మించింది. శారద మైథిలీ, భోజ్‌పురీ, మఘయ్‌లు ఈ పాటలు పాడుతుంటుంది. ఛత్ పూజల పాటలు ఆమె ప్రసిద్ధి. బీహార్‌లోని దుర్గా పూజ మంటపాల్లో ఈమె పాటలు వినిపించాల్సిందే! శారద కొన్ని భక్తి పాటల ఆల్బమ్స్ కూడా చేశారు. అంతేకాదు.. 1989లో వచ్చిన మైనే ప్యార్ కియా సినిమాలో 'కహేతో సే సాజన్' అనే పాటను కూడా పాడారు. ఇవే కాకుండా బాలీవుడ్‌లో మరో రెండు పాటలు పాడినా.. ఆమె ఎక్కువగా భక్తి పాటలకే ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇప్పటిదాకా 62 ఛత్ పాటలను 9 ఆల్బమ్‌లుగా చేసి విడుదల చేశారు.



ప్రతిభకు దక్కిన గౌరవం

ఢిల్లీలోని ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులకు అమెరికా వెళ్లే అరుదైన అవకాశం వచ్చింది. వృత్తి నైపుణ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకొని, విద్యార్థులకు సులువుగా బోధించేందుకు 'ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఫెలోషిప్' సంస్థ వీరికి ఆహ్వానం అందించింది.

2017 ఏడాదిలో 'ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఫెలోషిప్'నకు దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల్లో ఆరుగురిని ఎంపిక చేశారు. ఈ ఆరుగురూ ఢిల్లీకి చెందిన ఉపాధ్యాయులు కావడం గమనార్హం. ఈ ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఫెలోషిప్‌ను యునైటెడ్ స్టేట్స్-ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ స్థాపించింది. ఈ ఫెలోషిప్‌కు మన దేశం నుంచే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాలకు చెందిన ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఢిల్లీ ఉపాధ్యాయుల్లో మురారీ ఝా, మను గులాటి, అంజూ పథక్, దీప్తిచావ్లా, స్తుతి కౌర్, మనీషా పవి ఉన్నారు. వీరు అతి త్వరలోనే అమెరికా వెళ్లి.. అక్కడ పలు యూనివర్సిటీల్లో విద్యా విధానం, మార్పులు, సాంకేతికత, విద్యా బోధన అంశాలపై నైపుణ్యాన్ని పెంచుకోనున్నారు. అయితే ఫెలోషిప్‌నకు ఎంపికైన ఉపాధ్యాయులను ఢిల్లీ విద్యాశాఖ మంత్రి సిసోడియా అభినందించారు. 2018 సంవత్సరానికిగానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఫెలోషిప్. చివరి తేదీ మార్చి 1, డిగ్రీపాసై, ఉపాధ్యాయ వృత్తిలో ఐదేండ్ల అనుభవం ఉన్నవాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ నెయిల్‌పాలీష్ చాలా ఖరీదు!

నెయిల్ పాలీష్ అంటే మహిళలకు, అమ్మాయిలకు చాలా ఇష్టం. కనీసం ఓ డజను వెరైటీలు ఎప్పుడు దగ్గర ఉండేలా చూసుకుంటారు. కానీ ఇలాంటి నెయిల్ పాలీష్ గురించి మాత్రం మీరెప్పుడూ విని ఉండరు.



ఏంటి ఈ నెయిల్ పాలీష్ ధర అని ఆలోచిస్తున్నారా? ఈ నెయిల్ పాలీష్ ధర అక్షరాలా రూ. కోటి అరువై మూడు లక్షల అరువై ఆరు వేలు. 'అమ్మో...' అని ఆశ్చర్యపోకండి. దానికి అంత రేటు నిర్ణయించడానికి ఓ కారణం ఉంది. ఇంతకీ ఆ కారణం ఏంటో తెలుసా? ఈ నెయిల్ పాలీష్ 267 కేరట్ల నల్లటి వజ్రాలను మేళవించి తయారుచేశారు. లాస్ ఏంజిల్స్‌కు చెందిన అజాట్యూర్ అనే సంస్థ ఈ నెయిల్ పాలీష్‌ను తయారుచేసింది. ఇప్పటివరకు మార్కెట్లో ఇదే అత్యంత ఖరీదైన నెయిల్ పాలీష్. గతంలో మోడల్స్ ఓన్ అనే సంస్థ గోల్డ్‌రష్‌తో నెయిల్ పాలీష్ తయారుచేసింది. దాని ధర రూ. 83 లక్షలు ఉండేది. ఇప్పుడు ఈ వజ్రాల నెయిల్ పాలీష్ వచ్చి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ ఖరీదైన నెయిల్ పాలీష్ పెట్టుకుంటే అందమైన అమ్మాయిల చేతులు మరింత అందంగా మెరిసిపోతాయి. కానీ.. అంత ఖరీదు పెట్టి ఈ నెయిల్ పాలీష్ ఎవరు కొంటారో వేచి చూడాల్సిందే!

సర్జరీ లేకుండా ముడతలు మాయం!



అడుగండి చెబుతా

నా వయసు 43 సంవత్సరాలు. నాకు ముఖంపై ముక్కు, కళ్ల పక్కన, నుదుటి మీద చాలా ముడతలున్నాయి. వీటివల్ల చాలా ఇబ్బందికరంగా ఉంది. కుటుంబంతో కలిసి ఫ్యామిలీ ఫంక్షన్లకు వెళ్లినప్పుడు నా వయసువారిని చూస్తే చిన్నతనంగా అనిపిస్తున్నది. 3 నెలల కింద డాక్టర్‌ను కలిస్తే, ఫేస్ లిఫ్ట్ సర్జరీ మాత్రమే దీనికి పరిష్కారం అని చెప్పారు. సర్జరీ లేకుండా ఈ ముడుతలు తగ్గే మార్గం ఏదైనా ఉందా?

– కవిత, వరంగల్

ముఖంపై ముడతలు రావడానికి అనేక కారణాలున్నాయి. కాస్మోటిక్ పదార్థాలను ఎక్కువగా ఉపయోగించడం ఇందుకు ప్రధాన కారణం. దీంతోపాటుగా వయసు వల్ల వచ్చే మార్పులు, కాలుష్యం, నిద్ర లోపించడం, పోషకాహారలోపం కూడా దోహదం చేస్తాయి. అయితే కారణం ఏదైనా ముడుతలకు ఫేస్ లిఫ్ట్ సర్జరీనే చివరి ఆప్షన్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం కాస్మోటిక్ సర్జరీలో అధునాతన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిద్వారా సర్జరీ లేకుండానే ముఖంపై ఏర్పడిన ముడుతలను తొలిగించుకోవచ్చు. మీ సమస్యను బొటాక్స్ ఇంజెక్షన్లు/ఫిల్లర్లు/థ్రెడ్స్ లాంటి పద్ధతుల ద్వారా పరిష్కరించవచ్చు. మీరు మీకు దగ్గరలోని సీనియర్ కాస్మోటిక్ సర్జన్‌ను సంప్రదించండి. పైన సూచించిన చికిత్సల్లో మీకు ఏది సరిపోతుందో ఎంపిక చేసి ట్రీట్‌మెంట్ ఇస్తారు. ఈ చికిత్సల కోసం ఎటువంటి మెడికల్ పరీక్షల అవసరం ఉండదు. చికిత్స తీసుకున్న తరువాత రెండు గంటల్లోపే దవాఖాన నుంచి ఇంటికి వెళ్లిపోవచ్చు. కొన్ని బ్యూటీపార్లర్లలో బొటాక్స్ ఇంజెక్షన్లను ఇస్తున్నారు. కాని ఈ పద్ధతులు బ్యూటీపార్లర్లలో చేయించుకునేవి కావు. కేవలం అనుభవం ఉన్న కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జన్ మాత్రమే చేయగలరు.



డాక్టర్ భవానీ ప్రసాద్
సీనియర్ కాస్మోటిక్ అండ్ ప్లాస్టిక్ సర్జన్, సన్‌షైన్ హాస్పిటల్స్
సికింద్రాబాద్

నమస్తే తెలంగాణ
నిధి
[హైదరాబాద్]
శనివారం 27 జనవరి 2018



ఫోన్ చేస్తే చెప్పొద్దు!

ఇలాంటి ఫోన్లు మనలో చాలామందికి అప్పుడప్పుడు వస్తుంటాయి. అవతలి వారు తీయగా, అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడినంత మాత్రాన.. వెంటనే మీ ఖాతా వివరాలు చెప్పక్కర్లేదు. చెబితే మాత్రం.. ఆతర్వాత ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఉన్న సొమ్మంతా ఊడ్చేస్తారు. ఇలాంటి చేదు అనుభవాలు వద్దనుకుంటే.. మీ వివరాలను చెప్పకూడదు.

- మీ వ్యక్తిగత వివరాలు పూర్తిగా రహస్యం. క్రెడిట్, డెబిట్ కార్డు నెంబర్లు, సీవీవీ సంఖ్య, ఓటీపీ, రహస్య సంఖ్యలు, పాస్‌వర్డ్‌లు.. ఇలాంటివన్నీ మీరు వాడుకునేందుకేనని మర్చిపోవద్దు. వీటి వివరాలను ఇతరులకు చెప్పకూడదు.

ఫోన్ తీయగానే ఓ మహిళా స్వరం.. అనర్గళమైన ఆంగ్లంలో..

> హలో సార్.. మేం ఫలానా బ్యాంకు నుంచి ఫోను చేస్తున్నాం. ఖాతాలో మీ వివరాలను అప్‌డేట్ చేయాలి. మీ వివరాలు చెబుతారా? లేకపోతే, మీ అకౌంట్ క్యాన్సిల్ అవుతుంది.

మరో ఫోన్ కాల్. ఫోన్ లిఫ్టు చేయగానే..

> గుడ్ మార్నింగ్ మేడం, ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి ఫోను చేస్తున్నాం. మీకు లక్ష రూపాయల చెక్కు వచ్చింది. మీ ఖాతా వివరాలు చెబితే.. అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తాం.

- కొందరు తెలివిగా ఏం చేస్తారంటే.. మీ బ్యాంకు ఖాతా నెంబరు, పాన్ కార్డు నెంబరు, మీ చిరునామాలు కూడా చెబుతుంటారు. బ్యాంకు సిబ్బందే ఫోన్ చేసినట్లు మిమ్మల్ని భ్రమల్లో ఉంచుతారు. మన సమాచారం ఎంతోకొంత మోసగాళ్లకు చేరే ఉంటుంది కాబట్టి.. అవన్నీ చెప్పడం సహజమే. కాకపోతే, మిగతా వివరాలను మీ వద్ద నుంచి రాబట్టడానికి ప్రయత్నిస్తుంటారు. అలాంటప్పుడు ఆయా బ్యాంకులకు ఫోన్ చేసి మాట్లాడాలి. ఒకవేళ బ్యాంకు ఎలాంటి సమాచారం అడిగినా.. వారి వద్దకు వెళ్లి ఇవ్వడానికి ప్రయత్నించాలి.
- సోషల్ మీడియా సైట్లలో వ్యక్తిగత వివరాలను పెట్టడం కరెక్టు కాదని గుర్తుంచుకోవాలి. బ్యాంకు వివరాలను అసలే పెట్టకూడదు. ఇంటర్నెట్ సెంటర్లలో ఆన్‌లైన్ లావాదేవీలను నిర్వహించకుండా ఉంటే ఉత్తమం.
- కొన్నిసార్లు మనం ఆన్‌లైన్ పాస్‌వర్డులను మర్చిపోతాం. అలాంటప్పుడు కొత్త పాస్‌వర్డును ఏర్పాటు చేసుకోవడానికి వన్‌టైం పాస్‌వర్డును మొబైల్ లేదా ఈ మెయిల్‌కు పంపిస్తుంటాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలి.
- నమ్మకమైన వెబ్‌సైట్లలో మాత్రమే క్రెడిట్ కార్డులను ఉపయోగించి చెల్లింపులు చేయాలి. బిల్లులు చెల్లించేటప్పుడు కచ్చితంగా సంక్షిప్త సందేశాలు వచ్చేలా ఏర్పాటు చేసుకోవాలి.



పెద్ది శ్రీనివాస్
వైస్ ప్రెసిడెంట్
జెన్ సెక్యూరిటీస్

షేరు మార్కెట్ దూకుడు మీద ఉంది. ఆల్‌టైమ్ రికార్డులను సెన్సెక్స్, నిఫ్టీ బ్రేక్ చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో మనలో చాలామంది షేర్ మార్కెట్‌లో అడుగుపెట్టాలని భావిస్తారు. అందులో లాభాలను అందుకోవాలని ఆరాటపడతారు. అయితే, మీ ఆలోచన మంచిదే అయినప్పటికీ, అనుకున్నంత సులువుగా స్టాక్స్‌లో లాభాలను గడించలేరు. కొన్ని ప్రాథమిక విషయాలపై అవగాహన పెంచుకుని అడుగుపెడితేనే సాధ్యమవుతుంది. ముఖ్యంగా, షేరు మార్కెట్ పయనం గురించి తెలుసుకోవాలి. ఒక్కో స్టాకు ధర ఎప్పుడు పెరుగుతుంది? అలా పెరగడానికి గల కారణాలేమిటి? షేరు విలువ పెరిగినంత మాత్రాన మనం లాభాలను అందుకోవచ్చా? షేరు మార్కెట్ లోగుట్టు ఏమిటో ముందుగా అర్థం చేసుకోవాలి. ఇలాంటి క్లిష్టమైన షేర్ మార్కెట్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను ఎంతో సులువుగా అర్థమవ్వడానికి 'నమస్తే నిధి' అందిస్తున్న ప్రత్యేక కథనం.. మీ కోసం!!



ఒక సంస్థ షేరు కొంటే.. అందులో మనం వాటాదారులం అవుతాం. ఆ కంపెనీ లాభనష్టాల్లో మనకూ బాధ్యత ఉంటుంది. దీర్ఘకాలంలో పెరిగే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని.. మంచి రాబడిని అందుకోవాలని ఆశించేవారు ఈక్విటీల్లో మదుపు చేయడం ఉత్తమం అని చెప్పొచ్చు. నిఫ్టీ, సెన్సెక్స్ దూకుడు మీద ఉండటం.. మునుపెన్నడూ లేనంత ఉన్నత స్థాయికి చేరుకోవడం.. మార్కెట్లో సానుకూల పరిణామం నెలకొనగానే.. ఈక్విటీల్లో మదుపు చేసే సాధారణ మదుపరుల శాతం పెరుగుతున్నది. దీంతో, మార్కెట్ ఆశించిన స్థాయి కంటే ఉన్నత దిశకు దూసుకెళుతోంది. ఒకసారి షేర్లలో మదుపు చేస్తే.. దీర్ఘకాలంలో దాన్ని విలువ పెరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కాకపోతే, ఏమాత్రం తప్పుడు నిర్ణయం తీసుకుంటే.. సొమ్మంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అందుకే, షేర్ల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలి. ప్రాథమికంగా అభివృద్ధికి ఆస్కారమున్న స్టాకులను ఎంచుకోవాలి. మీ ఆర్థిక లక్ష్యాలేమిటి, ఎంత వరకూ రిస్క్ తీసుకుంటారు? అనే అంశాల ఆధారంగానే షేర్లను ఎంచుకోవాలి. ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే.. షేర్లలో మదుపు చేయడమనేది ఎల్లప్పుడూ సవాలు వంటిదేనని చెప్పొచ్చు. ఒక్కసారి రిస్క్ తీసుకుంటే.. ఊహించిన దానికంటే అధిక లాభాలూ మన చేతికి అందుతాయని గుర్తుంచుకోండి. అందుకే, షేర్లలో మదుపు చేసేవారు తప్పనిసరిగా పలు ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

పీఈ, బుక్‌వ్యాల్యూ, ఈపీఎస్.. ఇలా ఏదో ఒక దానిపై మాత్రమే ఆధారపడకుండా.. అన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కంపెనీలను ఎంచుకోవాలి.

ఈక్విటీలో మదుపు చేయడం వల్ల పన్ను లాభాలను అందుకోవచ్చు. పన్నెండు నెలల కంటే అధిక కాలం పాటు షేర్లను కదపకుండా ఉంచిన వాటిని విక్రయించడం ద్వారా వచ్చే లాభాలపై పన్ను చెల్లించనక్కర్లేదు. ఏడాది లోపు ఆదాయం ఆర్జిస్తే.. స్వల్పకాలిక మూలధన లాభం కింద పదిహేను శాతం కట్టాల్సి ఉంటుంది. సంవత్సరానికి రూ.10 లక్షల కంటే తక్కువ డివిడెండులపై పూర్తి స్థాయి మినహాయింపు ఉంటుంది.

మీరు మొట్టమొదటిసారి స్టాకు మార్కెట్‌లో మదుపు చేస్తున్నారా? అయితే, నిపుణుల సాయం తీసుకోవాలి. ఈ రంగంలో నిపుణులు లేదా స్టాక్ బ్రోకర్ లేదా ఆర్థిక నిపుణుడి సలహా తీసుకోవాలి. మీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను బట్టి.. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సరైన షేర్లను ఎంపిక చేసుకోవచ్చు. స్టాక్ మార్కెట్‌పై మీకు పూర్తిగా అవగాహన వచ్చేవరకూ సొంత నిర్ణయాలు తీసుకోకుంటే ఉత్తమం.

ఏ షేరు.. ఎక్కువ లాభం!

మార్గాలు రెండు..

మీరు షేర్లలో ఎంతోకొంత మదుపు చేయాలనుకుంటున్నారా? అయితే, ఎందులో పెట్టుబడి పెడతారు? ఇందులో ప్రధానంగా ప్రైమరీ, సెకండరీ అనే రెండు రకాల మార్కెట్లు ఉంటాయని గుర్తుంచుకోండి. ప్రైమరీ మార్కెట్లో ఐపీవో (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా కంపెనీలు కొత్తగా షేర్లను విడుదల చేస్తాయి. ముఖ్యంగా, పెట్టుబడి నిమిత్తం లేదా నిధులను సేకరించడానికి పలు కంపెనీలు ఐపీవో ద్వారా షేర్లను సాధారణ మదుపుదారులకు విక్రయిస్తాయి.

- ప్రైమరీ మార్కెట్లో షేర్లు అమ్ముడయ్యాక.. మళ్లీ వాటిని అమ్మాలన్నా, కొనుగోలు చేయాలన్నా.. స్టాక్ ఎక్స్ఛేంజీ ద్వారానే వెళ్లాలి. ఇలా రెండోసారి షేర్లను సెకండరీ మార్కెట్లోనే కొనాలి. అయితే, ఆయా కంపెనీల ఆర్థిక బలాబలాలను బట్టి.. వాటి ధర ఉంటుందని మర్చిపోవద్దు.

ఈక్విటీ రిటర్నులు..

ఈక్విటీలు సాధారణంగా రాబడిని రెండు రకాలుగా అందిస్తాయి. ఒకటేమో స్పెక్యులేటివ్, మరోటి ఫండమెంటల్ గ్రోత్. చాలా మంది మొదటి దానికే ఆకర్షితులవుతారు. కంపెనీకి సంబంధించి ఏదో ఒక ఊహాజనిత విషయం బయటికి పొక్కగానే.. దాని వల్ల లాభపడే సంస్థల షేర్లను కొనడానికి ఆసక్తి చూపిస్తారు. ఫలితంగా, వాటి షేర్ విలువలో హెచ్చు తగ్గులుంటాయి. అతితక్కువ సమయంలో మార్కెట్ నుంచి లాభపడాలని ఆశించేవారు మొదటి మార్గాన్ని ఎంచుకుంటారు. వీరు నష్టభయాన్ని ఎదుర్కోవడానికీ సంసిద్ధంగా ఉండాలి. మంచి పనితీరు కనబరిచే సంస్థలను ఎంచుకుంటే.. మెరుగైన రాబడిని అందుకోవచ్చు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టేటప్పుడు పలు ముఖ్యమైన విషయాలు తెలుసుకోవాలి.

బిజినెస్ మోడల్ అర్థమైందా?

మీరు ఏదో ఒక సంస్థకు చెందిన షేర్లను కొనాలనుకున్న నిర్ణయానికి వచ్చినప్పుడు.. ఆయా సంస్థ బిజినెస్ మోడల్‌ను అర్థం చేసుకోవాలి. ఎప్పట్నుంచి ఈ రంగంలో ఉన్నది? అది ఏ రంగానికి చెందిన సంస్థ, పోటీదారులెవరు? ఇతర వాటితో పోల్చితే, మీ కంపెనీ ప్రత్యేకత ఏమిటి? వాటి భవిష్యత్తు లక్ష్యాలేమిటి? అభివృద్ధికి ఎంతమేరకు ఆస్కారం ఉన్నదనే అంశంపై అవగాహన పెంచుకోవాలి.

నిర్వహణలో మంచి చరిత్ర..

సంస్థ ప్రమోటర్లు ఎవరు? కంపెనీని ఎవరు నిర్వహిస్తారు? వంటి అంశాలను పరిశీలించాలి. నియమ నిబంధనలు పాటిస్తారా? అక్రమాలకు, అవకతవకలకు పాల్పడతారా? వంటివి అంచనా వేయాలి. కంపెనీ మేనేజ్‌మెంట్ ట్రాక్ రికార్డును గమనించాలి. సంస్థను ఉన్నతమైన శిఖరాలకు తీసుకెళ్లే సత్తా ఉందా? ఇలాంటి అంశాల్లో నమ్మకమనిపిస్తే.. మదుపు చేయవచ్చు.

ఆర్థిక వ్యవస్థ ఎలా ఉన్నది?

మీరు ఎంచుకున్న సంస్థకు సంబంధించిన ఆర్థిక విషయాలు మెరుగ్గా ఉన్నాయా? అనే విషయాన్ని ఆరా తీయాలి. ప్రస్తుతం ఆయా సంస్థ ఎంతమేరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నది? ఎంతమేరకు అభివృద్ధి చెందడానికి ఆస్కారమున్నదో తెలుసుకోవాలి. దాదాపు అన్ని లిస్టెడ్ కంపెనీలు త్రైమాసిక, వార్షిక నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది. వాటిని చూస్తే.. కంపెనీ పనితీరు, ఎదుగుదల సంపూర్ణంగా తెలుస్తుంది. కొన్నేండ్ల నుంచి ఆ సంస్థ లాభనష్టాలు అర్థమవుతాయి. వీలైతే, అధిక ఆదాయాన్ని ఆర్జించే సంస్థల మీదే దృష్టి సారించడం ఉత్తమం. అలాంటి కంపెనీలే.. మదుపురులకు మంచి అధిక ఆదాయాన్ని తెచ్చి పెడతాయి.

- ఒక కంపెనీ షేరును కొంటారా? అట్టి సంస్థకు చెందిన ఆస్తులు, అప్పులు, ఉత్పత్తి స్థాయి, ఆస్తులపై ఆదాయం వంటివి తెలుసుకోవాలి. మదుపుదారుల సొమ్మును సమర్థంగా నిర్వహిస్తుందా? అప్పులెలా ఉన్నాయి? అధ్యయనం, అభివృద్ధిపై దృష్టి పెడుతున్నదా? అమ్మకాల నుంచి ఎలాంటి లాభాలను పొందుతుంది? ఇలాంటి అంశాలపై అధిక దృష్టి సారించాలి.

వైవిధ్యమైన రీతిలో..

మీరు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే.. ఒకే స్టాక్ మీద లేదా ఒకే రంగానికి చెందిన కంపెనీలో షేర్లు కొనకూడదు. వీలైనంత వరకూ వివిధ రకాల రంగాల్లో సొమ్మును విభజించి మదుపు చేయాలి. అయితే, మదుపుదారుడు నష్టభయం ఆధారంగానే తుది నిర్ణయం తీసుకోవాలి. రాత్రికి రాత్రే ధరలు పెరిగే సంస్థలకు చెందిన షేర్లు కాకుండా.. దీర్ఘకాలంలో మంచి ప్రగతిని కనబరిచే కంపెనీలను ఎంచుకోవాలి. భావోద్వేగాలు నియంత్రించుకోలేనివారే అధిక సందర్భాల్లో స్టాక్ మార్కెట్లో చేతులు కాల్చుకుంటారు. వీరు ప్రధానంగా అత్యాశతో లేదా భయంతో షేర్లు అమ్మకాలు, కొనుగోలు చేస్తుంటారు. ముఖ్యంగా, అంతగా పరిచయం లేని సంస్థల్లో సొమ్ము పెట్టి అనవసరంగా సొమ్మును కోల్పోతారు.

ఒక కంపెనీ షేరును ఎంచుకునేటప్పుడు ధర తక్కువుందని మాత్రమే తుది నిర్ణయానికి రాకూడదు. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ, మంచి ఫలితాలను ఇస్తున్న కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం ఉత్తమం. ఎందుకంటే, అలాంటి కంపెనీలలో ఒడుదొడుకులకు ఆస్కారం తక్కువుంటుంది. మనం కొన్న స్టాకు రేటు తగ్గితే, తగ్గడానికి గల కారణాలను తెలుసుకోవాలి. ఎందుకు తగ్గిందనే విషయాన్ని ఆరా తీయాలి. మళ్లీ, ఆ షేరు ధర ఎప్పుడు పెరిగే అవకాశముందో అంచనా వేసిన తర్వాతే ఆ స్టాకును కొనసాగించాలా? లేదా? అనే నిర్ణయానికి రావాలి. అధిక శాతం మంది ఒక కంపెనీ గురించి పూర్తిగా తెలుసుకోకుండానే మదుపు చేసి సొమ్ము పోగొట్టుకుంటారు. మీ స్నేహితులు చెప్పారనో.. బంధువులు కొన్నారనో షేర్లను ఎంచుకోవద్దు. వ్యక్తులను బట్టి, వారి పెట్టుబడి కాలాన్ని బట్టి నష్టతీవ్రత అనేది ఆధారపడుతుంది.

షేరుపై ఎంత ఆదాయం?

ఒక షేరుపై ఎంత ఆదాయం వస్తుంద (ఈపీఎస్– ఎర్నింగ్స్ ఫర్ షేర్)నేది అత్యంత కీలకమని గుర్తుంచుకోవాలి. ఒక కంపెనీ నికర ఆదాయాన్ని ఆ కంపెనీ మొత్తం షేర్లతో భాగించినప్పుడు ఈ విలువ వస్తుంది. స్టాక్‌మార్కెట్లో మదుపు చేసేవారు సాధారణంగా ఈ విలువను గమనిస్తారు. అధిక ఈపీఎస్, సానుకూల అంశాలున్న కంపెనీల్లోనే అధిక శాతం మదుపు చేస్తారు. ప్రతికూల ఈపీఎస్ ఉంటే, ఆయా సంస్థల మదుపుదారులకు డివిడెండ్లను పంపిణీ చేస్తాయా? అనేదీ అత్యంత కీలకమని గుర్తుంచుకోవాలి.

బుక్ వ్యాల్యూ

సంస్థ బుక్ వ్యాల్యూ సంస్థ షేరు విలువ బట్టి తెలుస్తుంది. ఈ విషయం.. సంస్థ ఆర్థిక లావాదేవీలను గమనిస్తే తెలుస్తుంది. ఒక షేరు ధర దాని బుక్ వ్యాల్యూకు ఎన్ని రెట్లు ఎక్కువ/తక్కువగా లభిస్తుందనే అంశంపై.. దాన్ని కొనుగోలు నిర్ణయం ఆధారపడుతుంది. ప్రైస్ టు బుక్ వ్యాల్యు తక్కువుంటే.. కంపెనీ షేరు తక్కువ ధరకు నమోదవుతుంది.

పీ/ఈ (ప్రైస్ ఎర్నింగ్స్) నిష్పత్తి

ఒక షేరు ప్రస్తుత ధరను దాన్ని ఆర్జనతో భాగిస్తే వచ్చే విలువను పీఈ నిష్పత్తి అంటారు. ఒక కంపెనీ పీఈ తక్కువగా ఉండి.. భవిష్యత్తులో ఎక్కువ ఆదాయాన్ని అందించగలిగే దాంట్లో పెట్టుబడి పెట్టడం మంచిది. పీఈ తక్కువగా ఉండి.. భవిష్యత్తు అంచనాలు లాభదాయకంగా లేకుంటే.. వాటిలో పెట్టుబడులు పెట్టడం ప్రమాదకరం. కంపెనీ పీఈ ఎక్కువ ఉన్నప్పటికీ, దాన్ని భవిష్యత్తు అంచనాలు అధికంగా ఉంటేనే పరిశీలించాలి. ఉదాహరణకు, 'ఏ' అనే ఒక కంపెనీ షేరు ధర రూ.40 ఉందనుకోండి.. దాన్ని ఆర్జన రూ.2 అయితే, దాన్ని పీఈ నిష్పత్తి 20 అవుతుంది. అలాగే, 'బి' అనే కంపెనీ షేరు ధర రూ.40 ఉంటే, దాన్ని ఆర్జన రూ.1.60 అనుకుంటే, పీఈ 25 అవుతుంది. ఒకే రంగంలో ఉన్న ఈ రెండు కంపెనీలను పరిగణనలోకి తీసుకుంటే.. సాధారణంగా, తక్కువ పీఈ ఉన్న కంపెనీ అనగా 'ఏ'ను ఎన్నుకుంటాం. అయితే, ఆ కంపెనీల భవిష్యత్తు ఆదాయాన్ని లెక్కలోకి తీసుకుంటే.. కంపెనీ 'ఏ' కన్నా 'బి' ఆశాజనకంగా ఉందనుకుంటే.. కంపెనీ 'బి'ని ఎన్నుకుంటాం. ఇక్కడ పీఈ నిష్పత్తి 'బి'కి ఎక్కువ ఉన్నప్పటికీ.. ఆ కంపెనీ భవిష్యత్తులో అధిక రాబడిని ఇచ్చే అవకాశముంది. కాబట్టి, పీఈ నిష్పత్తితో బాటు ఆ కంపెనీ భవిష్యత్తు ఆర్జనలను దృష్టిలో పెట్టుకుని పెట్టుబడి నిర్ణయం తీసుకోవాలి.

డివిడెండ్ ఎంత చెల్లిస్తుంది?

ఒక సంస్థ లాభాలను ఆర్జించిన తర్వాతే డివిడెండ్‌ను ప్రకటిస్తుంది. కాబట్టి, అధిక డివిడెండ్‌ను అందించే సంస్థల్లోనే మదుపు చేయాలి. దీర్ఘకాలంగా డివిడెండ్లు ఇచ్చే వాటిని ఎంచుకోవాలి. సంస్థ అందించే డివిడెండ్లపై మదుపుదారులకు పన్ను బెడద ఉండదు.

అప్పు ఎంత?

ఒక సంస్థ అప్పుల్లో ఉందా? లేదా? ఉంటే, ఎంత అప్పుల్లో ఉన్నది? ఇందుకు సంస్థ బ్యాలెన్స్ షీటును పరిశీలించాలి. పలు సంస్థలకు అప్పులు ఎక్కువే ఉంటాయి. వాటి లాభాలను అప్పులకే సరిపోతుంది. అలాంటి వాటిలో మదుపు చేయకూడదు. ఇదే క్రమంలో మిగులు నిధులున్న కంపెనీలను ఎంచుకోవాలి. మూడు నుంచి ఐదేండ్ల వరకూ అక్కర్లేని సొమ్మును మాత్రమే పెట్టుబడిగా పెట్టుకోవాలి. స్వల్పకాలంలో ఈక్విటీలు ఒడిదొడుకులకు లోనైనా.. దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే.. మంచి ఆదాయాన్ని అందుకోవచ్చు. కాబట్టి, ఓ ఐదేండ్ల తర్వాత ఆర్థిక లక్ష్యాలను చేరుకునే విధంగా స్టాక్ మార్కెట్లో మదుపు చేయాలి.

ఏ సెక్షన్? ఎంత తగ్గింపు?

మార్చి వస్తే చాలు.. మనలో చాలామంది పన్నుపోటును తగ్గించుకోవడం మీదే దృష్టి సారిస్తాం. ఉద్యోగి అయినా వ్యాపారి అయినా.. ఐటీ రిటర్నులను తప్పకుండా దాఖలు చేస్తారు. మరి, ఏయే సెక్షన్లపై ఎంతెంత తగ్గింపు ఉంటుందో ఒక లుక్కేద్దామా..

... శివకృష్ణ గంధం, ఛార్టెడ్ అకౌంటెంట్

సెక్షన్	తగ్గింపు	ఎంత వరకూ?
సెక్షన్ 24(బి)	గృహరుణంపై వడ్డీ	రూ.2 లక్షలు
సెక్షన్ 80సి 80సిసి	ప్రత్యేకమైన పొదుపు పథకాలు ఎల్ఐసీ యాన్యుటీ ప్లాన్‌లో డిపాజిట్ లేదా పెన్షన్ కోసం పొదుపు (సెక్షన్ 10 23ఏఏబీ ప్రకారం)	
80సీసీడీ	జాతీయ పింఛన్ పథకంపై ఉద్యోగి వాటా	1.50 లక్షలు
80 సీసీడీ (1బి)	ఎన్‌పీఎస్‌కు అదనపు కాంట్రిబ్యూషన్	50 వేలు
80టీటీఏ (1)	పొదుపు ఖాతాపై వడ్డీ ఆదాయం	10,000
80జీజీ	హెచ్‌ఆర్‌ఏ లభించకపోతే చెల్లించే ఇంటి అద్దెపై	60,000
80ఈ	విద్యారుణంపై వడ్డీ	8 ఏండ్లు వడ్డీ
80ఈఈ	మొదటిసారి ఇల్లు కొన్నవారికి	50 వేలు
80సీసీజీ	ఈక్విటీల్లో రాజీవ్ గాంధీ ఈక్విటీ స్కీముపై పెట్టుబడి	25,000
80డీ	మెడికల్ ఇన్సూరెన్స్– భార్య, పిల్లలతో కలిపి 60 ఏండ్లు దాటిన తల్లిదండ్రులకు మెడికల్ ఇన్సూరెన్స్ బీమాసౌకర్యం లేని 80 ఏండ్లు పైబడిన తల్లిదండ్రులకు	25,000 30,000
80డీడీ	పిల్లల వికలాంగులైతే, వారికయ్యే వైద్య ఖర్చులు– * వైకల్యం 40– 80 శాతంలోపు రూ.75,000 * వైకల్యం 80 శాతం దాటితే	1,25,000
80యు	వైకల్యం వల్ల ఇబ్బంది పడేవారు.. * శారీరక వైకల్యం (అంధత్వం) మానసిక ఆందోళన * తీవ్రమైన మానసిక వైకల్యం	75,000– 125000

పాత కారు కొంటున్నారా..



ఆధునిక యువతది రాజీపడే మనస్తత్వం కాదు. అందుకే, కాస్త సంపాదన మొదలైతే చాలు.. ఏ వస్తువునైనా కొనడానికి వెనుకాడటం లేదు. చివరికీ కారు అయినా సరే. అయితే, కొత్త కారు కొనాలంటే కొంత సమయం పడుతుంది కాబట్టి, పాత కారును ఎంచక్కా కొనేస్తున్నారు. మరి, ఇలాంటివారంతా పాత కారును కొనేటప్పుడు పలు కీలక అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రస్తుతం కొత్త కార్ల షోరూంల్లాగానే పాత కార్లకూ అనేక షోరూములు మార్కెట్లోకి వచ్చేశాయి. ఆన్‌లైన్లోనూ కారును ఎంచుకునే వెసులుబాటు వచ్చేసింది. ఇంకా తెలిసిన వారి దగ్గర్నుంచి, మిత్రులు వాడిన కారు ఏదైనా సరే. అయితే కారు కొనేటప్పుడు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. కానీ పాత కారు కొనేటప్పుడు చాలా విషయాలను పట్టిపట్టి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా కారు పత్రాలకు సంబంధించి. కొన్నిసార్లు నకిలీ పత్రాలతో.. మోసపూరితంగా కార్లను అంటగట్టే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటివి జరిగితే లేనిపోని చిక్కులను కొన్నట్లు అవుతుంది. మానసిక ప్రశాంతత దూరం అవుతుంది. అందుకే, పాత కారు కొనేటప్పుడు పలు అంశాల్ని చూడాలి.

వాహన బీమా ఉందా?

పాత కారు కొనేవారు చూడాల్సిన మొదటి పత్రం ఇదే. మీరు కారు కొనే ముందుగా వాహన బీమాను మీ పేరు మీదకు మార్చుకోండి. దీనివల్ల మున్ముందు అనుకోని సందర్భాల్లో క్లెయిం చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవచ్చు. ఇలా పేరు మార్చుకునే ముందు కారు మొదటి యజమాని వాహన బీమా ప్రీమియాన్ని క్రమం తప్పకుండా చెల్లించారా లేదా అనేది తెలుసుకోండి. పాలసీ వ్యవధి ముగింపు తేదీ చూడండి. బీమా కంపెనీని సంప్రదించి గతంలో ఏమైనా క్లైయిములు ఉన్నాయా ఉంటే.. ఎలాంటివి అనేది అడగండి. దీని వల్ల మీరు కొనే కారు గతంలో ఏదైనా ప్రమాదం బారినపడిందా అనేది తెలుస్తుంది. భారత దేశంలో వాహనాలకు థర్డ్ పార్టీ పాలసీ తప్పనిసరి. పూర్తి స్థాయి బీమా పాలసీ ఉన్నప్పుడే అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు మరమ్మత్తులకు మన జేబుపై భారం పడదు. ఏ బీమా సంస్థ నుంచి పాలసీ తీసుకుంటున్నారన్నది ముఖ్యమే. మీరు తీసుకున్న కారుకు థర్డ్ పార్టీ బీమా ఉండేలా చూసుకోండి. ఒకవేళ ఇప్పటికే బీమా పాలసీ వ్యవధి ముగిసిపోతే.. కొత్త పాలసీ తీసుకునేందుకు వాహనాన్ని బీమా కంపెనీ లేదా ఏజెంటు పరిశీలనకు తీసుకెళ్లాలి. ఇలాంటప్పుడు కొత్త పాలసీ అందుబాటులోకి రావడానికి ఒకట్రెండు రోజుల సమయం పడుతుంది. ఈ సమయంలో వాహనాన్ని నడపకుండా ఉండటమే మేలు.

ఆర్సీ సంగతేంటి?

కారు యాజమాన్యం గుర్తించే కీలకమైన పత్రం రిజిస్ట్రేషన్ సర్టిఫికెటు. కారు ఎవరి పేరు మీద ఉంది.. ఇప్పటివరకూ ఎన్ని సార్లు చేతులు మారింది. ఛాసీస్, ఇంజిను నెంబరు, తయారీ సంవత్సరం, ఎక్కడ రిజిస్ట్రేషను అయ్యింది.. తదితర కీలక విషయాలన్నీ ఇందులోనే ఉంటాయి. కారు కొనే ముందు ఈ పత్రాన్ని జాగ్రత్తగా గమనించాలి. అసలు పత్రం ఇస్తున్నారా.. దాని నకలా చూసుకోవాలి. ఒకవేళ మీరు కొన్న కారు ఇతర రాష్ట్రానికి చెందింది అయితే, మీ సొంత రాష్ట్రంలో తిరిగి రిజిస్ట్రేషను చేయించుకోవాలి. తీవ్ర ప్రమాదం బారినపడ్డప్పుడు ఇంజనును పూర్తిగా మార్చేస్తారు. ఇలాంటప్పుడు కొత్త ఇంజను నెంబరును ఆర్సీలో నమోదు చేశారా లేదా చూసుకోవాలి.

మరమ్మత్తుల చరిత్ర?

వాహనానికి నిర్ణీత సమయంలో మరమ్మత్తులు చేయించాలి. ఇది సరైన సమయానికి చేస్తేనే వాహనం పని తీరు బాగుంటుంది. కారు పూర్వ యజమాని ఇదంతా చేశారా లేదా అనేది సర్వీసు పుస్తకం చూసి తెలుసుకోవచ్చు. దీని ద్వారా వాహనానికి పెద్ద పెద్ద మరమ్మత్తులు ఏమైనా జరిగాయా అనేదీ తెలుస్తుంది.

సుడోకు

డైలీ సుడోకు 111 సమాధానం

5	2	7	8	9	6	4	3	1
9	8	3	4	7	1	5	2	6
6	4	1	5	3	2	8	7	9
1	3	5	9	8	7	2	6	4
4	7	6	2	5	3	9	1	8
8	9	2	6	1	4	7	5	3
3	5	4	7	6	8	1	9	2
2	1	9	3	4	5	6	8	7
7	6	8	1	2	9	3	4	5

డైలీ సుడోకు -112

2		3	7	8		1		
	1	9				2		
4		7	9	1				
		2		5	9	3	4	1
	4		3	2	1		5	
1	3	5	4	7		9		
				9	8	6		2
		1				8	3	
		6		3	7	4		9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

నమస్తే తెలంగాణ
సంపద
[హైదరాబాద్]
శనివారం 27 జనవరి 2018

4 శాతం జీఎస్టీ తగ్గింపు

తక్కువ విస్తీర్ణం ఇండ్లను కొనేవారికి శుభవార్త. ఇక నుంచి వీరి ఇండ్ల ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి. క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీము కింద కొనుగోలు చేసే గృహాలపై నాలుగు శాతం జీఎస్టీ తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. 645 చదరపు గజాల ఇండ్లను కొంటే.. ఈ తగ్గింపు వర్తిస్తుంది. జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న ఈ తాజా నిర్ణయం వల్ల.. అందుబాటు గృహాలకు ఆదరణ పెరగడానికి ఆస్కారమున్నది. ఈ నిర్ణయం ఇప్పటికే రెండు రోజుల క్రితమే అమల్లోకి రావడం గమనార్హం. ఇక నుంచి ఈ తరహా గృహాలను నిర్మించే డెవలపర్ల సంఖ్య అధికమవుతుందని పలువురు రియల్టర్లు చెబుతున్నారు. అయితే, ఇతర ఇండ్లను కొనేవారు యధావిధిగా పన్నెండు శాతం జీఎస్టీ కట్టాల్సిందే.

కొనుగోలుదారులు కొన్నిసార్లు చాలా విచిత్రంగా ఆలోచిస్తారు. పావు శాతం వడ్డీ రేటు తగ్గినా తగ్గినట్లేనని భావించి ఇండ్లను కొంటారు. అలాంటిది, నాలుగు శాతం జీఎస్టీని తగ్గించడం వల్ల.. ఆ విభాగంలో సొంతింటి కలను సాకారం చేసుకునేవారు ఏమాత్రం ఆలస్యం చేయరని ఓ డెవలపర్ అభిప్రాయపడ్డారు. జీఎస్టీ తగ్గడం వల్ల నిర్మాణ సామగ్రి, సేవలపై డెవలపర్లకు అధిక ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లభిస్తుంది. ఇది వాళ్లకెంతో మేలు చేస్తుంది. జాతీయ స్థాయిలో ఆర్థిక వ్యవస్థకు గొప్ప శుభవార్తను అందించే వార్త ఇది అని కొందరు రియల్టర్లు వ్యాఖ్యానిస్తున్నారు. కొంతకాలంగా ఎదురు చూస్తున్న కొనుగోలుదారులకు ఇది మంచి ఊరట అని పలువురు బిల్డర్లు అంటున్నారు. హైదరాబాద్‌లో ఇక నుంచి ఈ తరహా ఇండ్లను నిర్మించే డెవలపర్ల సంఖ్య పెరుగుతుందని చెబుతున్నారు. ప్రధానంగా, భూముల ధరలు తక్కువగా ఉండి.. ఔటర్ రింగ్ రోడ్డుకి చేరువలో ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించడానికి పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇక నుంచి నగరంలో ఈ గృహాలదే హవా అని చెప్పొచ్చు.



డెవలపర్లకు కావాలి ముందుచూపు!



హైదరాబాద్ రియల్ రంగం దేదీప్యమానంగా వెలుగుతోంది. ఇటీవల కాలంలో మార్కెట్లో ఇండ్ల అమ్మకాలు గణనీయంగా పుంజుకున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కొనుగోలుదారులు సొంతింటిని కొంటున్నారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గే ప్రసక్తే లేదు. కాకపోతే, నగరానికి చెందిన బిల్డర్లు, డెవలపర్లు ముందుచూపుతో వ్యవహరించాల్సిన సమయమిదే! లేకపోతే నొయిడా, గుర్గావ్‌లో రియల్ రంగం మాదిరిగా మన వద్ద విపత్కర పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు. చేతులు కాలిన తర్వాత, ఆకులు పట్టుకోవడం బదులు.. పుణే రియల్ విధానాన్ని హైదరాబాద్ నిర్మాణ రంగం అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- ప్రాజెక్టు ప్రారంభానికి ముందే అధ్యయనం
- నిర్మాణ సంస్థలకు అనేక ప్రయోజనాలు..
- గిరాకీ, సరఫరాలు తెలిసే అవకాశం!
- బయ్యర్ల ఆర్థిక స్థోమతపై అవగాహన
- ఏయే సైజుల ఫ్లాట్లకు గిరాకీ అంచనా..
- అప్పుడే ఎదురుదెబ్బలు తినకుండా ఆస్కారం

పుణే రియల్ రంగంలో ఒక మంచి విధానం అమల్లో ఉన్నది. అక్కడ ప్రతి సంవత్సరం శాస్త్రీయ పద్ధతిలో రియల్ మార్కెట్ సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహిస్తారు. ఏయే ప్రాంతాల్లో కొత్తగా ఫ్లాట్ల నిర్మాణం ప్రారంభమైంది? ఎక్కడ రెండు పడక ఫ్లాట్లు అమ్ముడవుతాయి? ట్రిపుల్ బెడ్‌రూం ఫ్లాట్లకు గిరాకీ ఉన్న ప్రాంతాలేవి? ఒక ఏడాదిలో అధిక స్టాకు (ఇండ్లు) అందుబాటులోకి వచ్చిన ప్రాంతమేది? ఇండ్ల సరఫరా తక్కువగా ఉండి.. డిమాండ్ అధికంగా ఉన్న ఏరియాలేవి?.. ఇలా ప్రతి అంశాన్ని శాస్త్రీయ విధానంలో సర్వే జరుపుతారక్కడ. వాస్తవ పరిస్థితుల్ని ఆకళింపు చేసుకున్నాకే.. కొనుగోలుదారులేం కోరుకుంటున్నారో అర్థం చేసుకున్నాకే.. అక్కడి డెవలపర్లు కొత్త ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. గిరాకీ ఉన్న ప్రాంతాల్లోనే బిల్డర్లు అపార్టుమెంట్లను కడతారు. అంతేతప్ప, ఒంటెద్దు పోకడలకు పోరు. కానీ, మన నిర్మాణ రంగం ఇందుకు పూర్తిగా భిన్నమనే చెప్పాలి.

హైదరాబాద్‌లో శాస్త్రీయ విధానాన్ని పాటించకుండా.. మార్కెట్ సర్వే చేయకుండానే.. కొత్త ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నారు. అభివృద్ధికి భూములు దొరికితే చాలు.. శివార్లలో సైతం ప్రాజెక్టులను ప్రకటిస్తున్నారు. వాటిని అమ్మలేక, ఒకవేళ అమ్మినా సకాలంలో పూర్తి చేయక కొనుగోలుదారులను ఇబ్బంది పెడుతున్నారు. కొందరు డెవలపర్లు, నిర్మాణ సామగ్రి సరఫరాదారులకు సకాలంలో సొమ్ము చెల్లించలేని దుస్థితికి చేరుకున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులు రాష్ట్రంలో ఎదురు కాకూడదంటే.. హైదరాబాద్ నిర్మాణ రంగం శాస్త్రీయ పద్ధతిలో మార్కెట్‌ను సర్వే చేయాల్సిన అవసరముంది. నగర నిర్మాణ సంఘాలు ఈ పనికి ఉపక్రమించి.. తమ సభ్యులకు సర్వే తాజా విశేషాలకు అందించాలి. ఇలాంటి క్రియాశీలకమైన పనులను వదిలేసి.. పలు నిర్మాణ సంఘాలు వ్యాపార సంస్థల మాదిరిగా ప్రాపర్టీ షోలు, అవార్డుల ఫంక్షన్లు నిర్వహిస్తున్నాయి. వీటిని నిర్వహించడం తప్పు కాకపోయినప్పటికీ, మొత్తం నిర్మాణ రంగానికి ఉపయోపడే కార్యక్రమాలను నిర్వహిస్తే.. మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

ఏటా 25 వేల ఫ్లాట్లు..

హైదరాబాద్‌లో ఏటా అమ్ముడయ్యే ఫ్లాట్లు.. దాదాపు ఇరవై నుంచి ఇరవై ఐదు వేలకు అటుఇటుగా ఉంటాయన్నది నిపుణుల అంచనా. కానీ, ఒక్క పశ్చిమ హైదరాబాద్‌లోనే ప్రస్తుతం యాభై నుంచి అరవై వేల దాకా ఫ్లాట్ల నిర్మాణ పనులు వివిధ దశలో ఉన్నాయి. ఇందుకు సంబంధించిన స్థలం సిద్ధంగా ఉన్నది. వీటిలో కొన్ని స్థానిక సంస్థల నుంచి అనుమతులూ తీసుకున్నాయి. కాకపోతే, కొన్ని కంపెనీలు విడతలవారీగా నిర్మాణాలు చేపడుతుండగా.. మరికొన్ని అమ్మకాలను బట్టి పనులను వేగవంతం చేస్తున్నాయి. ఇవి కాకుండా, కొత్తగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టుల సంఖ్య తక్కువేం కాదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవి, కొత్తగా అందుబాటులోకి వచ్చేవాటిలో అధిక శాతం ప్రాజెక్టులు.. పశ్చిమ హైదరాబాద్‌లోనే ఉండటం విశేషం. వీటిని విక్రయించడానికి కనీసం మూడేండ్ల దాకా పడుతుంది. పైగా, సింహభాగం అధిక విస్తీర్ణం గల ఫ్లాట్లే కావడం గమనార్హం. వీటితో బాటు కొత్తగా మరో పది నుంచి ఇరవై వేల దాకా ఫ్లాట్లు అనుమతుల దశలో ఉన్నాయి. ఇవన్నీ ఒక్కసారిగా మార్కెట్లోకి విచ్చేస్తే.. కొనుగోలుదారులకు సువర్ణావకాశమని చెప్పాలి. ఒకే ప్రాంతంలో ఇలా విచ్చలవిడిగా ఫ్లాట్లను నిర్మించడం బదులు.. నగరంలోని ఇతర ప్రాంతాల్లో అందుబాటు గృహాలను చేపడితే ఉత్తమం. ఎల్ఐజీ, ఎంఐజీ వంటి నిర్మాణాలను చేపడితే మార్కెట్ నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. అలా కాకుండా, ఒకే ప్రాంతంలో ఇష్టం వచ్చినట్లు ఫ్లాట్లను నిర్మించడం వల్ల.. కొనుగోలుదారులు ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో ఫ్లాట్లు వస్తాయి. దీంతో, గిరాకీ తగ్గుముఖం పట్టే అవకాశమున్నది. దాన్ని ప్రభావం ఫ్లాట్ల తుది ధరపై పడుతుంది. పైగా, ఆయా ప్రాజెక్టుల పూర్తి అనేది ప్రశ్నార్థకం అవుతుంది. ఇలాంటి ఇబ్బందులను అధిగమించాలంటే.. నిర్మాణ సంస్థలు ఒక విజన్ ఏర్పాటు చేసుకుని.. ప్రాజెక్టులను ప్రకటించాలి.

మెట్రో రాక..

ఇక, నగరంలో మెట్రో రైలు అందుబాటులోకి రావడంతో.. ఇప్పటివరకూ పెద్దగా అభివృద్ధికి నోచుకోని వరంగల్, సాగర్, మేడ్చల్, కరీంనగర్, విజయవాడ రహదారుల్లో కొత్త నిర్మాణాల సంఖ్య పెరుగుతుంది. అయితే, ఇప్పటివరకూ పదిహేను, ఇరవై ఫ్లాట్లు నిర్మించిన బిల్డర్లు.. 'రెరా' రాకతో కనుమరుగయ్యే అవకాశముంది. ఎందుకంటే, చిన్న బిల్డర్లు 'రెరా' నిబంధనల్ని పాటించడం కొంత కష్టమేనని చెప్పాలి. అందుకే, ఇక నుంచి హైదరాబాద్ మార్కెట్లో వచ్చే ప్రాజెక్టులన్నీ భారీ విస్తీర్ణంవే ఎక్కువగా ఉంటాయి. ఈ విషయాన్ని మార్కెట్ విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్నారు. దీంతో, ఆయా ప్రాంతాల్లో సరికొత్త నిర్మాణాలు అధిక స్థాయిలో రావడానికి ఆస్కారమున్నది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో స్థలాల ధరలూ పెరిగాయి. రానున్న రోజుల్లో పశ్చిమ హైదరాబాద్ మినహా మిగతా ప్రాంతాల్లో అపార్టుమెంట్ నిర్మాణం పెరుగుతుందని కచ్చితంగా చెప్పవచ్చు. మొత్తానికి, వచ్చే రెండు నుంచి మూడేండ్లలోపు కనీసం మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్ల నిర్మాణం జరగడానికి ఆస్కారమున్నదని చెప్పవచ్చు.

ప్రజలకేం కావాలి?

హైదరాబాద్ నిర్మాణ రంగాన్ని గత మూడు దశాబ్దాల నుంచి క్షుణ్ణంగా గమనిస్తే.. ఒక్క బూమ్ సమయంలో తప్ప మిగతా సమయంలో స్థిరమైన ప్రగతిని కొనసాగించింది. మన మార్కెట్ క్రమపద్ధతిలో అభివృద్ధి చెందింది. హైదరాబాద్ నగరానికి గల ప్రధాన ఆకర్షణ.. అందరికీ తెలిసిన అంశం..ఇక్కడి ఇండ్ల ధరలు నేటికీ అందుబాటులో ఉండటమే. అందుకే, అధిక శాతం మంది మన నగరంలో ఇండ్లను కొనుగోలు చేయడానికి ముందుకొస్తున్నారు. హైదరాబాద్ రియల్ రంగానికి గల ఈ సహజసిద్ధమైన లక్షణాన్ని కోల్పోకుండా నిర్మాణ సంస్థలు జాగ్రత్తపడాలి. మరింత మంది కొనుగోలుదారులు ముందుకొచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకునే పరిస్థితుల్ని కల్పించాలి. హైదరాబాద్ నిర్మాణ రంగం ఇప్పటికైనా కళ్లు తెరిచి.. ఫ్లాట్ల గిరాకీ, సరఫరాలను పక్కాగా అంచనా వేయాలి. ఏయే విభాగంలో అధిక అమ్మకాలకు ఆస్కారముందో అవగాహనకు రావాలి. అధిక శాతం ప్రజల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని.. వారికి అందుబాటులో ఉండేవిధంగా ఇండ్లను నిర్మించాలి. అంతేతప్ప, తమకు ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో ప్రాజెక్టులను ప్రారంభించి.. వాటిని అమ్ముకోలేక మార్కెట్‌ను నిందించడం కరెక్టు కాదని గుర్తుంచుకోవాలి.

... కింగ్ జాన్సన్ కొయ్యడ

నగరం వైపు.. ఎన్ఆర్ఐల చూపు

హైదరాబాద్ విశ్వనగరంలా రూపుదిద్దుకుంటున్న నేపథ్యంలో ప్రవాస భారతీయుల దృష్టి హైదరాబాద్ వైపు మళ్లింది. ఇక్కడి రియల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు, ప్రోత్సాహకర పద్ధతులు.. ఎన్ఆర్ఐలను ప్రధానంగా ఆకర్షిస్తున్నది. గత కొంత కాలం నుంచి శివారు ప్రాంతాల్లో స్థలాల ధరలకు రెక్కలు రావడానికి ప్రధాన కారణం.. వీరంతా కొనుగోలు చేయడమేనని నగర రియల్టర్లు ధృవీకరిస్తున్నారు. కొందరైతే రేటు తక్కువ ఉన్న ప్రాంతాల వైపు మొగ్గు చూపుతుండటం విశేషం.



హైదరాబాద్ ప్రధాన ప్రాంతంలో ప్లాట్లు, ఫ్లాట్లు కొనాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఇక్కడ ఎక్కువ రేటు పెట్టి గజాల్లో కొనడం కంటే.. కాస్త అధికరేటు పెట్టి అయినా శివార్లలో ఎకరాల చొప్పున భూముల్ని కొనేవారి సంఖ్య పెరిగింది. అధిక శాతం మంది బృందాలుగా తీసుకోవడానికి ముందుకొస్తున్నారు. నగరం నలువైపుల ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు కావడంతో.. ఎక్కడ్నుంచి అయినా రాకపోకలు సులువుగా సాగించడానికి వీలు కలిగింది. ఈ నేపథ్యంలో, ఇంతవరకూ రియల్టర్లు దృష్టి సారించని ప్రాంతాల వైపు, ముఖ్యంగా రేటు తక్కువ ఉన్న ఏరియాల్లోనే వీరు దృష్టి సారిస్తున్నారు. బీరంగూడ, నల్లగండ్ల, తెల్లాపూర్, ఉప్పల్, చందానగర్, రామచంద్రాపురం, శంకర్‌పల్లి, శంషాబాద్, కొత్తూరు, సాగర్ రోడ్డు, హయత్‌నగర్, ఘట్‌కేసర్, రాజీవ్ రహదారి, నాగపూర్ రహదారి, ముంబై హైవే వంటి శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా తీసుకుంటున్నారు. ఈమధ్యకాలంలో జహీరాబాద్‌లో కూడా భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయని నిపుణులు అంటున్నారు.

హెచ్ఎండీఏ పరిధిలోని గోపనపల్లి, వట్టినాగుల పల్లి, నార్సింగి, పుప్పాలగూడ, రాయదుర్గం, మణికొండ, అల్కాపురి, మంచిరేవుల వంటి ప్రాంతాల్లో ప్లాట్ల ధరలే కాకుండా.. ఫ్లాట్ల ధరలు అనూహ్యంగా పెరిగాయని డెవలపర్లు అంటున్నారు. కేవలం మూడు నెలల్లో చదరపు గజానికి రూ. 10, 000 పైగా పెరిగిందని, మరికొన్ని ప్రాంతాల్లో ఒకట్రెండు నెలల్లోనే గజం ధర రెట్టింపు అయ్యిందని చెబుతున్నారు. పెద్దనోట్ల రద్దు వల్ల రియల్ రంగం ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ.. 2017 చివర్లో కోలుకుందని నిపుణులు అంటున్నారు.

భూములపై పెట్టుబడి..

నష్ట భయం లేకపోవడం, భవిష్యత్తులో మంచి లాభాలొచ్చే అవకాశం ఉండటంతో ప్రవాసులు భూములపై పెట్టుబడులు పెడుతున్నారు. అతి త్వరగా ధరలు పెరిగే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎకరాల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ చొరవ వల్ల బహుళజాతి కంపెనీలు ఇక్కడి తరలి రావడం, సర్కారు నిర్దేశించిన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపిస్తుండటంతో నగర శివారు ప్రాంతాల భూములకు సైతం రెక్కలు వచ్చాయి.

ఇటీవల మెదక్ జిల్లాలోని మామిడిపల్లి గ్రామంలో ఎకరా భూమిని రూ. కోటి చెల్లించి కొనుగోలు చేశారని తెలిసింది. ఐఐటీకి చేరువలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఇక ఇక్ఫాయ్, ఇతర విద్యాసంస్థలు కొలువుదీరిన శంకర్‌పల్లి, మోకిల గ్రామాల్లో ఎకరాకు రూ. 2 కోట్ల దాకా చెల్లిస్తున్నారు. ఇలా పలు ప్రత్యేక కారణాల రీత్యా నగరం విస్తరించే అవకాశం ఉన్న ప్రతి చోట పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో హైదరాబాద్ చుట్టూ ఉన్న గ్రామాల్లో సైతం భూముల రేట్లు అనూహ్యంగా పెరుగుతున్నాయి.

అందుబాటు గృహాలపై పీఈ సంస్థలు ఆసక్తి



''అందరికీ గృహాలు''.. కేంద్ర ప్రభుత్వం బృహత్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. 2022 నాటికి నగరాల్లో దాదాపు కోటి గృహాలను నిర్మించాలన్న మహోన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకున్నది. ఈ క్రమంలోనే అందుబాటు గృహాలకు ఎక్కడ్లేని ప్రోత్సాహాన్ని ప్రకటిస్తున్నది. ప్రధానంగా, వీటికి మౌలిక సదుపాయాల హోదాను మంజూరు చేసింది. తాజాగా, ప్రైవేటు ఈక్విటీ సంస్థలు వీటిపై అధిక దృష్టి సారిస్తున్నాయి. ముఖ్యంగా 2017 చివరి ఆరు నెలల్లో దేశీయ పెట్టుబడిదారులతో సహా, అంతర్జాతీయ సంస్థలు అందుబాటు గృహాలపై అమితాసక్తిని ప్రదర్శిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం వల్ల గతేడాది దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఇండ్ల ప్రాజెక్టులు ప్రారంభం అయ్యాయి. దాదాపు 45 శాతం అందుబాటు ధరల్లో ఉన్నవి కావడం విశేషం. 2017లో అందుబాటు ధరల్లో ఇండ్ల నిర్మాణం కీలకాంశంగా మారింది, 2018లో పూర్తి స్థాయిలో ఇది కార్యరూపం దాల్చుతుందని ఓ కన్సల్టెంట్ సంస్థ వెల్లడించింది. గడిచిన ఏడాది ప్రైవేటు ఈక్విటీ రియల్ ఎస్టేట్ సంస్థలు 6.1 బిలియన్ డాలర్ల విలువ చేసే సొమ్మును 67 ప్రాజెక్టుల్లో పెట్టాయి. ఇందులో దాదాపు 57 శాతం అందుబాటు ధరలో ఉన్న ఇండ్లే కావడం గమనార్హం. ఇలా మన దేశంలో పెద్ద మొత్తంలో నిధులు వస్తుండటంతో ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ 'హెచ్‌డీఎఫ్‌సీ క్యాపిటల్ అఫర్డబుల్ రియల్ ఎస్టేట్ ఫండ్-2'ను ప్రవేశపెట్టింది. మొత్తం 550 మిలియన్ డాలర్లను అందుబాటు ధరల్లో గృహాల పేరిట నిధులు సేకరించింది. 2016లో సేకరించిన నిధులను కలుపుకుంటే ఒక బిలియన్ డాలర్లు చేరుకుంటాయి. వీటితో దేశంలోని 15 పట్టణాల్లో చేపట్టే అందుబాటు ధరల ఇండ్ల ప్రాజెక్టులపై పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది.

ప్రభుత్వ తీసుకుంటున్న చర్యల వల్ల.. ఈ విభాగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. దేశంలో ఇండ్లు లేని మధ్యతరగతి ప్రజానీకం దాదాపు 18 మిలియన్ల వరకు ఉంటారని అంచనా. ఎక్కువగా పెద్ద పట్టణాల్లోనే ఈ తరహా ఇండ్లకు ఎక్కువ డిమాండ్ ఉంది. అయితే అందుబాటు ధరల్లో ఇండ్లకు మౌలిక సదుపాయాల హోదా ఇవ్వాలని గతంలో నిర్మాణ రంగం కోరగానే కేంద్రం అంగీకరించింది. మధ్యతరగతి ప్రజలు పీఎంఏవై పథకం కింద ఇల్లు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా క్రెడిట్ లింక్‌డ్ సబ్సీడీ స్కీంను ప్రవేశ పెట్టింది. ఇలాంటి పథకాల వల్ల 2022 నాటికి అందిరికి ఇల్లు అనే లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తున్నది.మరోవైపు ఏ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ఈ రంగాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు మరిన్ని పోత్సహకాలు ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

వేలానికి ప్లాట్లు ఇవే..

నగరంలో ప్లాట్లు కొనాలనుకునేవారికి హెచ్ఎండీఏ సువర్ణావకాశం కల్పిస్తున్నది. ఇప్పటివరకూ హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలిపోయిన ప్లాట్లను వేలం వేయడానికి సమాయత్తం అవుతున్నది. అంతా సవ్యంగా సాగితే ఈ నెల చివర్లో వీటిని వేలం వేస్తామని హెచ్ఎండీఏ కమిషనర్లు చిరంజీవులు చెప్పారు. ఈ వేలంలో పాల్గొనాలని భావించేవారు.. ముందుగా నిర్దేశించిన ధరలో పది శాతం ముందు చెల్లించాలి. ప్లాటు సొంతం చేసుకున్న వారం రోజుల్లోపు పాతిక శాతం సొమ్ము కట్టాల్సి ఉంటుంది. మిగతా సొమ్మును రెండు నెలల్లోపు హెచ్ఎండీఏకు చెల్లించాలి. ఆన్‌లైన్‌లో కొనుగొలుదారులెవరూ రాకపోతే.. ఆ వేలాన్ని రద్దు చేసి.. రెండోసారి వేలం వేస్తారు. ఒక ప్లాటుకు ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకుంటే.. ప్రామాణిక ధర కంటే ఎక్కువ పేర్కొనాల్సి ఉంటుంది.

ప్రాంతం	మిగిలిన ప్లాట్లు	మొత్తం గజాలు	ప్లాట్ల సంఖ్య	విస్తీర్ణం(గజాల్లో)
మియాపూర్	5	959	19	26,398
చందానగర్ (ఆర్‌సీ పురం)	5	854	9	12,633
ముఖ్దమహల్	-	-	2	262
అత్తాపూర్-సర్వే.నెం.36	-	-	1	200
మాదాపూర్	-	-	6	4,372
వనస్థలిపురం	8	621	2	1,962
నల్లగండ్ల	7	2,252	10	15,733
అసిఫ్‌నగర్	1	100	1	320
తెల్లాపూర్	-	-	3	6,697
నెక్నామ్‌పూర్	-	-	3	4,482
సరూర్‌నగర్	1	284	5	2,184
గోపన్‌పల్లి	2	400	-	-
చిత్రా లేఅవుట్	1	199	3	7,055
హుడా హైట్స్, హకీంపేట్	-	-	4	21,553
హుడా ఎన్‌క్లేవ్	-	-	2	1,914
నందగిరి హిల్స్	-	-	1	561
డీసీసీ, రామచంద్రాపురం	-	-	4	4,376
మొత్తం	30	5,670	76	1,30,068

* ఈ ప్లాట్ల వేలం ధరలు ఇంకా నిర్ణయించలేదు. ఈ నెలాఖరు లోగా వివరాలను హెచ్ఎండీఏ కమిషనర్ వెల్లడిస్తారు.



ఉష్ణోగ్రతను తగ్గించే రంగులు

వేసవికాలం వచ్చిందంటే చాలు ఎండ ఎక్కువగా ఉంటుంది. ఒక దశలో ఇంట్లో ఉన్న ఏసీలు, కూలర్లు కూడా వెంటనే ఉపశమనం కలిగించలేవు. దీన్ని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ రంగుల రూపంలో సులువైన పరిష్కారం కనుగొంది. కొన్ని రకాల రసాయనాలను కలపడం వల్ల ఉష్ణోగ్రతను తగ్గించడమే వీటి ప్రత్యేకత. ఇంటికి ఈ తరహా రంగులు వేసుకుంటే దాదాపు 5 నుంచి 6 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తగ్గుతుందని ఐఐసీటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంచుమించు ఇలాంటి రంగులే హైదరాబాద్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ఉష్ణోగ్రతను నియంత్రంచలేవు. దాంతో పాటు మార్కెట్‌లో ఉన్న రంగులు ఉష్ణోగ్రతను పరావర్తనం చెందిస్తే.. ఐఐసీటీ రూపొందించిన రంగులు మాత్రం ఉష్ణోగ్రతను శోషించుకుంటాయి. ఈ ప్రత్యేక లక్షణాలు కలిగిన రంగులు మార్కెట్‌లోకి అతి త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు మన శాస్త్రవేత్తల ఆవిష్కరణ అద్భుతంగా ఉంది కదూ!

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ పరిధిలోని వెంచర్లు, అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులు.. ఎల్ ఆర్ఎస్, బీపీఎస్, లీగల్, జీఎస్‌టీ వంటి అంశాలకు సంబంధించి మీకు ఎలాంటి సందేహాలున్నా.. సమస్యలున్నా.. సమాచారం కావాలన్నా.. మాకు రాయండి. నిపుణులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు సమాధానాలిస్తారు.

నమస్తే సంపద, నమస్తే తెలంగాణ, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్,
రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34.
ఈమెయిల్: nt.sampada@gmail.com

నమస్తే తెలంగాణ

చిత్రం

[హైదరాబాద్]

శనివారం 27 జనవరి 2018

సీఎంగా భరత్ ప్రమాణస్వీకారం!

'భరత్ అనే నేను' అంటూ... కథానాయకుడు మహేష్‌తో సీఎంగా ప్రమాణస్వీకారం చేయించారు దర్శకుడు కొరటాల శివ. ఆయన దర్శకత్వంలో మహేష్ నటిస్తున్న తాజా చిత్రం 'భరత్ అనే నేను'. ఈ చిత్రంలో యువ రాజకీయనేతగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా మహేష్ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఆడియో క్లిప్‌తో ఈ చిత్ర ప్రచారాన్ని ప్రారంభించారు. ఫస్ట్ ఓథ్ పేరిట ఓ ఆడియో క్లిప్‌తో పాటు, చిత్రానికి సంబంధించిన తొలి ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు దర్శక నిర్మాతలు. రాజకీయ నేపథ్యంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో మహేష్ పాత్ర నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపించనున్నాడని అంటున్నాయి సినీవర్గాలు. 'శ్రీమంతుడు' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత మహేష్-కొరటాల శివ కలయికలో రానున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో అంచనాలు ఎక్కువగా వున్నాయి. దర్శకుడు చిత్ర విశేషాల గురించి మాట్లాడుతూ ' విజువల్ కంటెంట్ వున్న వీడియో కంటే ఈ చిత్రానికి వాయిస్ కంటెంట్ విడుదల చేస్తే ఆసక్తి వుంటుందని భావించి వాయిస్ ఓథ్‌ను రిలీజ్ చేశాం. దీనికి మంచి స్పందన వస్తోంది. ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందు జరిగే ఫిక్షనల్ పొలిటికల్ డ్రామా ఇది' అని తెలిపారు. నిర్మాత దానయ్య మాట్లాడుతూ ' ప్రస్తుతం రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో పతాక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఆసక్తికరమైన కలయికలో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా వుంది' అన్నారు. కైరా అద్వాని, ప్రకాష్ రాజ్, శరత్‌కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సమర్పణ: డి.పార్వతి, నిర్మాత: దానయ్య డీవీవీ.




'భరత్ అనే నేను' చిత్రంలో మహేష్‌బాబు



నాగశౌర్య, చిరంజీవి

అప్పుడే కొత్త కథలు పుడతాయి!

'ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో జరిగే ప్రేమకథతో చాలా అందంగా సినిమాను తెరకెక్కించారు. తెలుగు అబ్బాయి, తమిళ అమ్మాయి కథతో యాక్షన్, నాటకీయత, భాషల మధ్య ఉన్న అంతరాల్ని ఆవిష్కరిస్తూ తెరకెక్కించిన ఈ చిత్రం నాగశౌర్య కెరీర్ మంచి సినిమాగా నిలవాలి' అని అన్నారు చిరంజీవి. నాగశౌర్య, రష్మిక మందన జంటగా నటిస్తున్న చిత్రం 'ఛలో'. ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నటుడు చిరంజీవి చిత్ర గీతాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నిహారికతో కలిసి నాగశౌర్య నటించిన 'ఒక మనసు' సినిమా చూశాను. అందులో నాగశౌర్య అందంగా కనిపించాడు. నవతరం కథానాయకులు ముందుకు వచ్చినపుడే ఇండస్ట్రీలో కొత్త కథలు పుడతాయి. నా కెరీర్ తొలినాళ్లలో నేను నటించిన ఓ సినిమా వేడుకకు అగ్రకథానాయకుడిని ఆహ్వానించడానికి వెళ్లాను. కానీ బిజీగా ఉండటంతో రాలేకపోతున్నానని ఆ హీరో చెప్పగానే నిరాశలో మునిగిపోయాను. అగ్రకథానాయకులు ఇలాంటి వేడుకలకు వస్తే చిన్న హీరోలకు ఉత్సాహం, ప్రోత్సాహం లభిస్తుంది. ఆ స్ఫూర్తిని నాగశౌర్యకు అందివ్వాలనే ఈ వేడుకకు వచ్చాను' అని అన్నారు. నాగశౌర్య మాట్లాడుతూ 'చిరంజీవి సినిమాల్లో ఉన్నప్పుడు ఒకటి నుంచి నాలుగు వరకు కుర్చీలు ఉండేవి. ఆయన రాజకీయాల్లోకి వెళ్లిపోగానే ఆ కుర్చీలు లేవు. అందరూ నిల్చోవడమే. మళ్లీ చిరంజీవి తిరిగి వచ్చారు. తన కుర్చీలో తానే కూర్చున్నారు. కుర్చీ కోసం ఆయన పుట్టలేదు. ఆయన కోసమే ఆ కుర్చీ పుట్టింది. చిరంజీవి పది సంవత్సరాలు సినిమాలకు దూరమవ్వడంతో ఆడియో వేడుకల కళ పోయింది. హోటల్లలో ఇరుకుగా ఈ వేడుకల్ని జరుపుకోవాల్సివచ్చింది. మళ్లీ ఆయన సినిమాల్లోకి రావడంతో వంద రోజులు, 175 రోజుల వేడుకల్ని చూస్తామనే నమ్మకముంది. మళ్లీ జన్మంటూ ఉంటే మెగాస్టార్ అభిమానిగానే పుట్టాలని ఉంది' అని నాగశౌర్య చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్, నితిన్‌రెడ్డి, నందినిరెడ్డి, వంశీపైడిపల్లి, నిర్మాత ఉషా ముల్పూరి, చిత్ర సమర్పకుడు శంకర్‌ప్రసాద్ ముల్పూరి, మహతి స్వరసాగర్, వల్లభనేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.



'నా పేరు సూర్య- నా ఇల్లు ఇండియా' చిత్రంలో అల్లు అర్జున్

ఇల్లే ఇండియా దిల్లే ఇండియా

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరుసూర్య- నా ఇల్లు ఇండియా'. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై కె. నాగబాబు సమర్పణలో లగడపాటి శిరీష, శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అను ఇమ్మాన్యుయెల్ కథానాయిక. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిత్రబృందం 'ఇల్లే ఇండియా దిల్లే ఇండియా' అనే గీతాన్ని విడుదలచేసింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఆగ్రహంతో ఊగిపోయే ఓ సైనికుడి కథ ఇది. తన స్వభావం కారణంగా అతడు ఎలాంటి సమస్యల్ని ఎదుర్కొన్నాడు? దేశం కోసం ఎలాంటి పోరాటాన్ని సాగించాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పోరాట ఘట్టాల్ని చిత్రీకరిస్తున్నాం. సైనికుల కష్టనష్టాలను, త్యాగాలను ఆవిష్కరించే 'దిల్లే ఇండియా ఇల్లే ఇండియా' పాటకు మంచి స్పందన లభిస్తున్నది. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. మంచి సాహిత్యంతో కూడిన పాట వస్తే తెలుగు వారు ఎంతలా ఆదరిస్తారో ఈ గీతంతో అర్థమైందని, పాటకు వచ్చిన స్పందన చూసి కన్నీళ్లొచ్చాయని గేయరచయిత రామజోగయ్య శాస్త్రి పేర్కొన్నారు. అర్జున్, శరత్‌కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్-శేఖర్, సినిమాటోగ్రఫీ: రాజీవ్‌రవి, సహనిర్మాత: బన్నీవాసు.

రకుల్ నాకు స్ఫూర్తి

'గ్లామర్ పాత్రలకే పరిమితమవ్వను. నిడివితో సంబంధం లేకుండా అభినయానికి ఆస్కారమున్న మంచి కథల్లో భాగమవ్వాలనే ఆలోచన ఉంది' అని తెలిపింది సీరత్‌కపూర్. ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'టచ్‌చేసిచూడు'. రవితేజ కథానాయకుడు. విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహిస్తున్నారు. నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. శుక్రవారం హైదరాబాద్‌లో సీరత్ కపూర్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ..

ఇప్పటివరకు నేను చేసిన పాత్రలతో పోలిస్తే విభిన్నమైన పాత్ర ఇది. హీరోపై ఆధిపత్యం చెలాయించే అమ్మాయిగా కనిపిస్తాను. మనసుకు నచ్చినట్లు నడుచుకుంటూ నా మాటే నెగ్గాలని ఆలోచిస్తుంటాను. అలాగని నా పాత్రలో ప్రతినాయిక ఛాయలుండవు. ఓ పోలీస్ అధికారి లక్ష్యసాధనలో నా పాత్ర ఏమిటనేది కీలకంగా ఉంటుంది. నా నిజజీవితానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర ఇది. రవితేజతో నా కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. సినిమాలో నాతో పాటు రాశీఖన్నా కథానాయికగా నటించినా ఇద్దరి పాత్రలకు సమ ప్రాధాన్యత ఉంటుంది. ద్వితీయార్థంలో నా పాత్ర కనిపిస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పోలీస్‌లలో స్ఫూర్తిని నింపేలా సినిమా ఉంటుంది.

ఆ కల నెరవేరింది

మాస్ పాటలంటే నాకు చాలా ఇష్టం. రవితేజతో కలిసి ఇందులోని ఓ మాస్ గీతంలో నటించాను. ఇలాంటి పాటలో నటించడం ఇదే తొలిసారి. ఈ సినిమాతో ఆ కల తీరింది. అలాగని ప్రత్యేక గీతాల్లో మాత్రం నటించను. ఇటీవల నటించిన 'ఒక్కక్షణం' నటిగా నాకు ఎనలేని సంతృప్తినిచ్చింది. ప్రస్తుతం నా దృష్టి అంతా సినిమాలపైనే వుంది. ప్రేమ, బాయ్‌ఫ్రెండ్స్ గురించి ఆలోచించే సమయం నాకు లేదు. మహిళా ప్రధాన చిత్రాలకు ఆదరణ పెరుగుతున్నది. అలాంటి కథాంశాల్లో నటించాలనుంది. నటన పరంగా రకుల్‌ప్రీత్‌సింగ్ నాకు స్ఫూర్తి. ప్రస్తుతం రానాతో ఓ సినిమా, శ్రీధర్‌సీపాన దర్శకత్వంలో మరో సినిమాలో చేస్తున్నాను.



సీరత్‌కపూర్



హిమాన్సీ

కార్తికేయ, హిమాన్సీ, శుభాంగి పంతే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఇట్లు ... అంజలి'. ఓమా ప్రొడక్షన్స్ పతాకంపై నవీన్ మన్నెల స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఇటీవల హైదరాబాద్‌లో సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు విడుదల చేశారు. నవీన్ మన్నెల మాట్లాడుతూ

ఓ అమ్మాయి ప్రేమలేఖ..

'ప్రేమ లేఖ నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ప్రతీ సన్నివేశం సహజత్వానికి దగ్గరగా వుండేలా తీర్చిదిద్దుతున్నాం. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకుడు సరికొత్త అనుభూతికి లోనవుతాడు. కథకు తగ్గ సాహిత్యం, సంగీతం కుదిరాయి. మంచి విజయాన్ని సాధిస్తుందనే నమ్మకముంది' అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ 'ఓ అమ్మాయి ప్రేమలేఖే ఈ సినిమా. కథ, కథనం కొత్తగా వుంటుంది. మాటలు, పాటలు హైలైట్‌గా నిలుస్తాయి. తెలుగు ప్రేక్షకులకు ఖచ్చితంగా నచ్చుతుంది' అన్నారు. హిమాన్సి మాట్లాడుతూ 'సరికొత్త కథ, కథనాలతో సాగే చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది. ఇంత మంచి చిత్రంలో నటించే అవకాశం రావడం ఆనందంగా వుంది' అని తెలిపారు. కథకు తగ్గట్లుగా ట్యూన్‌లు కుదిరాయని త్వరలోనే టీజర్‌ను విడుదల చేస్తామని సంగీత దర్శకుడు కార్తీక్ కొడకండ్ల తెలిపారు.

మేడారం జాతరలో సాంస్కృతికోత్సవాలు

గిరిజన జానపద కళలకు ప్రాధాన్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో సాంస్కృతికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 31, వచ్చేనెల 1, 2 తేదీల్లో మూడురోజులపాటు జరిగే జాతరలో 31 జిల్లాల జానపద, గిరిజన కళారూపాలను ప్రదర్శించనున్నారు. ఈ మేరకు వందలమంది కళాకారులు సిద్ధమవుతున్నారు. దీంతోపాటు రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాకారులు తెలంగాణ ఆటపాట నిర్వహించనున్నారు. ఇందుకోసం పర్యాటకశాఖ ప్రత్యేక వేదికను సిద్ధం చేసినట్టు ఆ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ, భాషా సాంస్కృతికశాఖల గుర్తింపు పొందిన కళాకారులు వేడుకల్లో పాల్గొంటారు. లంబాడ నృత్యాలను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా పది బృందాలకు శిక్షణ ఇచ్చారు. గుస్సాడీ, కోయ, మాధురి, కొమ్ము నృత్య ప్రదర్శనలు కూడా ఏర్పాటుచేస్తున్నారు. జాతరలో ప్రదర్శించే జానపద, గిరిజన నృత్యాలపై డాక్యుమెంటరీ చేస్తామని భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. భజనలు, కోలాటాలు, జడకొప్పులు, డప్పుల దరువులు, ఒగ్గుడోలు విన్యాసాలతోపాటు రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన బుడబుడుకలు, గంగిరెద్దులు, కాటికాపర్లు, సాధనాశూరులు వంటి జానపద కళారూపాలన్నింటినీ ఈ మూడురోజులపాటు ప్రదర్శించనున్నారు. 29 నుంచి వరంగల్ నగరంలోని నేరెళ్ల వేణుమాధవ్ కళామండపంలో సురభి కళాకారులు సమ్మక్క-సారలమ్మ పద్యనాటకాన్ని ప్రదర్శించనున్నారు.

పర్యాటక ప్రదేశాలకు ప్రచారం

రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని జాతరలో అందుబాటులో ఉంచుతున్నారు. ఈ మేరకు ప్రత్యేకంగా పర్యాటక స్టాల్ ఏర్పాటుచేశారు. ఇందులో రాష్ట్ర పర్యాటక ప్రదేశాల వివరాలు, ఆయా ప్రదేశాలకు చేరుకోవడానికి మార్గాలు, రవాణా సదుపాయాలు, హోటళ్లు తదితర వివరాలన్నింటితో బ్రోచర్లను సిద్ధం చేశారు. రహదారుల్లో ఏర్పాటుచేసిన సదుపాయాలు, హరితహోటళ్లు, బోటింగ్ సదుపాయం, చెరువుల వివరాలు, చేరుకునే మార్గాలను పొందుపరిచారు.



శుక్రవారం మేడారంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

భద్రతకు ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం

మొత్తం ప్రాంతం సెక్టార్లవారీగా విభజన ■ నిఘా కోసం 300 సీసీ కెమెరాలు, కంట్రోల్ రూంలు

అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాల వినియోగం ■ ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం జాతరకు పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల భద్రత కోసం 300 సీసీ కెమెరాలతోపాటు గగనతలం నుంచి నిఘా పెట్టేందుకు ఆరు డ్రోన్ కెమెరాలను వాడుతున్నారు. భక్తులకు మార్గాన్ని సూచించేందుకు రూట్‌మ్యాప్ యాప్‌ను రూపొందించారు. జాతర బందోబస్తులో భాగంగా డీజీపీ మహేందర్‌రెడ్డి గురువారం మేడారంను సందర్శించారు. ఐజీ నాగిరెడ్డితోపాటు జిల్లా పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైన పలు సూచనలు చేశారు. అనంతరం జాతర భద్రతపై హైదరాబాద్‌లో సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాల సందర్భంగా వినియోగిస్తున్న సాంకేతికతను మేడారం జాతర బందోబస్తులో ఉపయోగించాలని నిర్ణయించారు. ఐజీ నాగిరెడ్డి ప్రత్యేకంగా నెల నుంచి జాతర బందోబస్తుపై దృష్టి కేంద్రీకరించారు. తుదిదశకు వచ్చిన ఏర్పాట్లను శుక్రవారం అధికారులు పరిశీలించారు. అమ్మవార్ల గద్దెలకు చుట్టూ పది కిలోమీటర్ల విస్తీర్ణంలో 300 సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని అనుసంధానం చేస్తూ కంట్రోల్ రూమ్‌లను నెలకొల్పుతున్నారు. భక్తుల సమాచారం కోసం సూచన బోర్డులు, మైకుల ద్వారా అనౌన్స్‌మెంట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

15వేల మందితో బందోబస్తు

జాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా. ఈ నేపథ్యంలో దాదాపు 15 వేల మంది సిబ్బంది సేవలను వినియోగిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాతర ఏరియాను సెక్టార్ల వారీగా విభజిస్తున్నారు. ఒక్కో సెక్టార్‌లో సీసీ కెమెరాలు, సీసీటీవీ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో సెక్టార్ బాధ్యతలను ఎస్పీ స్థాయి అధికారికి అప్పగించి వందమంది బృందాన్ని కేటాయిస్తున్నారు. పోలీసు కమ్యూనికేషన్ సిస్టంలో ఇబ్బందులు రాకుండా ఇంట్రానెట్‌ను వినియోగిస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల కోసం

జనహిత

- ■ ప్రతిరోజూ ఆన్‌లైన్లో ఫిర్యాదులు చేసే అవకాశం
- ■ త్వరలో అందుబాటులోకి తేనున్న ప్రభుత్వం
- ■ బాగాపనిచేస్తే రివార్డులు.. జాప్యంచేస్తే మైనస్ మార్కులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వం ప్రజల చెంతకు పాలనను తీసుకెళ్లేందుకు మరో విప్లవాత్మక సౌలభ్యాన్ని ప్రవేశపెట్టనుంది. సమస్యల పరిష్కారానికి క్యూలో నిల్చొని దరఖాస్తు చేసుకొనే అవసరం లేకుండా..ఫొటో లేదా ఫోన్‌కాల్‌తో ఇబ్బందిని తెలియజెప్పే విప్లవాత్మక ప్రక్రియను ప్రవేశపెడుతున్నది. దాని పేరే జనహిత. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మార్గదర్శకత్వంలో జనహిత పథకం సిద్ధమవుతున్నది. ప్రస్తుతం ప్రజలు తమకున్న సమస్యలను పరిష్కరించుకొనేందుకు ప్రతి సోమవారం కలెక్టరేట్లకు వెళ్తున్నారు. ఇందులో 'క్యూ'లైన్లలో నిల్చొని దరఖాస్తు చేయడం, సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుండటాన్ని గుర్తించింది.ఉన్నతాధికారులు బిజీగా ఉండటం వల్ల ఆయా ఫిర్యాదులను ఫాలోఅప్ చేయలేకపోవడం వంటి కారణాల వల్ల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నది. ఒక్కరోజే దరఖాస్తులు స్వీకరించడం వల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జనహిత పేరుతో ఆన్‌లైన్లో ఫిర్యాదుల వేదికను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నది.

ఫిర్యాదు దారులకు 'గన్'

గత ఏడాది సూర్యాపేట, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయనున్నారు. ప్రతిరోజూ దరఖాస్తులు స్వీకరించి, సమగ్రంగా పరిశీలించి, పరిష్కారం చూపేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఎస్సెమ్మెస్, ఈమెయిల్, వాట్సాప్ వంటి రూపాల్లోనే కాకుండా.. ఫోన్ చేసి కూడా ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదిదారులకు గ్రీవెన్స్ యూనిక్ నంబర్ (గన్) పేరుతో ప్రత్యేక నంబరును కేటాయిస్తారు. ఈ విశిష్ట సంఖ్య ఆధారంగా సదరు ఫిర్యాదును ఉన్నతాధికారులు మానిటర్ చేస్తుంటారు. సమస్య పరిష్కారమయ్యేవరకు చర్యలు తీసుకొంటారు. వేగంగా సమస్యలు పరిష్కరించిన అధికారులకు ప్రత్యేక రివార్డులిస్తారు. సమస్య పరిష్కారంలో జాప్యానికి కారణమైనవారికి నెగటివ్ మార్కులు వేస్తారు. కేవలం ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే కాకుండా.. వివిధ రకాల సంక్షేమ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ఈ సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. తద్వారా అర్హులకు మరింత సమాచారం చేరవేస్తుంటారు.

త్వరలో ప్రారంభిస్తాం: టీఎస్‌టీఎస్ కమిషనర్

ఈ కీలక పథకానికి సమన్వయం చేస్తున్న టీఎస్‌టీఎస్ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ 'పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో కొత్త స్కీంను పైలట్ ప్రాజెక్టుగా కొనసాగిస్తున్నాం. ప్రజలు మరింత సులభంగా ఫిర్యాదులు చేయడం, త్వరితగతిన పరిష్కారం పొందడంతోపాటు అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం ప్రధాన ఉద్దేశం. ప్రజల సమయాన్ని, ధనాన్ని వృథాకాకుండా చూడటం.. పారదర్శకంగా, వేగంగా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా జనహిత రూపుదిద్దుకుంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా అమలుచేసిన మూడుజిల్లాల్లో ప్రజలు తాము ఫిర్యాదుచేసిన రెండు నుంచి మూడువారాల్లో సమస్య పరిష్కారమైనట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ముఖ్యమంత్రి ఆమోదం పొందిన తర్వాత త్వరలోనే ప్రారంభిస్తాం' అని వివరించారు.

పర్యాటక ప్రదేశాలపై కళాత్మక ప్రచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలపై కళాత్మకంగా ప్రచారం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ ఆర్ట్ గ్యాలరీలో 390 మంది ఆర్టిస్టులు రూపొందించిన చిత్రలేఖన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కొక్క చిత్రలేఖన కళాఖండాన్ని ఏర్పాటు చేస్తామని, సంబంధిత ప్రదేశం ఔన్నత్యం ప్రస్ఫుటమయ్యే విధంగా కళాఖండం ఉంటుందని వివరించారు. అత్యుత్తమ చిత్రాలకు రూ.లక్ష బహుమతి ఇస్తామని ప్రకటించారు.

పరిశోధనలతోనే ప్రగతి

- ■ ఆర్‌అండ్‌డీకి ప్రాధాన్యం పెరుగాలి
- ■ హైదరాబాద్‌లో 50 సంస్థలతో 'రిచ్'
- ■ టీవర్క్స్, రిచ్‌లతో భాగస్వాములుకండి
- ■ మంత్రి కే తారకరామారావు పిలుపు
- ■ దావోస్‌లో కేటీఆర్‌కు అపూర్వ గౌరవం
- ■ దేశాధినేతలు పాల్గొన్న సదస్సులో ఏకైక రాష్ట్రమంత్రి
- ■ 'డిజిటల్ టు డెలివర్ వాల్యూ టు సొసైటీ' అంశంపై ప్రసంగం
- ■ రాష్ట్రంలో సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు సుజ్లాన్ ఆసక్తి



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఆర్ అండ్ డీ, ఎకో సిస్టమ్‌పై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్



లివరేజింగ్ డిజిటల్ టు డెలివర్‌వాల్యూ టు సొసైటీ అంశంపై సమావేశానికి హాజరైన వివిధ దేశాల ప్రతినిధులతో ఐటీశాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పరిశోధనలతోనే ప్రగతి సాధ్యమని, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారమార్గాలు లభిస్తాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. పరిశోధన రంగానికి ప్రాధాన్యం పెరుగాల్సిన అవసరం ఉన్నదని, దీనికోసం పరిశోధనా సంస్థలు, ఉన్నత విద్యాసంస్థలు మరింత చొరవతీసుకోవాలని ఆయన 'దావోస్ ఇన్వెస్ట్ ఇండియా' ఆధ్వర్యంలో నిర్వహించిన 'డెవలపింగ్ ఆర్ అండ్ డీ ఇన్ ఇండియా' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పిలుపునిచ్చారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంలో ఆసక్తి గల కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం తరపున ఆహ్వానం పలికారు. 'లివరేజింగ్ డిజిటల్ టు డెలివర్‌వాల్యూ టు సొసైటీ' అనే అంశంపై జరిగిన సెషన్‌లోనూ మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఈ సెషన్‌కు వివిధ దేశాల ఉపప్రధానులు, ఆయా దేశాల కేంద్ర మంత్రులు తమ దేశాలకు ప్రాతినిధ్యం వహించగా, కేటీఆర్ ఒక్కరే రాష్ట్ర మంత్రిగా పాల్గొనే అపూర్వ గౌరవాన్ని పొందారు. ప్రైవేట్‌రంగంలో పెద్ద సంస్థలు చేస్తున్న పరిశోధనలతో దేశంలోని అకడమిక్ రిసెర్చ్‌ని సమ్మిళితం చేసినప్పుడు మెరుగైన ఫలితాలు వస్తాయని 'డెవలపింగ్ ఆర్‌అండ్‌డీ ఇన్ ఇండియా' అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పేర్కొన్నారు. పరిశోధన కార్యక్రమాలతోపాటు పరిశోధనానంతర ఫలితాల ఆధారంగా ప్రభుత్వ ప్రోత్సాహకాలుండేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సిలికాన్‌వ్యాలీలో గొప్ప విజయాలకు కారణం అక్కడి పరిశోధన సంస్థలేనని చెప్పారు. హైదరాబాద్‌లో 50 పరిశోధన సంస్థలను అనుసంధానం చేస్తూ.. 'రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్' (రిచ్) ఏర్పాటుచేశామని మంత్రి కేటీఆర్ వివరించారు. రిసెర్చ్ ఫలితాలు మార్కెట్లోకి రావడానికి రిచ్ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. ఇస్రోలాంటి భారతీయ సంస్థలు తమ పరిశోధన పటిమను, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటాయని, అతి తక్కువ ఖర్చుతో ఫలితాలు సాధించవచ్చని ఇస్రో విజయాలు నిరూపిస్తున్నాయని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద కంపెనీల నుంచి కాకుండా స్టార్టప్‌ల నుంచే వస్తాయని, అందుకే తెలంగాణ ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. తాము త్వరలోనే పరిశోధన చేయనున్న టీవర్క్స్, రిచ్‌లతో భాగస్వాములయ్యేందుకు ముందుకు రావాలని కోరారు. టీవర్క్స్ ద్వారా హార్డ్‌వేర్ రంగంలోనూ పరిశోధనలకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధనల పట్ల ఆసక్తి పెంచేలా ప్రదర్శనశాలలు ఏర్పాటుచేయాలని సూచించారు. పరిశోధన ఫలితాలు, పేటెంట్లు, మేధోసంపత్తిని కాపాడేందుకు తెలంగాణ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ క్రైమ్ యూనిట్ (టీఐపీసీయూ)ను ఏర్పాటుచేశామని చెప్పారు. టీఐపీసీయూ మాదిరిగానే ప్రతి రాష్ట్రం ఈ నమూనాను ఏర్పాటుచేయాలని రాష్ట్రాలకు ఉత్తరాలు రాశామని వెల్లడించారు. తెలంగాణ ఇలాంటి విప్లవాత్మక ఆలోచనలతో అనేకరంగాల్లో ఆదర్శంగా ఉన్నదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) కార్యదర్శి రమేశ్‌అభిషేక్ అభినందనలు తెలిపారు. ఈ సమావేశం అనంతరం మంత్రి కేటీఆర్ కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభుతో సమావేశమయ్యారు.

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు సుజ్లాన్ ఆసక్తి

ప్రముఖ పవన విద్యుత్ సంస్థ సుజ్లాన్ చైర్మన్ తులసి తంతితో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. సోలార్ విద్యుత్ ఉత్పాదనలో తెలంగాణ ముందువరుసలో ఉన్నదని మంత్రి వివరించారు. పవన విద్యుత్‌రంగంలో మరిన్ని పరిశోధనలు జరుగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. సోలార్‌రంగంలో విద్యుత్ స్టోరేజీ సౌకర్యం మరింతగా అందుబాటులోకొస్తే ఈ రంగం మరింత ముందుకు పోతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పవన విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటుచేసేందుకు సుజ్లాన్ ఆసక్తిగా ఉన్నట్టు తులసి తంతి తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టిన చర్యలతో రానున్న సంవత్సరాల్లో కచ్చితంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు విద్యుత్ ఉత్పాదన పెరుగాల్సిన అవసరం ఉన్నదని మంత్రికి తెలిపారు.

సేల్స్‌ఫోర్స్ సీఈవోతో లంచ్

సేల్స్‌ఫోర్స్ సీఈవో మార్క్‌బెనియఫ్ మంత్రి కేటీఆర్‌కు దావోస్‌లో ప్రత్యేక లంచ్ ఏర్పాటుచేశారు. అనంతరం తెలంగాణ లాంజ్‌లో సేల్స్‌ఫోర్స్ సంస్థ ప్రెసిడెంట్ అమీవీవర్‌తో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయన సానుకూలత వ్యక్తంచేసినట్టు సమాచారం. ఎరిక్‌సన్ గ్రూప్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఎరిక్‌ఎక్యుడెన్‌తో కూడా మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. ఎలక్ట్రానిక్స్ తయారీరంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. టీహబ్‌తో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి కేటీఆర్ కోరారు.

కేటీఆర్‌కు అపూర్వ గౌరవం

దావోస్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో మంత్రి కేటీఆర్‌కు అపూర్వమైన గౌరవం దక్కింది. శుక్రవారం పలుదేశాల ఉప ప్రధానులు, ఆయా దేశాల మంత్రులు పాల్గొన్న 'లివరేజింగ్ డిజిటల్ టు డెలివర్‌వాల్యూ టు సొసైటీ' అనే సెషన్‌లో.. మంత్రి కేటీఆర్ ఒక్కరికే రాష్ట్రమంత్రిగా పాల్గొనే అవకాశం దక్కింది. బెల్జియం, బ్రెజిల్, డెన్మార్క్, పోర్చుగల్, మయన్మార్, ఇండోనేషియా, నైజీరియా, లెబనాన్, బంగ్లాదేశ్, ఖతర్, పాకిస్తాన్ మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సెషన్‌లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ తెలంగాణ, మిషన్ భగీరథతోపాటు ఇంటింటికీ ఆప్టికల్ ఫైబర్ ద్వారా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రభుత్వ సేవలన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా అందజేస్తున్నామని చెప్పారు.



మంచుకొండల్లో మంత్రి కేటీఆర్ సెల్ఫీ

దావోస్‌లో గణతంత్ర దినోత్సవం

ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటున్న భారతీయ ప్రతినిధులు దావోస్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇన్వెస్ట్ ఇండియా లాంజ్ దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో జాతీయపతాకాన్ని కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, ఏపీ ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ తదితరులు పాల్గొన్నారు. విభిన్నమైన ఆలోచనలు, పలు రాష్ట్రాలకు చెందిన నేతలైనా భారతీయులందరం కలిసి గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. భారతీయుడిగా గర్వపడుతున్నానని తెలిపారు.



దావోస్‌లో ఇన్వెస్ట్ ఇండియా లాంజ్ దగ్గర నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు పీయూష్‌గోయల్, ధర్మేంద్రప్రధాన్, తెలంగాణ, ఏపీ ఐటీశాఖల మంత్రులు కేటీఆర్, లోకేశ్, ఎంపీ గల్లా జయదేవ్

భావి తరాలకు గిరిజన సంస్కృతి



మేడారంలో ఏర్పాటుచేసిన మ్యూజియం



ఆదిలాబాద్ జిల్లా జోడెఘాట్ వద్ద కుమ్రం భీం మ్యూజియం

- ■ గిరిజన సంస్కృతి పరిరక్షణకు సర్కారు చర్యలు
- ■ పండుగలు, జాతరల కోసం ప్రత్యేకంగా నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. గిరిజన సంప్రదాయ పండుగలు, జాతరల నిర్వహణకు విరివిగా నిధులు మంజూరు చేస్తున్నది. అంతేకాకుండా గిరిజనుల సంస్కృతిని కాపాడి భవిష్యత్‌తరాలకు అందించేలా రాష్ట్రవ్యాప్తంగా గిరిజన మ్యూజియాలను ఏర్పాటు చేస్తున్నది. దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాల్లో తెలంగాణలోనే గిరిజనులు ఎక్కువగా ఉన్నా రు. రాష్ట్రంలో గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతా ల్లో తెలంగాణ ప్రభుత్వం మ్యూజియాలను ఏర్పాటుచేస్తున్నది. ఇందుకోసం రూ.28.89 కోట్లు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలోనే హైదరాబాద్ సంక్షేమభవన్‌లో గిరిజన మ్యూజియం ఏర్పాటైంది. కాగా ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అయిదుచోట్ల మ్యూజియాలను ఏర్పాటు చేస్తున్నారు. రూ.25 కోట్లతో ఆదిలాబాద్ జిల్లా జోడెఘాట్ వద్ద కుమ్రం భీం పేరిట మ్యూజియం ఏర్పాటు చేశారు. మ్యూజియంతోపాటు చుట్టుపక్కల రోడ్లు, భవనం, ఇతర నిర్మాణాలకు నిధులను వినియోగించారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మ పేరిట రూ.3.30 కోట్లతో కోయ మ్యూజియం నిర్మించారు. సమ్మక్క, సారలమ్మ కాలంనాటి పరిస్థితులు, సంస్కృతి, సామాజిక, ఆర్థికస్థితి తదితర అంశాలు ప్రతిబింబించేలా 15 కోయ గ్రామాల్లో సేకరించిన కళాకృతులను ఇందులో ఏర్పాటు చేశారు. మేడారం జాతరను పురస్కరించుకొని ఈ మ్యూజియంను ఇటీవలే ప్రారంభించారు. భద్రాచలంలో శబరి పేరిట ఏర్పాటు చేయనున్న మ్యూజియానికి రూ.24 లక్షలు, నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లో చెంచులక్ష్మి మ్యూజియానికి రూ.35 లక్షలు కేటాయించారు. నిర్మల్‌లో రాంజీగోండ్ మ్యూజియం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గిరిజన జాతరలకు భారీగా నిధులు

గిరిజన జాతరలు, పండుగల నిర్వహణకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. కోయ సంప్రదాయం ఉట్టిపడేలా రెండేండ్లకోసారి నిర్వహించే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నది. గిరిజన ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి నిర్వహణకు ఏటా రూ.కోటి నిధులు వెచ్చిస్తున్నది. గోండులు వైభవంగా జరుపుకొనే కేస్లాపూర్ నాగోబా, జంగుబాయి జాతరలు, మంచిర్యాల వద్ద నిర్వహించే నాయక్‌పోడ్ తెగకు చెందిన గాంధారి జాతర, చెంచులు నిర్వహించే బౌరాంపూర్ భ్రమరాంబ జాతర, సలేశ్వరం లొద్దిమల్లయ్య జాతరలకు రూ.10 లక్షల చొప్పున, ఆంధ్ జాతికి చెందిన దిపూబాజీ బాబా జయంతి ఉత్సవాలకు రూ.10లక్షలు ఖర్చు చేస్తున్నది.

గిరిజన సంప్రదాయ వృత్తులకు ప్రాధాన్యం

గిరిజన తెగల వృత్తి నైపుణ్యాలను గుర్తించి ప్రభుత్వం వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు ఆర్థిక సహకారం అందిస్తున్నది. గిరిజన తండాలు, గూడేల్లో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ట్రైకార్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలు, గిరిజన ఆవాసాలకు చెందిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్థిక సహకార పథకం కింద రుణ సహాయం అందిస్తున్నారు. ఇందుకోసం 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.225.92 కోట్లు మంజూరు చేసింది.

రెవెన్యూ సంస్కరణలపై హర్షం

భూ రికార్డుల ప్రక్షాళన సక్సెస్.. గ్రామాల్లో రెవెన్యూ కోర్టులు నిర్వహించాలంటున్న నిపుణులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజాభాగస్వామ్యంతో భూ రికార్డుల ప్రక్షాళన విజయవంతమైంది. 71.75 లక్షల మంది రైతులకు చెందిన 93 శాతం భూముల రికార్డులు పక్కాగా ఉన్నాయని ప్రభుత్వం తేల్చింది. భూ రికార్డులన్నీ పక్కాగా మారినందుకు రైతులు ఆనందంగా ఉన్నారు. రెవెన్యూ పాలనకు సంబంధించిన విప్లవాత్మక సంస్కరణల్లో ఇదొకటని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. భూమిపై పన్నులు వసూలు చేసే దశ నుంచి రికార్డులను పక్కాగా రూపొందించి, రైతులకే పెట్టుబడి డబ్బులు ఇచ్చే దిశగా ప్రభుత్వ గమనాన్ని సీఎం కేసీఆర్ మార్చారు. ప్రజలు అధికారుల చుట్టూ తిరుగకుండా లిటిగేషన్ల సంఖ్యను తగ్గించేందుకు జిల్లాకు ఒక రెవెన్యూ కోర్టును అమలులోకి తీసుకువస్తున్న నేపథ్యంలో 50 శాతం రెవెన్యూ కేసులను ప్రజల సమక్షంలో విచారించేలా గ్రామాల్లో కోర్టులు నిర్వహిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

భూ యజమానికి ప్రాధాన్యం

25 రకాల భద్రతా ఫీచర్లతో రూపొందిస్తున్న పట్టాదార్ పాస్‌పుస్తకాల్లో ఎలాంటి గందరగోళాలు లేకుండా ఉండే విధంగా కాలమ్స్‌ను తగ్గించారు. రిజిస్ట్రేషన్ చేసే అధికారం కూడా తహసీల్దార్లకే ఉంటే ప్రభుత్వ, ఇతర భూములను అడ్డగోలుగా రిజిస్టర్ చేసే అవకాశం ఉండదు. ఇటీవలికాలంలో వ్యవసాయం చేసే మహిళా రైతుల సంఖ్య బాగా పెరిగింది. వారికి వచ్చే భూమి సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక సెల్‌ను మండల కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం అవసరమన్న భావన వ్యక్తం అవుతున్నది.

భూ సర్వే చేస్తే మంచిది

ప్రక్షాళన చేసిన రికార్డుల ఆధారంగా ప్రజల వద్ద ఉన్న భూమి హద్దులను ప్రమాణికంగా తీసుకొని సర్వే చేస్తే భూమి కొలతల్లో ఉన్న ఎక్కువ తక్కువలు సరి చేసే అవకాశం ఉంటుంది. డ్రోన్ల ద్వారా దీనిని తక్కువ ఖర్చుతో విజయవంతం చేయవచ్చు. చిన్న చిన్న కమతాల లెక్కలను కూడా కచ్చితంగా తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

-ఎం సునీల్‌కుమార్, నల్సార్ వర్సిటీ అధ్యాపకులు

పాల కల్తీపై లేఖకు హైకోర్టు స్పందన

ప్రజాప్రయోజనవ్యాజ్యంగా స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాల కల్తీపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా వచ్చిన లేఖను ఉమ్మడి హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించింది. పాలలో హానికరమైన రసాయనాలు కలుపుతున్నారని, కల్తీ పెరిగిపోతున్నదంటూ ఇటీవల పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా నల్లగొండ జిల్లా అలివేలు మంగాపురం కాలనీకి చెందిన కే నర్సింహారావు హైకోర్టుకు లేఖ రాశారు. కల్తీ పాల విక్రయాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని, రసాయనాలు కలిపిన పాలను విక్రయిస్తున్నవారిపై కఠినచర్యలు చేపట్టాలంటూ లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను ప్రజాప్రయోజనవ్యాజ్యంగా స్వీకరించిన ఉమ్మడి హైకోర్టు ఈ నెల 30న విచారణ చేపట్టాలని నిర్ణయించింది.

సమైక్య రాష్ట్రంలో కరువైన భూముల భద్రత

- ■ భూమికి భరోసా లేదని చెప్పిన ప్రజలు
- ■ భూ హక్కుల అవగాహన సర్వేలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమైక్య రాష్ట్రంలో తెలంగాణ భూములకు, భూ యజమానులకు భద్రత కరువైంది. సీమాంధ్ర పాలనలో భూ మాఫియా తెలంగాణలో భూములను ఆక్రమించి అక్రమాలు సాగించింది. ఈ అరాచకాల నేపథ్యంలోనే ప్రాపర్టీ రైట్ ఇండెక్స్ (పీఆర్ ఇండెక్స్) నిర్వహించిన పర్సప్షన్ సర్వేలో తెలంగాణలో భూమికి భద్రత లేదన్న విషయాన్ని ప్రజలు వెల్లడించారు. గత మూడేండ్లుగా ఈ సంస్థ వివిధ సంస్థలతో కలిసి ఈ సర్వే నిర్వహిస్తున్నది. సర్వేలో భాగంగా దేశంలోని 24 రాష్ట్రాల్లో 16,475 మంది రైతులతో ఈ సంస్థ మాట్లాడింది. గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లలో నిర్వహించిన సర్వే నివేదికను ఈ సంస్థ ఇటీవల విడుదల చేసింది. భూమికి, భూమి హక్కులకు భద్రత ఉందా? భూమి హక్కులకు భంగం కలిగితే ఎలా కాపాడుకోవాలో తెలుసా? భూ పరిపాలన ఎలా ఉందని అనుకుంటున్నారు? అన్న విషయాలపై సర్వే నిర్వహించారు. భూమి హక్కులకు భంగం కలిగితే ఎక్కడికి వెళ్లి సాధించుకోవాలో 64 శాతం మంది తెలంగాణ ప్రజలకు తెలియని పరిస్థితి ఉన్నదని ఈ సంస్థ తేల్చింది. తమిళనాడు, కేరళ, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలు భూముల రక్షణ ర్యాంకింగ్‌లో వెనుకబడి ఉన్నాయని ఈ సంస్థ నివేదిక తెలిపింది. కాగా తెలంగాణలో ఈ పరిస్థితికి ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన భూ కబ్జాలే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. తెలంగాణ ప్రజలు అమాయకులు కాబట్టే సీమాంధ్ర భూ మాఫియా చెలరేగింది. సర్వేకు ముందుగానే రాష్ట్రంలో పరిస్థితిని గుర్తించిన సీఎం కేసీఆర్ భూమి హక్కులకు భద్రత కల్పించే విధంగా రికార్డుల ప్రక్షాళన చేపట్టారు. భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టే వరకు చాలా మంది రైతులకు డాక్యుమెంట్లు లేని పరిస్థితి ఉన్నది. ప్రక్షాళనలో భాగంగా అధికారులు ఇంటింటికి తిరిగి పట్టా సర్టిఫికెట్లను రైతులకు అందజేశారు.

2022 నాటికి భారీ లక్ష్యాలు

- 85 మిలియన్ టన్నుల బొగ్గు.. 2500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- సింగరేణి భవన్‌లో జాతీయపతాకాన్ని ఎగురవేసిన సీఎండీ శ్రీధర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సింగరేణి సంస్థ 2022 నాటికి 85 టన్నుల బొగ్గుతోపాటు 2500 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనే భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నదని సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సింగరేణి భవన్‌లో జాతీయపతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ 2010-14 కాలంలో 52 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా.. తెలంగాణ ఆవిర్భావం తరువాత 25 శాతం వృద్ధిసాధిస్తూ, ఈ ఏడాది 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించిందని తెలిపారు. మూడేండ్లలో రూ.23,500 కోట్ల అమ్మకాలు చేయగా, ఈ ఏడాది అవి రూ.1000 కోట్లు దాటే అవకాశం ఉందన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రం ఏడాదిలోనే 91శాతం రికార్డుస్థాయి పీఎల్‌ఎఫ్‌తో జాతీయస్థాయి అత్యుత్తమ పవర్ ప్లాంట్ల జాబితాలో 4వ స్థానాన్ని సాధించిందని చెప్పారు. సీఎం కేసీఆర్ సూచనలతో సింగరేణిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ఉత్తమ అధికారి దుండె వెంకటేశం (డిప్యూటీ మేనేజర్), ఉత్తమ ఉద్యోగులు ఆకెల్ల భాస్కర్, తెరవల్లి శేషగిరిరావు, ఎం రవీందర్, ఎ రాములు తదితరులను సీఎండీ సన్మానించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు బీ కిషన్‌రావు, నాగయ్య, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, ప్రేమ్‌కుమార్, తిరుమలరావు పాల్గొన్నారు.

శరవేగంగా మట్టపల్లి వంతెన నిర్మాణం



కృష్ణానదిపై సూర్యాపేట జిల్లా మట్టపల్లి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి

జూన్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు

వంతెనతో తెలంగాణ, ఏపీ మధ్య తగ్గనున్న దూరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానదిపై మట్టపల్లి వద్ద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 21 స్తంభాల నిర్మాణం పూర్తికావడంతో వాటిపై శ్లాబులు వేస్తున్నారు. వచ్చే జూన్‌లో దీనిని ప్రారంభించడానికి మిగతా పనులను వేగంగా చేపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామం నుంచి గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామాల మధ్య ఈ హైలెవల్ వంతెనను నిర్మిస్తున్న సంగతి విదితమే. రూ.50 కోట్ల అంచనావ్యయంతో ఈ వంతెనకు 2014 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేశారు. తెలంగాణ నుంచి కొత్తగా నిర్మిస్తున్న ఏపీ రాజధాని అమరావతికి రోడ్డు మార్గాన చేరుకోవడానికి దాదాపు 100 కిలోమీటర్లు ప్రయాణించాలి. మట్టపల్లి వంతెన పూర్తయితే ఆ దూరం 50 కిలోమీటర్ల వరకు తగ్గుతుంది. చెన్నైతో సహా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని ఖమ్మం, నల్లగొండ, ప్రకాశం, గుంటూరు, కృష్ణా తదితర జిల్లాల ప్రజలకు రవాణాపరంగా మేలు జరుగుతుందని ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. వ్యవసాయోత్పత్తులను పక్క రాష్ట్రాల్లో విక్రయించేందుకు ఈ వంతెన తోడ్పడుతుంది. వంతెన వల్ల నల్లగొండ, గుంటూరు జిల్లాల్లో ఉన్న పాలిష్‌రాయి పరిశ్రమలు, సిమెంట్, సున్నం, మిల్లులకు ప్రయోజనం ఉంటుంది. తంగెడ, పెదగార్లపాడు, గామాలపాడు ప్రాంతాల్లో త్వరలో మరికొన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు నెలకొల్పనున్నారు. మైహోమ్, చిట్టినాడ్, శ్రీసిమెంట్స్ ఫ్యాక్టరీల ఏర్పాటు ఇప్పటికే ఖరారయింది. రెండు రాష్ట్రాల నుంచి వచ్చే సిమెంట్ ఉత్పత్తులను దేశంలోని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఈ వంతెనతో రవాణా సౌకర్యం మెరుగపడుతుంది. రవాణావ్యయం గణనీయంగా తగ్గుతుంది. సిమెంట్ ధరలు తగ్గే అవకాశం ఉంటుంది. పరిశ్రమల వల్ల మరింత మంది కార్మికులకు జీవనోపాధి దొరుకుతుంది.

సర్వే పూర్తికావొచ్చినా దొరుకని నేరస్థులు

ముందస్తు సమాచారంతో పరారీలో రిపీటెడ్ నేరగాళ్లు

వారిపై నిఘా పెట్టాలని డీజీపీ ఆదేశాలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీసులు చేపట్టిన 'సకల నేరస్థుల సమగ్ర సర్వే' దాదాపు పూర్తి కావొచ్చింది. రిపీటెడ్‌గా నేరాలు చేస్తున్న కరుడుగట్టిన నేరగాళ్ల పూర్తి వివరాలు మాత్రం చిక్కలేదు. సర్వే సమాచారం తెలుసుకున్న చాలామంది నేరస్థులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పోలీసుల చేతిలో ఉన్న నేరస్థుల చిట్టాలో సగం మంది వివరాలు కూడా తెలలేదని సమాచారం. నేరస్థుల చిరునామాలకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్లలో సమాచారం లేకపోవడమే కారణమని సర్వే సిబ్బంది చెప్తున్నారు. ఈ నెల 18న మొదలైన సర్వేపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్న డీజీపీ.. ఒకటి రెండురోజుల్లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నది. సర్వేలో భాగంగా నేరస్థుల వివరాలను సేకరించి పోలీసులు వాటిని కంప్యూటరీకరిస్తున్నారు. దీంతోపాటు టీఎస్ కాప్ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ కూడా చేస్తున్నారు. ఇప్పటివరకు 60 శాతం మంది నేరస్థుల వివరాలు లభించగా.. వీరిలో సగం మంది మాత్రమే వారి వారి నివాసాల్లో ఉన్నట్టు తెలిసింది. చాలా మంది నేరస్థుల ఇండ్లు తాళం వేసి కనిపించడం, ఖాళీ చేసి వెళ్లారని ఇండ్లలోనివారు సమాధానం ఇవ్వడం వంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. సర్వే చేస్తున్నారని తెలియడంతో తప్పించుకుంటున్నారని తెలిసింది. ఇంత కాలం పోలీసుల చేతిలో నేరస్థుల చిరునామాలు ఉన్నా.. సరైన నిఘా లేకపోవడంతో వరుసగా నేరాలు చేస్తూ కన్నుగప్పి తిరుగుతున్నారు. దీనివల్లే రిపీటెడ్‌గా నేరాలు చేసే వారి సంఖ్య రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నదని సీనియర్ పోలీసు అధికారులు చెప్తున్నారు. సర్వే ద్వారా రాష్ట్రంలో ఉన్న మొత్తం నేరస్థుల పూర్తి వివరాలు అన్ని పోలీస్‌స్టేషన్లలో ఉంటాయని వెల్లడిస్తున్నారు. దీనిద్వారా పెట్రోలింగ్ చేసే పోలీసులు 24 గంటలు నేరగాళ్లపై నిఘా పెట్టే అవకాశం ఉండటంతోపాటు రిపీటెడ్ నేరాలకు చెక్ పెట్టేందుకు వీలుంటుందని పేర్కొంటున్నారు.

ఇంజినీరింగ్ విద్య నాణ్యతపై దృష్టి

ప్రైవేటు కళాశాలల్లో జేఎన్టీయూహెచ్ ఆకస్మిక తనిఖీలు

త్వరలోనే అఫిలియేషన్ కోసం పరిశీలన


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జేఎన్టీయూహెచ్ అధికారులు చర్యలు మొదలుపెట్టారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిబంధనలను కచ్చితంగా అమలుచేయడంపై దృష్టి సారించారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. భవిష్యత్‌లోనూ వీటిని కొనసాగించనున్నారు. మూడేండ్లుగా రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు జేఎన్టీయూహెచ్ నియంత్రణలో వస్తున్నాయి. ఇప్పటికే 11 కాలేజీలు మూసివేయడానికి దరఖాస్తులు చేసుకోగా, వివిధ కళాశాలలు 400 కోర్సులు తొలిగించేందుకు ముందుకొచ్చాయి.

త్వరలోనే అఫిలియేషన్ తనిఖీలు: 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించిన అఫిలియేషన్ తనిఖీలు త్వరలో ప్రారంభిస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తెలిపారు. అఫిలియేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు విధించామని, అనంతరం తనిఖీలను చేపడుతామని పేర్కొన్నారు. గత మూడేండ్ల నుంచి వరుసగా 25శాతం లోపు ప్రవేశాలు పొందిన కళాశాలలకు అఫిలియేషన్ నిలిపేస్తామని కాలేజీ యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అఫిలియేషన్ సమయంలో కళాశాలల ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

విభేదిస్తున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు

మూడేండ్ల నుంచి వరుసగా 25 శాతంలోపు ప్రవేశాలు పొందిన ఇంజినీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్ నిరాకరణ నిబంధనను తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరావు తెలిపారు. అఫిలియేషన్‌కు ఉత్తీర్ణతను ముడిపెట్టొద్దని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు సహకరిస్తామని, కఠిన నిబంధనలు పెట్టి ఇబ్బంది పెట్టొద్దని జేఎన్టీయూహెచ్ వీసీ వేణుగోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎన్ యాదయ్యకు ఆయన విజ్ఞప్తిచేశారు.

పోలీసుల పనితీరును మెరుగుపరుస్తున్న 'సురక్ష'



శుక్రవారం బుక్‌ఫెయిర్‌లో 'సారస్వత సరాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అడిషనల్ ఐజీ (అడ్మిన్) ఎం రమేశ్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకొనే అంశాలపై అవగాహన పెంపొందించుకొనేందుకు పోలీస్‌శాఖ వెలువరిస్తున్న మాసపత్రిక 'సురక్ష' ఉపయుక్తంగా ఉంటున్నదని డీజీపీ కార్యాలయ అడిషనల్ ఐజీ(అడ్మిన్) ఎం రమేశ్ పేర్కొన్నారు. డాక్టర్ కే అరుణావ్యాస్ 'సురక్ష' మాసపత్రికలో రాసిన వ్యాసాలతో రూపొందించిన 'సారస్వత సరాలు' పుస్తకాన్ని శుక్రవారం ఆయన బుక్‌ఫెయిర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సినిమా రచయిత చంద్రశేఖర్ ఆజాద్, రచయిత శివరాంప్రసాద్, సురక్ష మాసపత్రిక మేనేజర్ మహమ్మద్ అబ్దుల్లా పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏపీ సీఎం గైర్హాజరు

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని విజయవాడ మున్సిపల్ స్టేడియంలో తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ శుక్రవారం జాతీయజెండాను ఆవిష్కరించారు. వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు గైర్హాజరవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఒక సీఎం జాతీయ పండుగలో పాల్గొనకపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. దావోస్ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఉదయానికల్లా విజయవాడకు చేరుకుని గణతంత్ర వేడుకల్లో పాల్గొనాల్సి ఉంది. ప్రతికూల వాతావరణం కారణంగా విమానం ఆలస్యం కావడంతో అబుధాబీలోనే ఆగిపోయినట్టు తెలిసింది. మార్చి మొదటివారం నుంచి ఏపీలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నట్టు శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు.

సిరిసిల్ల జిల్లాలో విజయ భగీరథ

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ట్రయల్ రన్ సక్సెస్

- ఫిబ్రవరిలో రెండు మున్సిపాల్టీలు, 466 ఆవాసాలకు మంచినీరు
- ముందుచూపుతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిన మంత్రి కేటీఆర్

రాజన్న-సిరిసిల్ల జిల్లాలో గణతంత్ర దినోత్సవం రోజున నిర్వహించిన మిషన్ భగీరథ ట్రయల్‌రన్ విజయవంతమైంది. శుక్రవారం నిర్వహించిన ట్రయల్‌రన్ ఎక్కడా ఎటువంటి అవాంతరాలు లేకుండా విజయవంతమైనట్టు ఎస్ఈ శ్రీనివాసరావు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో శుద్ధజలాన్ని ముందుగా సిరిసిల్ల, వేములవాడ పురపాలకసంఘాలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీటితోపాటు సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని మొత్తం 466 ఆవాసాలకు ఇంటింటికీ వచ్చేనెల చివరినుంచి మంచినీరు సరఫరాచేయడానికి కావాల్సిన అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. మరోవారం, పదిరోజుల్లో మారుపాక, రామప్పగుట్టలపై ఉన్న గ్రౌండ్‌లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయడానికి అధికార యంత్రాగం చర్యలు చేపట్టింది. వేములవాడ నియోజకవర్గంలోని రుద్రవరం గ్రామం వద్ద ఇన్‌టేక్‌వెల్‌ను ఏర్పాటుచేశారు. ఈ వెల్ వద్ద 1,006 హెచ్‌పీల సామర్థ్యం గల మూడు మోటర్లను అమర్చి అక్కడి నుంచి నీటిని అగ్రహారం వద్ద ఏర్పాటుచేసిన 120 ఎంఎల్డీ వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్‌కు తరలిస్తున్నారు. ఇన్‌టేక్‌వెల్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ వరకు తొమ్మిది కిలోమీటర్ల పొడవు, 1.6 మీటర్ల డయాఎంఎస్ పైపులను అమర్చారు. ఈ పైపులైన్ ద్వారా నీటిని వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్‌కు తరలిస్తున్నారు.

మంత్రి కేటీఆర్ ముందుచూపు

నిజానికి రాజన్న-సిరిసిల్ల జిల్లా కరువు ప్రాంతం. సమైక్యరాష్ట్రంలో వివక్షకు గురైన ప్రాంతం. గుక్కెడు మంచినీటి కోసం అల్లాడింది. వర్షాలు లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటడం వల్ల మంచినీటికి ప్రతి వేసవిలోనూ నిత్యం సమరమే జరిగేది. గిరిజన తండాల ప్రజలు కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లను మోసుకొనిరావాల్సి వచ్చేది. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని ప్రజలు అనేక కష్టాలుపడ్డారు. వీటిని దూరంచేసేందుకు సిరిసిల్ల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖల మంత్రి కే తారకరామారావు జిల్లాలో మిషన్ భగీరథ పనులపై ఆదినుంచి ప్రత్యేక శ్రద్ధచూపుతూ వస్తున్నారు. అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించడం, పనుల పురోగతికి అవసరమైన చర్యలు తీసుకోవడం, వాటికి కావాల్సిన నిధులు, ఇతర వివరాల్లో ప్రత్యేక చొరవ చూపుతూ అధికారయంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. రూ.1,100 కోట్లతో చేపట్టిన పనుల్లో డెబ్బైశాతం నిధులు ఖర్చు కావడంతోపాటు మెజార్టీ పనులు పూర్తయ్యాయి. రాజన్న-సిరిసిల్ల జిల్లాలో కావాల్సినంత మంచినీటిని మిషన్‌భగీరథ ద్వారా ఇవ్వాలంటే అందుకు మధ్యమానేరులో నీళ్లుండాలి. ఈ విషయాన్ని ముందుగానే గ్రహించిన మంత్రి కేటీఆర్ కొద్దినెలల క్రితమే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరదకాల్వ ద్వారా మధ్యమానేరు ప్రాజెక్టుకు నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. సుమారు ఆరు టీఎంసీల నీరు ప్రస్తుతం ప్రాజెక్టులో అందుబాటులో ఉన్నది. వర్షాలు వచ్చినా రాకపోయినా.. లక్ష్యం మేరకు మధ్యమానేరు ద్వారా జిల్లాలోని అన్నిప్రాంతాలకు నీరు ఇవ్వడానికి ఆస్కారం ఏర్పడింది. ఒకవేళ మధ్యమానేరు ప్రాజెక్టును నింపి ఉండకపోతే ప్రస్తుతం భగీరథ పనులు పూర్తయినా ప్రయోజనం ఉండేదికాదు.



ఇన్‌టేక్‌వెల్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు చేరిన నీరు

తపంచాతో గాల్లోకి కాల్పులు

చర్లపల్లిలో కలకలం..

పోలీసుల అదుపులో నిందితుడు



నిందితుడిని పట్టుకొని ఘటన వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్. వృత్తంలో నిందితుడు గజరాజ్‌సింగ్

మల్లాపూర్/ చర్లపల్లి: హైదరాబాద్ చర్లపల్లిలోని ఈసీ నగర్ సంతలో శుక్రవారం సాయంత్రం తపంచాతో ఓ వ్యక్తి గాల్లోకి కాల్పులు జరిపాడు. భయంతో స్థానికులు, వ్యాపారులు పరుగులు పెట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాలను రాచకొండ కమిషనర్ సీపీ మహేశ్ భగవత్ వెల్లడించారు. మల్లాపూర్ పరిధిలోని నెహ్రూనగర్‌కు చెందిన దండు తులసిబాబు(26), మర్రిగూడలో ఉండే ఉత్తరప్రదేశ్‌కు చెందిన గజరాజ్‌సింగ్(52) ఈసీనగర్‌లో సంతలో పక్క పక్కనే కురగాయలు అమ్ముకుంటుంటారు. శుక్రవారం తులసిబాబుకు గజరాజ్‌సింగ్ కుమారుడు ధర్మేంద్రకు వ్యాపారం విషయంలో ఘర్షణ జరిగింది. ఆగ్రహానికి గురైన ధర్మేంద్ర తండ్రి గజరాజ్‌సింగ్ తపంచా తీసుకొచ్చి తులసిబాబుపై దాడికి యత్నించాడు. ఇంతలో అక్కడికి చేరుకున్న పోలీసులు గజరాజ్‌సింగ్ తపంచాను స్వాధీనం చేసుకునేందుకు యత్నించగా వారిపైనే గురిపెట్టాడు. పట్టుకునేందుకు ప్రయత్నించగా గాలిల్లోకి కాల్పులు జరిపాడు. అప్రమత్తమైన పోలీసులు తపంచాను స్వాధీనం చేసుకొని నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ చక్రపాణిరెడ్డికి రూ.పదివేలు, డ్రైవర్ వేణుగోపాల్‌కు రూ.5 వేల రివార్డును కమిషనర్ మహేశ్ భగవత్ ప్రకటించారు. సమావేశంలో అడిషనల్ సీపీ తరుణ్‌జోషి, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వర్‌శర్మ, ఏసీపీ కృష్ణమూర్తి, సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు చంద్రశేఖర్, ఆశోక్, శ్రీశైలంనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మహిళానేతలతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్

6న మాదిగ మహిళల ఆత్మీయ సమ్మేళనం

మహిళానేతలతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్

ముషీరాబాద్: ఎమ్మార్పీఎస్ మహిళా విభాగాన్ని బలోపేతం చేసి వర్గీకరణ సాధన ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో మహిళలు పురుషులతో సమానంగా ఎదిగేలా చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ఇందులోభాగంగా ఫిబ్రవరి 6న ఓయూ టెక్నాలజీ ఆడిటోరియంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ మహిళల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మహిళా సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మహిళానేతలతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్‌తోపాటు నాలుగు అనుబంధ సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు. అంబేద్కర్ సూచించిన విధంగా మహిళాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేలా ఉద్యమిస్తామని చెప్పారు. మాదిగ మహిళా సమాఖ్యను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. పూర్తిస్థాయి మహిళా కమిటీలను నియమించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం ప్రతినిధులు రుక్కమ్మ, బాలమణి, గట్టమ్మ, పోసాని, జ్యోతి, శ్రీనివాస్, భాస్కర్, రమేశ్, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మారణాయుధాలు!

- ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా కొనుగోళ్లు
- ఒక్క వెబ్‌సైట్ నుంచే నగరానికి 240 ఆయుధాలు
- సోషల్‌మీడియాలో పోస్టింగ్‌లపై పోలీసుల ఆరా
- టాస్క్‌ఫోర్స్ అదుపులో ముగ్గురు యువకులు



స్వాధీనం చేసుకున్న కత్తి.. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆన్‌లైన్‌లో మారణాయుధాల వ్యాపారం జోరుగా జరుగుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియాలో పోస్టింగ్ అయిన కొన్ని ఫొటోలపై ఆరాతీయగా విషయం వెల్లడయింది. గతంలో నాందేడ్, యూపీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో నేరుగా కత్తులు, తుపాకులు కొనుగోలు చేసి రాష్ట్రానికి తీసుకొచ్చేవారు. ప్రస్తుతం వారిసంఖ్య తగ్గింది. ఇటీవల కత్తులు, డ్రాగన్లు పట్టుకుని ఫోజులిస్తూ దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో అధికంగా కన్పించడంతో మారణాయుధాల సరఫరాపై పోలీసులు దృష్టిసారించారు. ఆన్‌లైన్ పోర్టల్స్ నుంచి వీటిని కొనుగోలు చేస్తున్న విషయం బయటపడింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ముగ్గురు యువకులు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. స్నాప్‌డీల్ పోర్టల్ నుంచి హైదరాబాద్‌కు రెండునెలల్లో 100 వరకు డాగర్లు, ఇతర కత్తులు సరఫరా అయినట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు.

కత్తులతో ఫోజులు.. ఎఫ్‌బీలో పోస్టింగ్‌లు

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతాప్‌నగర్‌లో ఉంటూ శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే కే రాహుల్‌ప్రకాశ్ గత నవంబర్‌లో స్నాప్‌డీల్‌లో రూ.999కి డాగర్‌ను కొన్నాడు. స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో డాగర్‌తో ఫొటోలు దిగి ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పెట్టాడు. వీటిని గుర్తించిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు బృందం అతని కదలికలపై నిఘాపెట్టి, డాగర్‌తో తిరుగుతుండగా పట్టుకున్నది. అల్వాల్‌కు చెందిన కంజియ అర్జున్‌దాస్ గుర్తుతెలియని వ్యక్తుల వద్ద డాగర్ కొని.. కంసాలిబజార్‌లోని స్నేహితుడు సాయియాదవ్ ఇచ్చాడు. డాగర్‌తో ఫొటోలు దిగి సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నాడు. డాగర్‌తో ఉన్న సాయియాదవ్‌తోపాటు అర్జున్‌దాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

నిషేధిత ఆయుధాలు కొనడం నేరం

'నిషేధిత డాగర్, తల్వార్, పదునైన కత్తులు కొనడం, వాటిని కలిగి ఉండడం నేరం. మారణాయుధాలతో ఉన్న ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టుచేస్తూ భయాందోళనలకు గురిచేయొద్దు. ఆన్‌లైన్‌లో వీటిని కొంటున్నట్టు దృష్టికొచ్చింది. స్నాప్‌డీల్, అమెజాన్, ఫ్లిప్‌కార్డు వంటి పోర్టల్స్ కొరియర్ సర్వీస్‌కు నోటీసులిస్తాం' అని టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపారు.

ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న సిమెంట్ లారీ.. ఐదుగురి మృతి

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. రాజమండ్రి నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్రకాలువ వంతెన వద్ద సిమెంట్ లారీ ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నది. ప్రమాదంలో 14 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. ఈ ప్రమాదంలో తునికి చెందిన గేలం లక్ష్మి(50), కాపుశెట్టి జ్యోతి(37), కాపుశెట్టి అఖిలసత్య(12), కాపుశెట్టి శివసాయి(14), ఒడిశాకు చెందిన పల్లా సావిత్రమ్మ(60)గా గుర్తించారు. తాడేపల్లిగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

చట్టవిరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు

- నలుగురు ఆర్ఎంపీల అరెస్ట్
- నిర్వాహకుడు, ఆయన భార్య కూడా..
- పరారీలో డాక్టర్, ఆర్ఎంపీ



ఎల్బీ నగర్ డీసీపీ కార్యాలయంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ వెంకటేశ్వరరావు

మన్సూరాబాద్: చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఆరుగురిని యాచారం పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు కుమారస్వామి, ఆయన భార్య సరితతోపాటు నలుగురు ఆర్ఎంపీలు మల్లేశ్, వెంకటేశం, శ్రీనివాస్, రవి ఉన్నారు. ఎంబీబీఎస్ డాక్టర్ రాఘవరెడ్డి, ఆర్ఎంపీ ఉదయరాజు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మాల్‌లోని శ్రీవెంకటేశ్వర క్లినిక్, సరిత స్కాన్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయనే సమాచారంతో ఈ నెల 23న యాచారం పోలీసులతో కలిసి రంగారెడ్డి డీఎంహెచ్‌వో బాలాజీ పవార్ దాడిచేశారని ఎల్బీనగర్ డీసీపీ ఎం వెంకటేశ్వరరావు శుక్రవారం మీడియాకు తెలిపారు. నల్లగొండ జిల్లా మల్లగూడ మండలం ఎర్రగండ్లపల్లికి చెందిన ఆర్ఎంపీ కుమారస్వామి(37)కి ఎంబీబీఎస్ డాక్టర్ జె రాఘవరెడ్డి పరిచయం అయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించాలని కుమారస్వామి ఆయన భార్య సరిత, రాఘవరెడ్డి 2017లో మాల్‌లో స్కాన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మిగతా నలుగురిని దందాలో సభ్యులుగా చేర్చుకున్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డి, యాచారం సీఐ చంద్రకుమార్ ఉన్నారు.

బయటి రాష్ట్రాల డిస్టెన్స్ డిగ్రీలు చెల్లవు

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. యాజమాన్య కోటా కింద ఆయా కళాశాలలు భర్తీ చేసుకున్న సీట్లను తిరిగి విద్యామండలి అంగీకరించాల్సి (రాటిఫికేషన్) ఉంటుంది. 2017-18 విద్యాసంవత్సరంలో దూరవిద్య కేంద్రాల నుంచి డిగ్రీ సర్టిఫికెట్లు తెచ్చుకుని యాజమాన్య కోటాలో సీట్లు పొందిన విద్యార్థులు ఇప్పటివరకు వంద మందికిపైగా ఉన్నారని, ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, కోర్సులకు మాత్రమే తాము అనుమతి ఇస్తున్నామని విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. మిగతా వాటిని తిరస్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. దూరవిద్యావిధానంలో బీఏ, బీకాం వంటి కొన్ని పరిమితమైన కోర్సులకే అనుమతి ఉంటుంది. ఇంజినీరింగ్, బ్యాచలర్ ఆఫ్ లా వంటి కోర్సులకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డెక్) అనుమతి ఇవ్వడం లేదు. న్యాయవిద్యకు సంబంధించిన కోర్సులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇంజినీరింగ్ కోర్సులకు ఏఐసీటీఈ నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది. దూర విద్యావిధానం ద్వారా ఇంజినీరింగ్ ధ్రువపత్రాలను జారీచేసేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడం లేదు. ఎంటెక్ వంటి కోర్సుల్లో చేరేందుకు రెగ్యులర్ విద్యావిధానం ద్వారా గుర్తింపు పొందిన యూనివర్సిటీలు జారీచేసిన ధ్రువపత్రాలకే తాము అనుమతిస్తున్నట్టు అధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థలు ఇతర రాష్ట్రాల వర్సిటీలు జారీచేసిన సర్టిఫికెట్లను అంగీకరించవద్దని ఉన్నతవిద్యామండలి అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు పేర్కొన్నారు.

చికెన్ ధరలు (రూ.ల్లో)

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	99.00
డ్రెస్డ్	144.00
స్కిన్‌లెస్	163.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.ల్లో)

హైదరాబాద్	380-00
రంగారెడ్డి	380-00
మెదక్	380-00
కరీంనగర్	382-00
వరంగల్	382-00
రిటైల్ ప్రైస్	4-40



సుజుకీ నుంచి మరో రెండు బైకులు

న్యూఢిల్లీ, జనవరి 26: వచ్చే నెలలో జరుగనున్న ఆటో ఎక్స్‌లో రెండు కొత్త బైకులను ప్రదర్శించడానికి సిద్ధమైంది ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ సుజుకీ. వీటితోపాటు మరో 15 బైకులు కూడా ఉన్నాయి. ప్రదర్శించనున్నవాటిలో వీ-స్ట్రోమ్ 650 అడ్వెంచర్ టౌరర్, నూతన స్కూటర్, ఫ్యూయల్ ఇంజెక్ట్ వెర్షన్ ఇంట్రూడర్ 155 క్రూయిజర్, జీఎస్ఎక్స్-ఆర్ఆర్ మోటో జీపీ బైక్, గిక్సర్ కప్ రేస్ బైకు, మోటోక్రాస్ ఆర్ఎం-జెడ్450, సుజుకీ ఆర్ఎం-జెడ్250, డీఆర్-జెడ్70లు ఉన్నాయని సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సతోషి ఉచిడా తెలిపారు. పాత మోడళ్లతోపాటు నూతన బైకులను సైతం విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. స్కూటర్‌కు సంబంధించి మరింత సమాచారం ఇవ్వడానికి ఆయన నిరాకరించారు.

వినిమయ పన్నుతో
ధనికులకే లాభం!

సామాన్యులకు ఆదాయం పన్నే మేలా?

దేశంలో ఆదాయం పన్నును రద్దు చేయాలన్న డిమాండ్ రోజు రోజుకూ గట్టిగా వినిపిస్తున్నది. దీని స్థానంలో వినిమయ పన్నును ప్రవేశపెట్టాలని చాలా మంది వాదిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఒకే దెబ్బతో ఇటు పన్నుల ఎగవేతను అరికట్టడంతో పాటు అటు నల్లధనాన్ని నిర్మూలించేందుకు వీలవుతుందని, అంతేకాకుండా పన్నుల పరిధిని విస్తరించడం ద్వారా ఆర్థిక ఇబ్బందుల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు కల్పించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అభిప్రాయాలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని, వీరి డిమాండ్ల మేరకు ఆదాయం పన్నును రద్దు చేసి దానికి బదులుగా వినిమయ పన్నును ప్రవేశపెడితే దేశంలోని సంపన్నులకే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని, అటు ప్రభుత్వంతో పాటు ఇటు పేదలు, సామన్య మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లడం ఖాయమని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ ప్రొఫెసర్ రామ్ సింగ్ స్పష్టం చేస్తున్నారు. ఆదాయం పన్ను (ఐటీ)లా కాకుండా వినిమయ పన్ను (సీటీ) తిరోగమన ప్రభావాన్ని చూపుతుంది. వస్తు, సేవల కొనుగోలు కోసం ప్రజలు చేసే వాస్తవ ఖర్చుపై విధించే పన్నునే వినిమయ పన్ను అంటారు. వస్తు, సేవల కోసం సాధారణంగా పేదలు, మధ్య తరగతి ప్రజలు తమ ఆదాయాన్నంతా ఖర్చు చేస్తారు. కనుక వినిమయ పన్నును ప్రవేశపెట్టడం జరిగితే వీరి ఆదాయమంతటిపై పన్ను పడుతుంది. ఆదాయంలో సింహ భాగాన్ని దాచుకునే ధనికులపై మాత్రం వినిమయ పన్ను ప్రభావం చాలా తక్కువగా ఉంటుంది. 40 శాతం ఫ్లాట్ వినిమయ పన్ను భారం.. పూర్తి ఆదాయాన్ని ఖర్చు చేసే పేదవాడి మొత్తం ఆదాయంలో 40 శాతంతో సమానం. అయితే మొత్తం ఆదాయంలో మూడింట ఒక వంతు కూడా ఖర్చు చేయని ధనికుడి ఆదాయంలో ఇది కేవలం 13 శాతం మాత్రమే. కనుక వినిమయ పన్నుతో పోలిస్తే ధనికుడు తన ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని పన్నుగా చెల్లించే మంచి ఆదాయం పన్ను చట్టమే ప్రగతిశీలకమైనది. అంతేకాకుండా వినిమయ పన్ను అనేక ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. దేశంలో ప్రస్తుతం ఆదాయం పన్ను వసూళ్ల ద్వారా ప్రభుత్వానికి రూ.4.5 లక్షల కోట్లకు పైగా రాబడి వస్తున్నది. ఈ ఆదాయాన్ని ఇలాగే నిలబెట్టుకోవాలన్నా లేక మరింత పెంచుకోవాలన్నా వినిమయ పన్నును మరింత పెంచాల్సి ఉంటుంది. వస్తు, సేవల పన్ను రేట్లను మరింత పెంచకపోతే ప్రభుత్వానికి ఇది సాధ్యం కాదు. ఒకవేళ అలా చేస్తే.. మార్కెట్లో వస్తు, సేవలకు డిమాండ్ పడిపోయి పన్ను ఆదాయం గణనీయంగా తగ్గుతుంది. లేకపోతే వస్తు, సేవల కోసం ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని ఖర్చు చేసే సామాన్య మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలపై విపరీతమైన భారం పడుతుంది. దేశ ఆదాయంలో సగానికిపైగా మొత్తం సంపన్నులైన 10 శాతం మంది భారతీయులు చెల్లించే పన్నుల ద్వారానే వస్తున్నట్లు వివిధ సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. కనుక వినిమయ పన్నును ప్రవేశపెట్టడం ద్వారా సంపన్నులకు మరింత పొదుపు చేసుకునే అవకాశాన్ని కల్పించడమంటే వారి ఆదాయంలో అత్యధిక మొత్తానికి పన్ను విధించకుండా దేశ ఆదాయాన్ని భారీగా తగ్గించుకోవడమే అవుతుంది. దీనికి భిన్నంగా ప్రస్తుతం ఆదాయం పన్ను రూపేణా సంపన్నుల ఆదాయంలో చాలా మొత్తానికి ప్రభుత్వం పన్ను విధిస్తున్న సంగతి తెలిసిందే. కనుక ఒకే కలం పోటుతో ఆదాయం పన్నును పూర్తిగా రద్దుచేస్తే దేశంలో ఇప్పటికే ఆందోళనకరంగా ఉన్న ఆర్థిక అసమానతలు మరింత తారాస్థాయికి చేరడం ఖాయమని రామ్ సింగ్ హెచ్చరిస్తున్నారు.





పన్ను రేట్లు తగ్గాలి

కేంద్రానికి పర్యాటక రంగం సూచన

న్యూఢిల్లీ, జనవరి 26: అంతర్జాతీయ మార్కెట్లతో పోటీపడేలా దేశీయ పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు పన్ను రేట్లపై ప్రభుత్వం పునఃపరిశీలన జరుపాల్సిన అవసరం ఉందని ఆ పరిశ్రమ ప్రతినిధులు ఉద్ఘాటించారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరికొద్ది రోజుల్లో తదుపరి (2018-19 ఆర్థిక సంవత్సర) సార్వత్రిక బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వారు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. దేశంలో ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు సమ్మిళిత వృద్ధికి దోహదం చేస్తున్న కీలక చోదకాల్లో ఒకటైన పర్యాటక రంగానికి అనువైన వాతావరణాన్ని కల్పించాలని, సార్వత్రిక బడ్జెట్‌లో నరేంద్ర మోదీ ప్రభుత్వం సానుకూల విధానాలను ప్రకటిస్తే ఈ రంగానికి ఊతం లభిస్తుందని వారంటున్నారు. ఆసియా ఖండంలోని థాయిలాండ్, మలేషియా, సింగపూర్ లాంటి అంతర్జాతీయ మార్కెట్లతో దేశీయ పర్యాటక రంగం పోటీపడాలంటే అంతర్జాతీయ రేట్లకు అనుగుణంగా సేవలను అందజేయాలని 'మేక్ మై ట్రిప్' వ్యవస్థాపకుడు, ఆ గ్రూపు సీఈవో దీప్ కల్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. థాయిలాండ్, మలేషియా, సింగపూర్ లాంటి దేశాల ఆతిథ్య రంగంలో పన్ను రేట్లు చాలా తక్కువగా ఉండటం వల్లనే అవి ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా ఆవిర్భవించగలిగాయన్నారు. ఈ దేశాలతో పోలిస్తే పర్యాటకులకు తక్కువ ధరలో సేవలను అందజేయడంలో భారత్ చాలా వెనుకబడి ఉన్నదని, కనుక దీనిని దృష్టిలో ఉంచుకుని దేశంలో మౌలిక వసతులను మెరుగుపర్చడంతో పాటు పర్యాటక రంగానికి మరిన్ని ప్రోత్సాహకాలను అందజేయాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వానికి సూచించారు. కాగా, కాక్స్ అండ్ కింగ్స్ గ్రూపు సీఈవో పీటర్ కేర్కర్ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హోటళ్లలో రూ.2,500 నుంచి రూ.7,500 అద్దె కలిగిన గదులకు ప్రస్తుతం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేటు 18 శాతంగా ఉన్నదని, ఇతర దేశాల్లోని హోటళ్లలో వసూలు చేస్తున్న అద్దెలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని ఆయన పేర్కొంటూ.. దేశీయ పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు జీఎస్టీ రేటును తగ్గించడంతో పాటు సార్వత్రిక బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మరికొన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

బడ్జెట్‌లో కీలకం ఇవే..

కేంద్ర బడ్జెట్ సమీపిస్తున్నది. వచ్చే నెల 1న పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ దీన్ని ప్రకటించనుండగా, రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఈ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. నరేంద్ర మోదీ సర్కారు ఐదేండ్ల పాలనలో ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్. త్వరలో ఎనిమిది రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలున్న క్రమంలో ఈసారి బడ్జెట్ ప్రాధాన్యతను సంతరించుకోగా, దేశ చరిత్రలోనే అతిపెద్ద సంస్కరణగా అభివర్ణిస్తున్న వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత వస్తున్న మొదటి బడ్జెట్ కూడా కావడంతో సహజంగానే అందరి చూపు దీనిపైనే ఉన్నది. అలాంటి ఈ కేంద్ర బడ్జెట్‌లో ఏయే అంశాలు కీలకమో, అసలు బడ్జెట్ ప్రక్రియ ఎలా ఉంటుందో సంక్షిప్తంగా తెలుసుకుందాం..



- **బడ్జెట్ అంటే**
ప్రభుత్వ ఆర్థిక సంబంధిత అంశాల సమగ్ర నివేదిక స్వరూపమే బడ్జెట్. ప్రతీ సంవత్సరం కేంద్రానికైనా, రాష్ర్టాలకైనా ఇది అత్యంత ఆవశ్యకం. నిర్ణీత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-మార్చి)లో ఆయా శాఖల అభివృద్ధికి, ప్రజా సంక్షేమ అవసరాలకు బడ్జెట్ ద్వారా నిధులను కేటాయించే ప్రభుత్వాలు.. నిర్వహణ వ్యయం కోసం ఆదాయ వనరులపైనా ఈ బడ్జెట్ ద్వారానే దృష్టి సారిస్తాయి. ఈ క్రమంలోనే కొన్ని పన్నులను పెంచే సర్కారు.. ప్రజాహితార్థం, వివిధ వ్యాపార, పారిశ్రామిక ప్రయోజనార్థం మరికొన్ని పన్నులనూ తగ్గిస్తుంది. ఇక ఈసారి జైట్లీ ప్రసంగంలో ప్రధానాంశాల విషయానికొస్తే..

- **ప్రత్యక్ష, పరోక్ష పన్నులు:** వ్యక్తులపైనా, సంస్థలపైనా నేరుగా విధించే పన్నులే ప్రత్యక్ష పన్నులు. ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్)లు ఈ తరహావే. ఇక వస్తువులు, సేవలపై వసూలు చేసే పన్నులను పరోక్ష పన్నులు అంటారు. వస్తువులు, సేవలను వినియోగదారులు కొన్నప్పుడు ఆ సొమ్ము ద్వారా ఇవి సమకూరుతాయి. జీఎస్టీ, ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు ఈ కోవలోనివే.

- **జీఎస్టీ:** ఒకే దేశం.. ఒకే మార్కెట్.. ఒకే పన్ను లక్ష్యంతో దేశవ్యాప్తంగా గతేడాది జూలై 1 నుంచి అమల్లోకి తెచ్చినదే జీఎస్టీ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎక్సైజ్ సుంకం, సేవా పన్ను, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తదితర పన్నెండుకుపైగా రకరకాల పన్నులను ఒక్కటిగా చేస్తూ పరిచయమైనదే ఈ పరోక్ష పన్ను. 1,200లకుపైగా వస్తువులు, 500లకుపైగా సేవలపై దీన్ని వేస్తున్నారు. 0, 5, 12, 18, 28 శ్లాబుల్లో ఈ పన్ను వసూళ్లు జరుగుతుండగా, విద్య, వైద్యం, తాజా కూరగాయలు, ఆహార పదార్థాలు తదితర కొన్ని ఉత్పత్తులు, సేవలను దీన్నుంచి మినహాయించారు. బంగారంపై 3 శాతం, ముడి వజ్రాలపై 0.25 శాతం చొప్పున ప్రత్యేక జీఎస్టీ ఉన్నది. గతంతో పోల్చితే ఈ పన్నువల్ల కొన్ని ఉత్పత్తులు, సేవలు భారమైపోగా, మరికొన్నింటి ధరలు తగ్గాయి.

- **కస్టమ్స్ సుంకం:** ఏవైనా వస్తువులు దేశంలోకి దిగుమతైనా లేక ఎగుమతైనా వాటిపై కస్టమ్స్ సుంకాన్ని విధిస్తారు. దిగుమతిదారులు, ఎగుమతిదారులు ఈ సుంకాలను చెల్లిస్తారు. సహజంగానే ఈ భారం కూడా వీటిని కొన్న వినియోగదారులపైనే పడుతుంది.

- **ద్రవ్యలోటు:** ప్రభుత్వ ఆదాయాన్ని (రుణాల ద్వారా పొందిన సొమ్ము మినహా) మించి మొత్తం ఖర్చులు దాటిపోతే దాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. వీటిలో రెవెన్యూ లోటు, ప్రాథమిక లోటు అంతర్భాగాలుగా ఉంటాయి.

- **ద్రవ్య విధానం:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అనుసరించే ద్రవ్యపరపతి విధానమే ఇది. మార్కెట్‌లో ద్రవ్య చలామణిని బ్యాంకుల ద్వారా ఆర్బీఐ నియంత్రిస్తుంది. రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్ల సవరణ, నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్), చట్టబద్ధ ద్రవ్యనిష్పత్తి (ఎస్ఎల్ఆర్) తదితర మార్గాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టైన నగదు లావాదేవీలను పర్యవేక్షిస్తుంది.

- **ఆర్థిక విధానం:** బడ్జెట్ ద్వారా అమలుపరిచేదే ఈ ఆర్థిక విధానం. ఆదాయ, వ్యయాలపై ప్రభుత్వ చర్యలను ఇది ప్రతిబింబిస్తుంది.

- **ద్రవ్యోల్బణం:** పెరుగుతున్న ధరలనే ద్రవ్యోల్బణం అంటారు. ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్బీఐ తమ ద్రవ్యవిధానాన్ని ఉపయోగిస్తుంది. ధరల నియంత్రణ కోసం ప్రభుత్వం కూడా ప్రయత్నాలు చేస్తూంటుంది. బడ్జెట్‌లో ఆయా రంగాలకు చేసే నిధుల కేటాయింపులు, పన్నుల సవరణలు ద్రవ్యోల్బణాన్నీ ప్రభావితం చేస్తాయి.

- **క్యాపిటల్ బడ్జెట్:** షేర్లలో పెట్టుబడులు, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రభుత్వ రంగ సంస్థలకు, కార్పొరేషన్లకు, ఇతరత్రా వ్యవస్థలు, అవసరాలకు గాను కేంద్ర ప్రభుత్వం చేసే చెల్లింపుల సమాహారమే ఈ క్యాపిటల్ బడ్జెట్.

- **రెవెన్యూ బడ్జెట్:** ప్రభుత్వ రెవెన్యూ వసూళ్లు, వ్యయాలతో కూడినదే ఈ రెవెన్యూ బడ్జెట్. రెవెన్యూ వసూళ్లను పన్ను, పన్నేతర ఆదాయంగా విభజించారు. ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, ఎక్సైజ్, కస్టమ్స్, సేవా ఇతరత్రా ప్రభుత్వ సుంకాలను పన్ను ఆదాయంగా భావించవచ్చు. రుణాలపై వడ్డీ, పెట్టుబడులపై డివిడెండ్లు తదితర వాటిని పన్నేతర ఆదాయంగా చెప్పుకోవచ్చు.

- **పెట్టుబడుల ఉపసంహరణ:** ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయమే ఈ పెట్టుబడుల ఉపసంహరణ. ఆయా సంస్థల్లో ఉన్న వాటాలను క్యాపిటల్ మార్కెట్ల ద్వారా అమ్మి, ఆ నిధులను ఖజానాకు తరలిస్తుంది ప్రభుత్వం. బడ్జెట్‌లో ఈ పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలనూ ప్రకటిస్తుంది ఆర్థిక మంత్రిత్వ శాఖ.

- **ఆర్థిక బిల్లు:** దీన్నే ద్రవ్యబిల్లుగానూ అభివర్ణిస్తారు. కొత్త పన్నుల లెవీ, ప్రస్తుత పన్ను విధానంలో మార్పులు లేదా పార్లమెంట్ ఆమోదించిన వ్యవధిని మించి ప్రస్తుత పన్ను నిర్మాణాన్నే కొనసాగించడం కోసం ప్రభుత్వం చేసే ప్రతిపాదనలను ఈ బిల్లు ద్వారా పార్లమెంట్‌కు సమర్పిస్తారు. కేంద్ర బడ్జెట్ ప్రకటన తర్వాత వెనువెంటనే ఆర్థిక బిల్లును ప్రవేశపెడుతారు.

- **బడ్జెట్ అంచనాలు:** ఏదైనా మంత్రిత్వ శాఖకు లేదా పథకానికి బడ్జెట్‌లో కేటాయించే నిధుల్నే బడ్జెట్ అంచనాలు అంటారు. అవసరాలనుబట్టి అంచనాల్లో సవరణలనూ చేస్తారు. ఆయా శాఖలకు, పథకాలకు మరిన్ని నిధులనూ కేటాయిస్తూంటుంది.

- **మరికొన్ని:** కేంద్ర బడ్జెట్‌లో మరికొన్ని అంశాలూ కీలకమే. వోట్ ఆన్ అకౌంట్, ఎక్సెస్ గ్రాంట్లు, రీ-అప్రాప్రియేషన్లు, కట్ మోషన్లు, గిలెటిన్, ఏకీకృత నిధి, అగంతుక నిధి, పబ్లిక్ అకౌంట్ తదితర ప్రక్రియలూ కేంద్ర బడ్జెట్‌లో అంతర్భాగాలే.

లగ్జరీ కార్లపై జీఎస్టీని తగ్గించండి

- కేంద్రానికి జేఎల్ఆర్ సూచన



న్యూఢిల్లీ, జనవరి 26: దేశీయంగా లగ్జరీ కార్ల మార్కెట్ మెరుగైన వృద్ధి సాధించాలంటే ప్రీమియం సెడాన్స్, ఎస్‌యూవీలపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించాలని టాటామోటార్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) కోరుతున్నది. బడ్జెట్‌కు ముందస్తుగా ఆ సంస్థ కేంద్రానికి ఈ సూచన చేసింది. పన్నులను తగ్గిస్తే సరిపోదని, అలాగే దీర్ఘకాలికంగా ప్రత్యేక పాలసీని రూపొందించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొంది. దేశీయ సంస్కరణల్లో జీఎస్టీ కీలకంగా మారిందని, ఇందుకు సంబంధించి కేంద్రాన్ని అభినందిస్తున్నట్లు, కానీ ఆటోమొబైల్ సంస్థలపై మాత్రం సరసమైన పన్ను విధించాలని జేఎల్ఆర్ ఇండియా ప్రెసిడెంట్, ఎండీ రోహిత్ సూరి తెలిపారు. ప్రస్తుతం సెడాన్ కార్లపై 48 శాతం పన్ను విధిస్తుండగా, ప్రీమియం ఎస్‌యూవీలపై 50 శాతం చొప్పున విధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో ఆటోమొబైల్ పరిశ్రమ కీలకపాత్ర పోషిస్తున్నదని, అలాగే అత్యధిక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని కూడా ఇదేనని, కానీ అధిక పన్ను విధిస్తుండటంతో పరిశ్రమపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతున్నదన్నారు.

ఈవీ పాలసీ తర్వాతనే విద్యుత్ కారు

ఎలక్ట్రిక్ వాహన పాలసీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాతనే దేశీయ మార్కెట్లోకి విద్యుత్‌తో నడిచే కార్లను విడుదల చేసేదానిపై నిర్ణయం తీసుకోనున్నట్లు రోహిత్ సూరి స్పష్టంచేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇప్పటికే విద్యుత్ వాహనాలను విక్రయిస్తున్నప్పటికీ..భారత్‌లో విడుదల చేయాలా? అందుకు అనువైన పరిస్థితులు ఇక్కడా ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటి వరకైతే కేంద్రం ఈవీ పాలసీ ప్రకటించలేదని, దీని కోసం వేచిచూస్తున్నట్లు, దీంట్లో అనుకూలంగా ఉంటే అప్పుడు ఆలోచిస్తామన్నారు. 2020 కంటే ముందుగానే బీఎస్-6 ప్రమాణాలతో రూపొందించిన వాహనాలను విడుదల చేస్తామని మరో ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

క్రిప్టోకరెన్సీపై ఐసీఏఐ అధ్యయనం





కోల్‌కతా, జనవరి 26: బిట్‌కాయిన్ లాంటి క్రిప్టోకరెన్సీ లేదా వర్చ్యువల్ కరెన్సీలకు ప్రజాదరణ పెరుగుతుండటంతో ఈ అంశంపై ప్రభుత్వం ఐసీఏఐ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా) అభిప్రాయాన్ని కోరింది. ఐసీఏఐ డిజిటల్ అకౌంటింగ్ అండ్ ఎష్యూరెన్స్ స్టాండర్డ్ బోర్డు సభ్యుడు దేబాశిష్ మిత్రా ఈ విషయాన్ని వెల్లడించారు. ఆర్థిక ఫలితాలను క్రిప్టోకరెన్సీలో ప్రకటించడం, వాటి అకౌంటింగ్ ప్రమాణాలపై ఐసీఏఐ అభిప్రాయాన్ని తెలియజేయాల్సిందిగా కార్పొరేట్ వ్యవహారాల శాఖ కోరిందని ఆయన తెలిపారు. కార్పొరేట్ గవర్నెన్స్, కంపెనీల చట్ట సవరణ బిల్లు-2017పై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన సదస్సులో మిత్రా మాట్లాడుతూ.. క్రిప్టోకరెన్సీ ఉనికి కొత్తదే అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా దానికి ప్రాధాన్యత వేగవంతంగా పెరుగుతున్నదన్న విషయం ఎవరూ కాదనలేని వాస్తవమని, కనుక ఈ అంశంపై విస్తృత అధ్యయనాన్ని నిర్వహించి ఈ ఏడాది మార్చిలోగా కేంద్రానికి నివేదిక సమర్పించాలని భావిస్తున్నామని తెలిపారు. క్రిప్టోకరెన్సీపై ప్రభుత్వం తుది నిర్ణయాన్ని తీసుకునే ముందు ఈ వ్యవహారంలో నైపుణ్యమున్న ఇతర సంస్థల అభిప్రాయాలను కూడా తీసుకుంటుందని ఆయన చెప్పారు.

ఆక్సియో బయోసొల్యూషన్స్‌లో 'టాటా' పెట్టుబడులు

న్యూఢిల్లీ, జనవరి 26: టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటాకు చెందిన ఆర్ఎన్‌టీ క్యాపిటల్‌తోపాటు ఏస్పెల్ పార్ట్‌నర్స్, ఐడీజీ వెంచర్ ఇండియాలు సంయుక్తంగా మెడికల్ టెక్నాలజీ సేవల సంస్థ ఆక్సియో బయోసొల్యూషన్స్‌లో 74 లక్షల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. మన కరెన్సీలో ఇది రూ.48 కోట్లు. సర్జికల్ స్ట్రైక్ సమయంలో దేశ భద్రత దళాలకోసం రక్తం గడ్డకట్టే ప్రత్యేక పరికరాలను ఆక్సియో రూపొందించి సరఫరా చేస్తున్నది. రక్తస్రావాన్ని రెండు నుంచి మూడు నిమిషాల్లో నియంత్రించడానికి ఈ అప్లికేషన్ ఉపయోగపడుతున్నదని, తద్వారా ప్రాణాలకు ఎలాంటి ముప్పు ఉండదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఆక్సియోస్టాట్‌ను.. బీఎస్ఎఫ్, ఎన్ఎస్‌జీ, పారా-మిలిటరీ ఫోర్స్, హాస్పిటల్స్, అత్యవసర సమయంలో కూడా ఉపయోగపడనున్నదని తెలిపింది. నూతన మార్కెట్లోకి ప్రవేశించడానికి ఈ నిధులను వినియోగించనున్నది.

తగ్గుముఖం పట్టిన ఒప్పందాలు

2017లో 5470 కోట్ల డాలర్లకు పరిమితం

ముంబై, జనవరి 26: గతేడాదికిగాను దేశీయంగా ఒప్పందాలు భారీగా తగ్గాయి. అంతక్రితం ఏడాదిలో 5970 కోట్ల డాలర్లుగా ఉండగా, 2017 విషయానికి వస్తే 5470 కోట్ల డాలర్లకు తగ్గాయని మెర్జ్‌మార్కెట్ నివేదిక వెల్లడించింది. వీటిలో టెలికం, ఇంధన రంగాల్లో అధికంగా ఒప్పందాలు జరిగినట్లు తెలిపింది. టెలికం రంగం విషయానికి వస్తే వొడాఫోన్-ఐడియాల మధ్య కుదిరిన 1240 కోట్ల డాలర్ల విలువైన ఒప్పందం అతిపెద్దదిగా ఉండగా, టెక్నాలజీ, ఆర్థిక సేవల విభాగంలో కూడా మూడు ఒప్పందాలు జరిగినట్లు వెల్లడించింది. గతేడాది ఆగస్టులో ఎస్సార్ ఆయిల్‌ను రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్‌ను 1290 కోట్ల డాలర్లకు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ రెండు సంస్థల నికర విలువ 6760 కోట్ల డాలర్లుగా నమోదైంది. గతేడాది తొలి త్రైమాసికంలో టెలికం రంగం కీలకపాత్ర పోషించిందని, అంతక్రితం ఏడాదితో పోలిస్తే 28.4 రెట్లు పెరిగి 2040 కోట్ల డాలర్లకు చేరుకున్నట్లు నివేదిక తెలిపింది. ఒప్పందాల సంఖ్య మూడు నుంచి 11కి పెరిగాయి. మొత్తం ఒప్పందాల్లో టెలికం రంగం వాటా 37.2 శాతంగా నమోదైంది. ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రం, టవర్లు, ఫైబర్, మీడియా ఆస్తులను కొనుగోలు చేయడానికి 370 కోట్ల డాలర్ల నిధులను వెచ్చించనున్నట్లు జియో ప్రకటించింది. ఇంధనం, మైనింగ్, యుటిలిటీ విభాగాల్లో 2016లో ఒప్పందాలతో పోలిస్తే 69.4 శాతం తగ్గి 530 కోట్లడాలర్లకు పరిమితమయ్యాయి.

బ్యాంకింగ్ రంగంలోకి అమెజాన్

బ్యాంక్ ఆఫ్ అమెజాన్ పేరుతో భారత్, మెక్సికోలో సేవలు



ప్రపంచంలోని దిగ్గజ ఈ-కామర్స్ సంస్థల్లో ఒకటైన అమెజాన్ త్వరలో బ్యాంకింగ్ రంగంలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటివరకూ చిన్న, మధ్య తరహా వ్యాపారులపై తీవ్ర ప్రభావాన్ని చూపిన ఆ సంస్థ 'బ్యాంక్ ఆఫ్ అమెజాన్' పేరుతో భారత్, మెక్సికో తదితర దేశాల్లో పేమెంట్ సర్వీసులను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నది. ఇందుకు సంబంధించిన పెట్టుబడులు, కొనుగోళ్ల కోసం ఫైనాన్స్ టెక్నాలజీ స్టార్టప్‌లను అమెజాన్ సంప్రదిస్తున్నట్లు సీబీఐ ఇన్‌సైట్స్ రీసెర్చ్ వెల్లడించింది. భారత్‌లో నేరుగా ఖాతాదారుల ఇళ్ల వద్దకే వెళ్లి క్యాష్ పికప్ సర్వీసులను అందించేందుకు అమెజాన్ ప్రత్యేకంగా డిజిటల్ వాలెట్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ వాలెట్ ద్వారా తమ ఖాతాదారులకు ప్రపంచ వ్యాప్తంగా కనెక్టివిటీ ఇవ్వడంతో పాటు బ్యాంకులు అందించే అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అమెజాన్ యోచిస్తున్నది. వీలైతే స్టార్టప్ కంపెనీలను కొనుగోలు చేయడం, లేదంటే వాటిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు అమెజాన్ ప్రయత్నిస్తున్నది. కేవలం భారత్‌లోనే కాకుండా మెక్సికోలో కూడా ఆ సంస్థ క్రెడిట్, డెబిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా నగదు చెల్లింపు సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే అమెరికాలో అమెజాన్ ప్రారంభించిన ఇటువంటి సర్వీసులకు విశేషమైన ఆదరణ లభిస్తున్నది. సాంప్రదాయ సేవలకు ఇవి భిన్నమైనవే అయినప్పటికీ అమెరికా ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం అధికంగానే ఉన్నది. ఆధునిక బ్యాంకింగ్ సేవల్లోకి అమెజాన్ ప్రవేశించడంతో అమెరికాలో ఇప్పటికే దాదాపు మూడు కోట్ల మంది సాంప్రదాయ బ్యాంకింగ్ వ్యవస్థకు దూరమయ్యారు. దీంతో అమెరికాలో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెజాన్ రాకతో అమెరికాలోని సగం బ్యాంకులు, క్రెడిట్ యూనియన్లు, పెద్ద టెక్ కంపెనీలు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఇన్ఫోసిస్ పినాకిల్ తన సర్వే నివేదికలో స్పష్టం చేసింది.

18 పీఎస్‌బీల అవుట్‌లుక్ మెరుగు

- స్థిరత్వ స్థాయికి పెంచిన క్రిసిల్

ముంబై, జనవరి 26: ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రూ.88 వేల కోట్లకు పైగా నిధులను కేటాయిస్తూ కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం ఆయా బ్యాంకులకు మహర్దశ పట్టనున్నది. ఈ కీలక పరిణామంతో18 బ్యాంకుల రేటింగ్‌ను కూడా ప్రతికూలం నుంచి స్థిరత్వానికి పెంచుతున్నట్లు దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ తాజాగా వెల్లడించింది. కేంద్ర నిర్ణయంతో ఆయా బ్యాంకులు ఆర్థికంగా బలోపేతమవడంతోపాటు బ్యాలెన్స్ షీట్ కూడా మెరుగుపడనున్నదని తెలిపింది. రేటింగ్ పెంచిన బ్యాంకుల్లో అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, దేనా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూకో, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంకులు ఉన్నాయి. కానీ ఎస్‌బీఐ రేటింగ్‌ను మాత్రం క్రిసిల్ మార్చలేదు.

మంచిర్యాలలో ఏసీసీ గ్రీన్ బిల్డింగ్ సెంటర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణ సమతుల్యతకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో తాము సైతం పాలుపంచుకోవడానికి ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ సిద్ధమైంది. దీంట్లోభాగంగా మంచిర్యాల జిల్లాలో గ్రీన్ బిల్డింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కంపెనీ ఎండీ, సీఈవో నీరజ్ అఖౌరి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా వివిధ రకాల కాంక్రీట్ ఉత్పత్తులతో సహా ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీలో స్థానికులకు శిక్షణను ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

నిజాయితీగా రుణాలు చెల్లించేవారికి సులభంగా రుణాలు

ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్

న్యూఢిల్లీ, జనవరి 26: ప్రభుత్వరంగ బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లింపులు జరిపిన వారికి సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుందని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ వెల్లడించారు. మార్చి 31నాటికి 20 ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.88,139 కోట్ల స్థాయిలో నిధులను కేటాయించనున్నట్లు కేంద్రం ప్రకటించిన రెండోరోజే కుమార్ ఇలా వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, ఉద్యోగ అవకాశాలకు పెద్ద పీట వేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రుణాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు సదుపాయం కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ ప్రస్తావించారు. దరఖాస్తు చేసుకున్న పక్షం రోజుల్లో రుణం ఇవ్వనున్నారు.



● ఉప్పొంగిన అభిమానం

అన్నదాతల్లో జాతీయతాభావం ఉప్పొంగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో రైతులు కమ్మరి రాములు, తలారి అంజిలయ్య, తెరువటి కృష్ణ, తలారి రాములు, వెంకట్ తదితరులు పొలంలో వరి మడిలో నారును భారతదేశ పటం ఆకృతిలో తీర్చిదిద్ది, జాతీయ జెండాలను చేతపట్టుకుని దేశంపై తమ కున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ దృశ్యం ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకుంది.

- పెద్దేముల్



వణికిస్తున్న చలి

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగింది. శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 5.1 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 7.2, కామారెడ్డి 7.4, సంగారెడ్డి జిల్లాలో 7.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలికి తోడు గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రక్షణగా చలిమంటలు కాచుకుంటున్నారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.9	5.1
కామారెడ్డి	33.6	7.4
ఆదిలాబాద్	33.3	7.2
సంగారెడ్డి	34.1	7.7
నిజామాబాద్	35.7	8.7
నిర్మల్	35.6	8.9
వికారాబాద్	34.8	9.0
జగిత్యాల	35.7	9.0
మంచిర్యాల	34.6	9.3
రాజన్న సిరిసిల్ల	34.7	9.3
సిద్దిపేట	34.6	9.5
జయశంకర్ భూపాలపల్లి	34.6	9.7
మేడ్చల్	34.6	9.9
మెదక్	34.6	9.9
పెద్దపల్లి	35.7	9.9
మహబూబాబాద్	35.8	10.0
రంగారెడ్డి	35.2	10.2
కరీంనగర్	34.9	10.3
భద్రాద్రి కొత్తగూడెం	35.7	10.8
వరంగల్ అర్బన్	32.9	10.8
వరంగల్ రూరల్	35.1	11.1
యాదాద్రి భువనగిరి	35.4	11.6
మహబూబ్‌నగర్	34.8	12.1
నాగర్‌కర్నూల్	34.6	12.2
నల్లగొండ	35.5	12.6
హైదరాబాద్	34.6	12.9
జనగామ	35.6	13.1
ఖమ్మం	34.7	13.2
సూర్యాపేట	34.8	14.5
జోగుళాంబ గద్వాల	34.6	15.1
వనపర్తి	34.0	15.5

మహాశివరాత్రి జాతరకు మంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్యే

వేములవాడ, నమస్తేతెలంగాణ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు జరుగనున్న మహాశివరాత్రి జాతరకు రావాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ఈవో దూస రాజేశ్వర్ ఉన్నారు.

రూ.600 కోట్లతో పర్యాటకాభివృద్ధి

■ టీటీడీసీ చైర్మన్ పేర్వారం రాములు



గోవిందరావుపేట: రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పేర్వారం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర నిధులు సుమారు రూ.600 కోట్లతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో జయశంకర్ జిల్లాలోని లక్నవరం, మేడారం, తాడ్వాయి, బొగత, మల్లూరులో రూ.94 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. మేడారంలో రెస్టారెంట్, కాటేజీలు పూర్తి కాగా ఇటీవలే డిప్యూటీ సీఎం కడియంతో పాటు మంత్రులు ప్రారంభించారని తెలిపారు. లక్నవరం సరస్సుపై మరో వేలాడే వంతెన ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు.

గడువులోగా మిడ్‌మానేరు పూర్తి

■ ప్రాజెక్టుల ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్



తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మిడ్ మానేరు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నట్టు కరీంనగర్ ప్రాజెక్టుల ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) అనిల్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీకాలనీలో గల ఈఎన్‌సీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మిడ్ మానేరు ప్రాజెక్టుకు 25 గేట్లను బిగించామని, ప్రస్తుతం ఇందులో 4.9 టీఎంసీల నీరు ఉన్నదన్నారు. మిషన్ భగీరథలో భాగంగా చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని 455 గ్రామాలకు ఎంఎంఆర్ నుంచి నీటిని అందించనున్నట్టు తెలిపారు. మిడ్ మానేరుకు సంబంధించి మిగితా పనులను గడువులోపే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ ఏడాది తోటపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేస్తామన్నారు. మిడ్ మానేరు రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా ఈ ఏడాది 80 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్టు పేర్కొన్నారు.

నెన్నెల తహసీల్దార్ సస్పెన్షన్

మంచిర్యాల రూరల్: మంచిర్యాల జిల్లా నెన్నెల తహసీల్దార్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల నెన్నెల గ్రామానికి చెందిన పల్లె మహేశ్ అదే గ్రామానికి చెందిన రంగు రామాగౌడ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయించాడు. అయితే మహేశ్ ఎస్సీ కాదని, తనపై అట్రాసిటీ కేసు ఎలా నమోదు చేస్తారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 22న కలెక్టరేట్‌లో 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశాడు. ఆ వెంటనే రామాగౌడ్ ఆత్మహత్యకు యత్నించి అదే రోజు దవాఖానలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ ఆర్వీ కర్ణన్ విచారణాధికారిగా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను నియమించగా ఆయన తన నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. విచారణ నడుస్తున్నందున తహసీల్దార్ సత్యనారాయణను సస్పెండ్ చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ రాజలింగంను నెన్నెల తహసీల్దార్‌గా నియమించారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని ఏరియా దవాఖాన ప్రాంగణంలో శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకటరావు అమ్మఒడి వాహనాలను ప్రారంభించారు.
-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

భరత్‌రెడ్డిపై పీడీ యాక్టు నమోదు

నిజామాబాద్ క్రైం: అభంగపట్నం దళిత యువకుల కిడ్నాప్ కేసును నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్తికేయశర్మ సీరియస్‌గా పరిగణించారు. ఇద్దరు దళిత యువకులను వేధించిన కేసులో నిందితుడు భరత్‌రెడ్డిపై పీడీ యాక్ట్‌ను నమోదు చేశారు. గతేడాది డిసెంబర్ 12న భరత్‌రెడ్డిని జైలుకు కూడా తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించిన సీపీ.. జిల్లాలో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకున్నారు.

మేడారం జనసంద్రం

- రాత్రివేళా గద్దెల ప్రాంగణం కిటకిట
- 31న ప్రారంభం కానున్న మహాజాతర
- 1.25 కోట్ల మంది వస్తారని అంచనా



శుక్రవారం భక్తులతో కిక్కిరిసిన మేడారంలోని వనదేవతల గద్దెల ప్రాంగణం

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సమ్మక్కసారలమ్మ మహాజాతర 31న ప్రారంభం కానుండటంతో మేడారం వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. శుక్రవారం ఏడు లక్షల మందికిపైగా భక్తులు వన దేవతలను దర్శించుకున్నట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రవాహంలా మేడారం తరలివస్తున్న భక్తులు రాత్రి వేళల్లోనూ తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం నిరంతరం భక్తజనంతో కిటకిటలాడుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈనెల 31 నుంచి నాలుగు రోజులపాటు మహాజాతర జరుగనున్నది. తొలిరోజు సారలమ్మ, రెండో రోజు సమ్మక్క దేవత మేడారంలోని గద్దెలపైకి చేరుతారు. మూడో రోజు దర్శనం, నాలుగో రోజు తిరిగి అమ్మవార్ల వన ప్రవేశంతో మహాజాతరకు తెర పడనున్నది.

మహా జాతరకు భారీ ఏర్పాట్లు..

ఈసారి జాతరకు 1.25 కోట్ల మంది వస్తారని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జాతర సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో చాలామంది ముందస్తు మొక్కుల కోసం మేడారం దారి పడుతున్నారు. దాదాపు నెలరోజుల ముందు నుంచే భక్తులు వనదేవతలను దర్శించుకుంటున్నారు. ఇప్పటికే సుమారు అరకోటి మంది భక్తులు వచ్చివెళ్లినట్టు అధికారులు చెబుతున్నారు. సెలవు రోజుల్లో భక్తులు భారీగా వస్తున్నారు. అత్యధికంగా గత ఆదివారం 10లక్షలకు పైగా మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఇతర రోజుల్లో మూడు లక్షల నుంచి ఏడు లక్షల వరకు చేరుకుంటున్నారు. బుధవారం నుంచి రోజూ ఆరు లక్షలకుపైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. దీంతో రాత్రివేళ కూడా దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు

వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం తమ స్నేహితులతో కలిసి మేడారం సమ్మక్కసారలమ్మలను దర్శించుకున్నారు. వనదేవతల గద్దెల ప్రాంగణంలో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. ఆ తర్వాత వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ కూడా వనదేవతలను దర్శించుకుని కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వీరితోపాటు పలువురు ప్రముఖులు కూడా అమ్మవార్లను దర్శించుకున్నారు.

● వైభవంగా గంధ మహోత్సవం



మత సామరస్యం వెల్లివిరిసేలా సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ ఉత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం గంధం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉర్సుకు తెలుగురాష్ట్రాల నుంచి లక్షమందికిపైగా భక్తులు హాజరైనట్లు అధికారుల అంచనా వేశారు. మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు హైదరాబాద్ వక్ఫ్‌బోర్డు నుంచి తీసుకొచ్చిన గంధాన్ని ఊరేగించారు. సూర్యాపేట ఆర్డీవో మోహన్‌రావు, కోదాడ డీఎస్పీ రమణారెడ్డి, టీఆర్‌ఎస్ హుజూర్‌నగర్ ఇంచార్జి కాసోజు శంకరమ్మ చందల్‌ఖానాలో గంధ కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు.

- పాలకవీడు



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న అధికారులు

నేత్రపర్వంగా ఎదుర్కోలు

■ నేడు శ్రీవారి కల్యాణమహోత్సవం

యాదాద్రిభువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం, నిశ్చయ తాంబూలాలకు ఒప్పందం కుదిరింది. శనివారం రాత్రి 10గంటలకు కల్యాణ ముహూర్తం నిర్ణయించగా.. నృసింహుడికి వరపూజ, వధువు శ్రీలక్ష్మీదేవికి పూలు, పండ్లు కార్యక్రమం జరిగింది. స్వామి వారి ఎదుర్కోలు మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. పట్టువస్త్రాల అలంకరణతో అశ్వవాహన సేవపై శ్రీనారసింహుడు, ముత్యాల పల్లకీ ద్వారా లక్ష్మీదేవి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. మండపంలో ఎదురెదురుగా స్వామి, అమ్మవార్లను అధిష్ఠింపజేసి వేడుక నిర్వహించారు.

పాలమూరు ప్రాజెక్టు పనులు భేష్

ఉద్యమ ఫలితాలు అందుతున్నాయని న్యాయవాదుల వెల్లడి

వనపర్తి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలోని మూడో లిఫ్టులో జరుగుతున్న పనులను వనపర్తి జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదుల బృందం సభ్యులు పర్యవేక్షించారు. మూడేండ్లుగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల పనులను 30 మందితో కూడిన న్యాయవాదులు చూసి అబ్బురపడిపోయారు. వనపర్తి జిల్లాలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల సమీపంలో నిర్మిస్తున్న వీరాంజనేయ రిజర్వాయర్ పనులను, నాగర్‌కర్నూల్ మండలంలో కొనసాగుతున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మూడో లిఫ్టుకు సంబంధించి గుడిపల్లి గట్టులో న్యాయవాదుల బృందం పర్యవేక్షించింది. శరవేగంగా జరుగుతున్న ఏదుల రిజర్వాయర్ పనులను చూసిన న్యాయవాదులు ఆశ్చర్యానికి లోనయ్యారు. వచ్చే వానాకాలం నాటికి రిజర్వాయర్‌లో నీటి నిలువ చేసుకునేలా జరుగుతున్న పనులు ఊహకందని విధంగా సాగుతున్నాయని, రిజర్వాయర్ కట్ట పనులు, కాలువ సొరంగం పనులు అదే వేగంతో జరగుతున్నాయని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి చెప్పారు.



ఏదుల రిజర్వాయర్ పనులు పరిశీలిస్తున్న వనపర్తి జిల్లా న్యాయవాదుల బృందం

విద్యుదాఘాతానికి ఇద్దరు యువకుల మృతి

దౌల్తాబాద్: బోరు బావిలోకి పైపులు దించుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం ఊరగుంట తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పత్యానాయక్ అనే రైతు రెండు రోజుల క్రితం తన పొలంలో బోరుబావి తవ్వించాడు. శుక్రవారం పత్యానాయక్ కుమారులు శ్రీశైలం, శ్రీకాంత్, అల్లుడు వ్యాల్యానాయక్‌లు మోటర్‌ను బావిలోకి దింపే క్రమంలో పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు ఇనుప పైపులు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో వాల్యానాయక్ (35), శ్రీశైలం(25) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్‌ను కోస్గి దవాఖానకు తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గణతంత్ర వేడుకలో అపశ్రుతి

■ విద్యుత్ వైర్లకు జెండాపైపు తగిలి సెక్యూరిటీ గార్డ్ మృతి

■ రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించిన మంత్రి హరీశ్



చంద్రయ్య (ఫైల్)

కోహెడ: గణతంత్ర దినోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. విద్యుత్ వైర్లకు జెండాపైపు తగలడంతో విద్యుదాఘాతానికి గురై సెక్యూరిటీ గార్డ్ మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కోహెడలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. కోహెడ మండలం బస్వాపూర్ గ్రామ పరిధిలోని ఆరెపల్లికి చెందిన గొట్టె చంద్రయ్య(42) కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు.శుక్రవారం గణతంత్ర వేడుకల సందర్భంగా జెండా పైపు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ హైటెన్షన్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎంపీపీ ఉప్పుల స్వామి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఆర్డీవో శంకర్‌కుమార్, ఎంపీడీవో హరిప్రియ, సీఐ శ్రీనివాస్‌జీ, కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ పేర్యాల రవీందర్‌రావు, జెడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. విషయం తెలియడంతో భారీ నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెంటనే మార్కెటింగ్‌శాఖ ద్వారా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. డీఎంఓ శర్మతో వెంటనే చెక్కు పంపించారు. ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. విద్యుత్‌శాఖ ద్వారా మరో రూ.5లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రియుడి ఇంటి ఎదుట మౌనపోరాటం



ప్రియుడి ఇంటి ఎదుట నిరసన చేపట్టిన రజిత

రామడుగు: ప్రేమించానని నమ్మించి పెండ్లి చేసుకోకుండా మోసం చేశాడని ఆరోపిస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి నిరసన చేపట్టింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం పోతుగంటిపల్లికి చెందిన రజిత (24) విడాకులు తీసుకొని ఇంటివద్దే ఉంటున్నది. ఆరునెలల క్రితం రామడుగు మండలం లక్ష్మీపూర్‌కు చెందిన జాడి సాయి (21)కి ఫోన్‌లో పరిచయమైంది. కొన్ని నెలల కింద రజిత తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు దవాఖానలో చేర్పించింది. ఈ సమయంలో సాయి దవాఖానకు వచ్చి రజితతో మాట్లాడాడు. ఇరువురి మధ్య ప్రేమాయణం సాగింది. ఈ దశలో రజిత గర్భం దాల్చగా ఆమెకు సాయి అబార్షన్ చేయించాడు. రజిత ప్రేమ విషయం ఆమె ఇంట్లోవాళ్లకు తెలియడంతో ఇంట్లోంచి వెళ్లగొట్టారు. దీంతో ఆమె సాయి ఇంటికి చేరుకుని ఆందోళన చేపట్టింది. సాయితో పెండ్లి జరిపించాలని రజిత కోరుతున్నది.

విషపూరితగ్రాసం తిని 67 పశువుల మృతి

మరిపెడ, నమస్తే తెలంగాణ: విషపూరిత గ్రాసం తిని 67 పశువులు మృతిచెందగా, మరో 120 తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం శివారు దుబ్బతండాలో శుక్రవారం జరిగింది. తండాకు చెందిన బానోత్ మంగు 20 రోజుల క్రితం దినుసుగడ్డ (కందగడ్డ) చేనుకు ఫోరెట్ గుళికలు వేశారు. రెండు మూడు తడుల అనంతరం దినుసు గడ్డలను తీయడానికి తీగలను కోసి దున్నారు. దినుసు పైరు పచ్చగా ఉండటంతో గిరిజనులు దానిని ఇంటికి తీసుకెళ్లి పశువులకు వేశారు. 30 మందికి చెందిన 67 పశువులు మృతిచెందగా మరో 120 వరకు అస్వస్థతకు గురయ్యాయి. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జేసీ దామోదర్‌రెడ్డి బాధితులను పరామర్శించారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్, అధికారులు

బుల్లెట్ బైక్‌తో సర్కస్ ఫీట్లు

■ ఇద్దరు యువకుల దుర్మరణం


పటాన్‌చెరు టౌన్: బుల్లెట్ బైక్‌తో సర్కస్ ఫీట్లు చేయబోయిన ఇద్దరు యువకులు అదుపుతప్పి పడిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రారం వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి పట్టణానికి చెందిన సాయి రాఘవ(23) ఇస్నాపూర్‌లో నివసిస్తున్న తన మిత్రుడు నవీన్‌కుమార్(21) వద్దకు గురువారం సాయంత్రం వచ్చాడు. రాత్రి 10 గంటల ప్రాంతంలో సాయి రాఘవను సంగారెడ్డిలో వదిలి రావటానికి బుల్లెట్ (టీఎస్ 15 జేటీఆర్ 2080) వాహనంపై బయలు దేరారు. మార్గమధ్యంలో సర్కస్ ఫీట్లు చేయడంతో రుద్రారంలోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌ను ఢీకొన్నారు. ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. నవీన్ రామచంద్రాపురంలోని ప్రైవేట్ దవాఖానలో, సాయి రాఘవ సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
శనివారం 27 జనవరి 2018


ఐపీఎల్ వేలానికి వేళయింది.. వేదిక సిద్ధమైంది..ధనాధన్ ఆటలో కోట్లు పలుకరించే క్షణం..అనామక క్రికెటర్లను అందలం ఎక్కించే తరుణం.. ప్రపంచ స్థాయి ఆటగాళ్లకూ జాక్‌పాట్ తగిలే సమయం.. కోట్లు కొల్లగొట్టే మెరుపు వీరులెవరో..నేడు తేలనుంది

జాక్‌పాట్ ఎవరికో?

- నేడు, రేపు ఐపీఎల్ వేలం
- స్టోక్స్, మున్రో, గేల్, పొలార్డ్‌పై ఫ్రాంచైజీల కన్ను
- యువీ, గంభీర్, ధవన్, హర్భజన్ ఎవరి సొంతం?
- ప్రత్యేక ఆకర్షణగా దేశవాళీ ఆటగాళ్లు


కృనాల్



చాహల్


మున్రో


స్టోక్స్

బెంగళూరు:

ఐపీఎల్ 2018 వేలానికి రంగం సిద్ధమైంది. నేడు జరుగనున్న వేలంలో 578 ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయితే వీరిలో ముందుగా 16 మంది మార్క్యూ ఆటగాళ్లను వేలంలో ప్రవేశపెడుతారు. ఈ 16 మంది కనీస ధర రూ.2కోట్లు ఉండగా...ఆయా


గంభీర్
ఉ. 9 నుంచి స్టార్స్ స్పోర్ట్స్‌లో

ఫ్రాంచైజీలు తమకు నచ్చితే ఎన్ని కోట్లైనా కుమ్మరించేందుకు సిద్ధంగా ఉండటంతో ఆ జాక్‌పాట్ ఎవరికి తగులుతుందనేదే ఆసక్తికరంగా మారింది. మార్క్యూ ఆటగాళ్లలో సిక్సర్ల వీరుడు యువ రాజ్‌సింగ్, గంభీర్, ధవన్, రహానే రేసులో ఉన్నారు. గంభీర్‌ను కోల్‌కతా దక్కించుకుంటుందా లేక ఢిల్లీ మొగ్గు చూపుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ధవన్‌ను సన్ రైజర్స్ రైట్ టు మ్యాచ్ ద్వారా తీసుకునే అవకాశాలూ ఉన్నాయి. రహానేపై అతని పాత ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ ఆసక్తితో ఉన్నట్టు తెలుస్తున్నది. అయితే యువీ విషయంలోనే కాస్త సందిగ్ధం నెలకొంది. తాజాగా జరిగిన ముస్తాక్ అలీ టీ20లో అంచనాలను అందుకోలేకపోవడంతో ఇతడిని దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు భారీ ధరను వెచ్చించకపోవచ్చు. అయితే కింగ్స్ ఎలెవన్ పంజాబ్ యువీపై ఆసక్తికనబరుస్తున్నది. ఇదే జాబితాలో ఉన్న హర్భజన్ సింగ్‌ను ముంబై మళ్లీ తీసుకునే ఆలోచనలో ఉంది. ఇక రవిచంద్రన్ అశ్విన్‌ను చెన్నై దక్కించుకునేందుకు ప్రయత్నిస్తుందని ఇప్పటికే ధోనీ చెప్పగా...కనీస ధర కంటే ఎక్కువ వెచ్చించేందుకు ఆసక్తి చూపకపోవచ్చు. టీ20 స్పెషలిస్ట్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడటం ఖాయం. ఇతడికి జాక్‌పాట్ తగిలినా ఆశ్చర్యం లేదు. మనీశ్‌పాండే, సూర్యకుమార్ యాదవ్ కూడా తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు.

విదేశీ వీరులు

ఇక విదేశీ ఆటగాళ్ల విషయానికొస్తే.. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్‌పై అందరి చూపు ఉండగా..వెస్టిండీస్ తురుపు ముక్కలు క్రిస్‌గేల్, పొలార్డ్ , డ్వేన్ బ్రావో, బంగ్లాదేశ్ ఆటగాడు షకిబ్ అల్ హసన్‌పై ఫ్రాంచైజీలు కన్నేశాయి. పొలార్డ్‌ను ముంబై రైట్ టూ మ్యాచ్ ద్వారా తీసుకునే అవకాశం ఉంది. షకిబ్‌ను కోల్‌కతా తిరిగి దక్కించుకోవడం లాంఛనమే అంటున్నారు విశ్లేషకులు. గేల్, బ్రావోను ఎవరు దక్కించుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఈసారి న్యూజిలాండ్ సంచలన బ్యాట్స్‌మన్ కొలిన్ మున్రోను అదృష్టం వరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో కోల్‌కతాకు ఆడిన క్రిస్‌లిన్, తాజాగా ఆస్ట్రేలియాపై 180 పరుగులు బాదిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్ జాసన్‌రాయ్...వికెట్ కీపర్ జాస్ బట్లర్ రేసులో అందరికంటే ముందున్నారు.

దేశీ ధమాకా

అన్‌క్యాప్డ్ విభాగంలో రంజీ ఆటగాళ్లు ఇప్పటికే ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించారు. వీళ్లలో కృనాల్ పాండ్య (40 లక్షల కనీస ధర)పైనే అన్ని ఫ్రాంచైజీలు ఆసక్తికనబరుస్తున్నాయి. ఇక విదర్భను రంజీ విజేతగా నిలుపడంలో కీలకపాత్ర పోషించిన పేస్ బౌలర్ రజినీశ్ గుర్బానీ, నవ్‌దీప్ సైనీ కోటీశ్వరులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరికి తోడు అండర్-19 చిచ్చర పిడుగులు పృథ్వీషా, శుభ్‌మన్‌గిల్, అభిషేక్ శర్మ, కమలేశ్ నాగర్‌కోటి, అనుకూల్ రాయ్ పై ఫ్రాంచైజీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి.



రద్దా..కొనసాగింపా!

వాండరర్స్ పిచ్ వణికిస్తున్నది. ఏరికోరి తయారుచేసిన పిచ్ దక్షిణాఫ్రికాతో పాటు భారత్‌ను తెగ ఇబ్బంది పెడుతున్నది. మూడో రోజు ఆటలో బంతులు బుల్లెట్‌లా దూసుకొస్తున్నా భారత బ్యాట్స్‌మెన్ పరుగులు కొల్లగొట్టారు. లక్ష్యఛేదనలో బుమ్రా వేసిన బంతి ఎల్గర్ హెల్మెట్‌ను బలంగా ఢీకొట్టింది. అంపైర్లు మ్యాచ్‌ను నిర్ణీత సమయం కంటే ముందే నిలిపివేశారు. దీంతో అసలు మ్యాచ్ కొనసాగుతుందా.. లేదా రద్దు అవుతుందా అన్నదానిపై సందిగ్ధత నెలకొన్నది.

వామ్మో.. వాండరర్స్

- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 247 ఆలౌట్
- దక్షిణాఫ్రికా లక్ష్యం 241 పరుగులు
- ప్రస్తుతం 17/1

ఓవైపు దుర్భేద్యమైన దక్షిణాఫ్రికా బౌలింగ్..మరోవైపు పిచ్‌పై అనూహ్యమైన బౌన్స్ బెంబేలెత్తించినా.. తొణకని ఆత్మవిశ్వాసంతో భారత బ్యాట్స్‌మెన్ సఫారీ పేస్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టారు. కెప్టెన్ కోహ్లీకి తోడు రహానే, భువీ కీలక ఇన్నింగ్స్‌తో టీమ్‌ఇండియాను పటిష్ఠ స్థితిలో నిలిపారు. లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికాను అదే బౌన్స్‌తో భారత బౌలర్లు దెబ్బకొట్టారు. పర్యటనలో తొలి విజయం ఊరిస్తున్నా..పిచ్ పరిస్థితులు మాత్రం మ్యాచ్‌ను సందేహంలో పడేయటం కొంత కలవరపెడుతున్నది. దీంతో నాలుగో రోజు ఆటపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

జొహన్నెస్‌బర్గ్: మూడో టెస్టుపై భారత్ జట్టు గట్టిపట్టే బిగించింది. అస్థిరమైన బౌన్స్‌తో విమర్శలపాలవుతున్న కఠినమైన పిచ్‌పై టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ మంచి పోరాట స్ఫూర్తిని చూపెట్టారు. ఫలితంగా 49/1 ఓవర్‌నైట్ స్కోరుతో శుక్రవారం ఆట కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 247 పరుగులు చేసింది. రహానే (48), కెప్టెన్ కోహ్లీ (41), భువనేశ్వర్ (33), షమీ (27) మెరుగ్గా ఆడారు. దీంతో దక్షిణాఫ్రికా ముందు 240 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనిని ఛేదించేందుకు బరిలోకి దిగిన సఫారీ జట్టు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 8.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 17 పరుగులు చేసింది. ఎల్గర్ (11 బ్యాటింగ్), ఆమ్లా (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మార్క్రమ్ (4) నిరాశపర్చాడు. ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపునకు 9 వికెట్లు అవసరం కాగా, దక్షిణాఫ్రికా మరో 224 పరుగులు చేయాల్సి ఉంది.


రహానే (48)

పిచ్‌పై చర్చ..

మూడో రోజు తొలి సెషన్ ఆటలో భారత్ బ్యాటింగ్ కంటే పిచ్ గురించి ఎక్కువగా చర్చ జరిగింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ విజయ్ (25) ఓ ఎండ్‌లో నిలకడగా ఆడినా.. సెషన్ రెండో ఓవర్‌లో రాహుల్ (16), మరో మూడు ఓవర్ల తర్వాత పుజార (1) ఔట్‌కావడంతో టీమ్‌ఇండియా స్కోరు 57/3గా మారింది. ఈ దశలో వచ్చిన కోహ్లీ తనదైన శైలిలో ఆడుతూ ముందుకెళ్లాడు. విజయ్ అండతో ప్రొటీస్ బౌలర్లపై ఆధిపత్యం చూపెట్టినా.. అస్థిరమైన బౌన్స్ దెబ్బకు ఈ ఇద్దరు చాలా ఇబ్బందిపడ్డారు. 31, 35 ఓవర్లలో రబడ వేసిన బంతులు వరుసగా కోహ్లీ కుడి, విజయ్ ఎడమ చేతికి బలంగా తాకాయి. వెంటనే దీనిపై కోహ్లీ అంపైర్లకు ఫిర్యాదు చేశాడు. వికెట్‌పై ఉండే బ్లాక్ స్పాట్‌లను చూపెట్టడంతో ఫీల్డ్ అంపైర్లు సుదీర్ఘంగా చర్చించారు. దీనిని పక్కనబెడితే.. 4 పరుగుల వద్ద మార్క్రమ్ క్యాచ్ జారవిడువడంతో గట్టెక్కిన కోహ్లీ అటాకింగ్‌తో ముందుకెళ్లాడు. రెండోఎండ్‌లో విజయ్ కూడా సమయోచితంగా స్పందించడంతో 18.5 ఓవర్లు ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. అయితే లంచ్‌కు కొద్ది ముందు రబడ వేసిన సూపర్ యార్కర్‌కు విజయ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 3 గంటలా 14 నిమిషాలు క్రీజులో గడిపిన విజయ్ 127 బంతులు ఆడి కేవలం 25 పరుగులు చేశాడు. విరాట్‌తో నాలుగో వికెట్‌కు 43 పరుగులు జోడించాడు.

కీలక భాగస్వామ్యాలు

100/4 స్కోరుతో లంచ్ తర్వాత ఆట మొదలుపెట్టిన కోహ్లీ, రహానే ఏమాత్రం తగ్గలేదు. పిచ్ క్షీణిస్తున్నా.. ఈ ఇద్దరు దూకుడుకే ప్రాధాన్యమిచ్చారు. దాదాపు 10 ఓవర్లు ఆడిన తర్వాత రబడ వేసిన అనూహ్యమైన బంతికి విరాట్ జవాబు చెప్పలేకపోయాడు. వేగంగా దూసుకొచ్చిన బంతిని డ్రైవ్ చేసే క్రమంలో విరాట్ ఆఫ్‌స్టంప్ ఎగిరిపోయింది. పాండ్యా (4) విఫలమైనా.. భువనేశ్వర్‌తో కలిసి రహానే లక్ష్యాన్ని నిర్దేశించే పనిలో పడ్డాడు. మోర్కెల్‌ను లక్ష్యంగా చేసుకొని అతను షాట్లు బాదడంతో భారత్ స్కోరు 150 పరుగులకు చేరింది. ఈ క్రమంలో 15 పరుగుల వద్ద భువీ ఇచ్చిన క్యాచ్‌ను గల్లీలో ఎల్గర్ వదిలేశాడు. మరో ఆరు బంతుల తర్వాత 38 పరుగుల వద్ద రహానే క్యాచ్‌ను డీప్‌పాయింట్‌లో పెహెల్‌కావో జారవిడిచాడు. ఈ రెండింటిని ఆసరా చేసుకున్న ఈ జోడీ.. టీ విరామానికి భారత్ స్కోరును 199/6కు చేర్చారు. కానీ మూడో సెషన్ ప్రారంభంలోనే రహానే ఔట్‌కావడంతో ఏడో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. 203/7 స్కోరు వద్ద క్రీజులోకి వచ్చిన షమీ (27) ఊహించిన దానికంటే భిన్నంగా ఆడాడు. భువనేశ్వర్ సూచనలతో రెండు భారీ సిక్సర్లు కొట్టి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపెట్టాడు. ఎనిమిదో వికెట్‌కు 35 పరుగులు జోడించి ఎంగిడి బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆరు బంతుల తర్వాత భువీ, కొద్దిసేపటికి బుమ్రా వెనుదిరగడంతో ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఫిలాండర్, రబడ, మోర్కెల్ తలా మూడు వికెట్లు తీశారు.


కోహ్లీ (41)

ధోనీ రికార్డు బద్దలు

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో అరుదైన రికార్డును అందుకున్నాడు. టీమ్‌ఇండియా తరఫున అత్యధిక పరుగులు చేసిన టెస్టు కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేయడంతో సారథిగా అతను 3455 పరుగులకు చేరుకున్నాడు. 57 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ధోనీ 96 ఇన్నింగ్స్‌ల్లో 3454 పరుగులు చేశాడు. గవాస్కర్ (74 ఇన్నింగ్స్‌ల్లో 3449), అజారుద్దీన్ (68 ఇన్నింగ్స్‌ల్లో 2856), గంగూలీ (75 ఇన్నింగ్స్‌ల్లో 2561) ఈ జాబితాలో ఉన్నారు.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 187 ఆలౌట్.
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194 ఆలౌట్.
భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబడ 25, పార్థివ్ (సి) మార్క్రమ్ (బి) ఫిలాండర్ 16, రాహుల్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, పుజార (సి) డుప్లెసిస్ (బి) మోర్కెల్ 1, కోహ్లీ (బి) రబడ 41, రహానే (సి) డికాక్ (బి) మోర్కెల్ 48, పాండ్యా (సి అండ్ బి) రబడ 4, భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33, షమీ (సి) డివిలియర్స్ (బి) ఎంగిడి 27, ఇషాంత్ నాటౌట్ 7, బుమ్రా (సి) రబడ (బి) ఫిలాండర్ 0, **ఎక్స్‌ట్రాలు:** 29, **మొత్తం:** 80.1 ఓవర్లలో 247 ఆలౌట్.
వికెట్లపతనం: 1-17, 2-51, 3-57, 4-100, 5-134, 6-148, 7-203, 8-238, 9-240, 10-247.
బౌలింగ్: ఫిలాండర్ 21.1-5-61-3, రబడ 23-5-69-3, మోర్కెల్ 21-6-41-3, ఎంగిడి 12-2-38-1, పెహెల్‌కావో 3-0-5-0.
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి) పార్థివ్ (బి) షమీ 4, ఎల్గర్ బ్యాటింగ్ 11, ఆమ్లా బ్యాటింగ్ 2, మొత్తం: 8.3 ఓవర్లలో 17/1.
వికెట్లపతనం: 1-5. బౌలింగ్: భువనేశ్వర్ 4-0-8-0, షమీ 4-1-7-1, బుమ్రా 0.3-0-2-0.


3వ ప్రొ రెజ్లింగ్ లీగ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఎన్‌సీఆర్ పంజాబ్ రాయల్స్ జట్టు. ఫైనల్లో హర్యానా హ్యామర్స్‌పై 6-3 స్కోరుతో విజయం సాధించింది.

ఆసీస్‌కో గెలుపు

అడిలైడ్: వన్డేల్లో వరుస ఓటముల పరంపరకు ఆస్ట్రేలియా ముగింపు పలికింది. ఇప్పటికే వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్‌కు చేజార్చుకున్న ఆసీస్..శుక్రవారం జరిగిన నాలుగో వన్డేలో 3 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత ఇంగ్లండ్ 44.5 ఓవర్లలో 196 పరుగులకు ఆలౌటైంది. వోక్స్(78) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. కమ్మిన్స్(4/24)నాలుగు వికెట్లతో విజృంభించగా, హాజిల్‌వుడ్(3/39), టై(3/33) మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆసీస్..టిమ్ హెడ్(96) రాణింపుతో 37 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది. రషీద్(3/49) మూడు వికెట్లు తీశాడు.



టిమ్ హెడ్(96)

పాక్ కాసుకో!

- అండర్-19 ప్రపంచకప్ సెమీస్‌లో భారత్
- రాణించిన గిల్, అభిషేక్
- క్వార్టర్స్‌లో బంగ్లాపై ఘనవిజయం

కుర్రాళ్లు కదంతొక్కారు. నూనుగు మీసాలతో, ఉడుకు రక్తం ఉరుకలేస్తున్న వయస్సులో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేసుకుంటూ దూసుకెళుతున్నారు. పోరాడితే పోయేదేమిలేదన్న తరహాలో శతకోటి భరతావని ఆశలు మోసుకుంటూ నాలుగో ప్రపంచకప్ వేటలో మరింత ముందుకెళ్లారు. శుభ్‌మన్‌గిల్, అభిషేక్‌శర్మ అదురగొట్టిన వేళ..క్వార్టర్స్‌లో బంగ్లాదేశ్‌ను భారత్ చిత్తుచిత్తుచేసింది. మెగా టోర్నీలో అపజయమెరుగని యువభారత్..ఇక కాసుకోండి అంటూ సెమీస్ ప్రత్యర్థి దాయాది పాకిస్థాన్‌కు దీటైన సవాల్ విసిరింది.

క్వీన్స్‌టౌన్(న్యూజిలాండ్): భారత కుర్రాళ్లు సత్తాచాటుతూ అండర్-19 ప్రపంచకప్ టైటిల్ వేటలో మరో ముందడుగు వేశారు. శుక్రవారం ఏకపక్షరీతిలో సాగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 131 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం సాధించింది. టీమ్‌ఇండియా నిర్దేశించిన 266 పరుగుల లక్ష్యఛేదనలో బంగ్లా..నాగర్‌కోటి(3/18), అభిషేక్‌శర్మ(2/11), శివమ్ మావి(2/27)ధాటికి 42.1 ఓవర్లలో 134 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ పినాక్ ఘోష్(43) మినహా ఎవరూ రాణించలేకపోయారు. అంతకుముందు శుభ్‌మన్‌గిల్(94 బంతుల్లో 86, 9ఫోర్లు), అభిషేక్‌శర్మ(49 బంతుల్లో 50, 6 ఫోర్లు) అర్ధసెంచరీలతో యువ భారత్ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. క్వాజీ ఒనిక్(3/48), నయిమ్ హసన్(2/36) ఆకట్టుకున్నారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న అభిషేక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఈనెల 30న జరిగే సెమీఫైనల్లో భారత్, పాకిస్థాన్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.



రాణించిన గిల్, అభిషేక్: తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. 16 పరుగులకే ఓపెనర్ మన్‌జ్యోత్ కల్రా(9) ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన శుభ్‌మన్‌గిల్(86) సాధికారిక ఇన్నింగ్స్‌తో రాణించాడు. కెప్టెన్ పృథ్వీషా(40)తో కలిసి బంగ్లా బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ పరుగులు కొల్లగొట్టాడు. ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న దశలో పృథ్వీషా ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దేశాయ్(34)తోనూ అదే జోరును కొనసాగిస్తూ గిల్..స్కోరుబోర్డుకు విలువైన పరుగులు జతచేశాడు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు దేశాయ్‌తో కలిసి 74 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. మిడిలార్డర్‌లో అభిషేక్‌శర్మ(50) ఆకట్టుకున్నా..లోయార్డర్‌లో 50 పరుగుల తేడాతో భారత్ ఆరు వికెట్లు కోల్పోయింది.

బంగ్లా టపాటపా: భారత్ నిర్దేశించిన 266 పరుగుల లక్ష్యఛేదనలో బంగ్లా కుదేలైంది. నాగర్‌కోటి(3/18), అభిషేక్‌శర్మ(2/11), శివమ్ మావి(2/27) బౌలింగ్ ధాటిని తట్టుకోలేకపోయిన బంగ్లా వెంటవెంటనే వికెట్లు చేజార్చుకుంది. 23 పరుగులకే ఓపెనర్ మహ్మద్ నయిమ్(12) వికెట్ చేజార్చుకున్న బంగ్లా..వరుస విరామాల్లో వికెట్లు పోగొట్టుకుంది.



నయా చాంపియన్ ఢిల్లీ

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 విజేతగా ఢిల్లీ అవతరించింది. శుక్రవారం ఇక్కడ జరిగిన ఫైనల్లో రాజస్థాన్‌పై 41 పరుగుల తేడాతో గెలిచి ట్రోఫీని గెలుచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. ఉన్ముక్త్ చంద్ (53) రాణించగా..గంభీర్ (27), షోరె (21) ఫరవాలేదనిపించారు. రాజస్థాన్ బౌలర్లలో ఖలీల్, చహర్‌కు చెరో రెండు వికెట్లు దక్కాయి. 154 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 112 పరుగులకే ఆలౌట్ అయింది. ఆదిత్య (52) పోరాడినా మిగతా బ్యాట్స్‌మెన్ నుంచి సహకారం లభించలేదు. ఢిల్లీ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ప్రదీప్ సాంగ్వాన్ (2/14)తో పాటు పవన్‌నేగి, కెజ్రోలియాకు తలా రెండు వికెట్లు దక్కాయి.

ఫెదరర్ @ 7

- ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో స్విస్ దిగ్గజం
- రేపు సిలిచ్‌తో తుది పోరు
- సెమీస్‌లో చుంగ్ రిటైర్డ్ హర్ట్
- మిక్స్‌డ్ ఫైనల్లో బోపన్న జోడి



మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశించాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో చుంగ్ హియోన్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ అవడంతో ఫెదరర్ తుదిపోరుకు చేరుకున్నాడు. స్విస్ దిగ్గజానికి ఇది ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్, కాగా ఐదు సార్లు విజేతగా నిలిచి, ఒకసారి రన్నరప్‌గా మిగిలాడు. ఓవరాల్‌గా 30వ సారి గ్రాండ్ స్లామ్స్ ఫైనల్‌కు చేరాడు. ఇక ఆదివారం జరుగనున్న ఫైనల్లో ఫెదరర్, సిలిచ్‌తో తలపడుతాడు. ఈ టోర్నీలో అప్రతిహతంగా దూసుకొచ్చిన ఈ రెండో సీడ్ ఆటగాడు ఫైనల్లోనూ గెలిచి 20వ గ్రాండ్‌స్లామ్స్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే తొలి సెట్‌ను 6-1తో గెలుచుకున్న ఫెదరర్..రెండో సెట్‌లోనూ 5-2తో ఆధిక్యంలో ఉన్న దశలో..21 ఏండ్ల కొరియన్ ఆటగాడు ఎడమ కాలికి బొబ్బలు ఏర్పడడంతో ఆట నుంచి వైదొలిగాడు. నిజానికి చుంగ్‌తో రసవత్తర పోరు ఉంటుందని ఫెదరర్ సైతం భావించగా.. పలు మార్లు అతడు నొప్పితో బాధపడ్డాడు. రెండో సెట్‌లో మెడికల్ టైమ్ అవుట్‌కి వెళ్లిన చుంగ్.. కాసేపటికి తర్వాత తిరిగి ఆడినప్పటికీ నొప్పి తీవ్రతరం కావడంతో హార్డ్ కోర్ట్‌ను వదిలివెళ్లాడు.



సెమీస్‌లో సైనా

ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీ

జకార్తా: భారత బ్యాడ్మింటన్ స్టార్ల పోరాటంలో సైనాదే పై చేయిగా నిలిచింది. ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన క్వార్టర్స్ సైనా 21-13,21-19 స్కోరుతో వరుస గేముల్లో సింధుపై ఘన విజయం సాధించింది. 37 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సింధు అంతగా ఆకట్టుకోలేకపోయింది. సెమీస్‌లో థాయిలాండ్‌కు చెందిన రచనోక్ ఇంతనాన్‌తో సైనా తలపడనుంది. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన సాత్విక్, చిరాగ్ జంటసెమీస్ చేరారు.

బోపన్న-బబోస్ జోరు

మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న, టిమియా బబోస్ జోడి ఫైనల్‌కు చేరింది. సెమీ ఫైనల్లో బోపన్న , బబోస్(ఇండో-హంగేరి) 7-5, 5-7, 10-6తో మార్టినెజ్, డెమొలినర్ (స్పెయిన్-బ్రెజిల్)పై గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. బోపన్న గ్రాండ్ స్లామ్స్ ఫైనల్‌కు చేరడం ఇది మూడోసారి. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇది రెండోసారి.




రూ.5,000 కోట్ల మనీల్యాండరింగ్ కేసులో ఫార్మా కంపెనీ డైరెక్టర్ అరెస్ట్

న్యూఢిల్లీ: హవాలా కేసులో గురువారం రాత్రి అరెస్టయిన గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీ డైరెక్టర్ రాజ్‌భూషణ్ ఓంప్రకాశ్ దీక్షిత్‌ను ఈడీ కస్టడీలోకి తీసుకుంది. ఆంధ్రాబ్యాంకు ఆధ్వర్యంలోని కన్సార్టియం నుంచి రూ.5,000కోట్ల రుణంగా తీసుకొని మోసగించిన కేసులో అరెస్టు అయ్యాడు. శుక్రవారం రాజ్‌భూషణ్‌ను మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా ఒక్కరోజు ఈడీ కస్టడీకి న్యాయమూర్తి ఆదేశించారు.

డోక్లాంపై యథాతథ స్థితిలో మార్పు ఉండదు

చైనా పత్రిక ఇంటర్వ్యూలో భారత రాయబారి గౌతం బాంబావాలే



బీజింగ్: డోక్లాం వంటి సున్నితమైన అంశాలపై యథాతథ స్థితిలో మార్పు ఉండదని చైనాలో భారత రాయబారి గౌతం బాంబావాలే వెల్లడించారు. చైనా – పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (సీపీఈసీ)తోపాటు చైనా, భారత్ మధ్య గల వివాదాస్పద అంశాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నదే తమ అభిమతమని చైనా అధికార దినపత్రిక 'గ్లోబల్ టైమ్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. డోక్లాం వద్ద మరోసారి రోడ్డు నిర్మాణానికి చైనా ప్రయత్నిస్తున్నదని వార్తలొచ్చిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. డోక్లాం వివా దం తర్వాత భారత్, చైనా అధినేతలతోపాటు వివిధ స్థాయిల్లో పరస్పరం చర్చించుకోవాల్సిన అవసరం గతంలోకన్నా అధికంగా ఉన్నదని స్పష్టం చేశారు. భారత్‌కు 'చైనా వ్యతిరేక మనస్తత్వం' లేదని వివరించారు. 'మేం ఎదుటి పక్షం వారి వైఖరిపై సున్నితంగా వ్యవహరిస్తాం. సమానత్వ హోదాతో పరస్పరం ప్రయోజనం చేకూర్చేలా మా సంప్రదింపులు ఉంటాయి. సున్నితమైన అంశాలపై యథాతథ స్థితిని కొనసాగించాల్సిందే. ఇదే మా వైఖరి' అని అన్నారు. 'భారత్, చైనా మధ్య చర్చలు విజయవంతమైతే ఇరు పక్షాల మధ్య పరస్పర విశ్వాసం మరింత పెరుగుతుంది' అని బాంబావాలే చెప్పారు.

నిప్పంటించుకున్న చెన్నై క్యాబ్ డ్రైవర్ మృతి

ట్రాఫిక్ కానిస్టేబుల్‌జరిమానా విధించడమే కారణం

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలో బుధవారం నడిరోడ్డుపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన క్యాబ్ డ్రైవర్ శుక్రవారం మృతిచెందారు. తిరునల్వేలి జిల్లా వాసి మనికందన్ చెన్నైలో కారులో వెళ్తుండగా ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపారు. సీటు బెల్టు పెట్టుకోనందుకు జరిమానా విధించడంతో వారి మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో మనికందన్ కారులోని పెట్రోల్ డబ్బాను బయటికి తీసి మీద పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రగాయాలపాలైన ఆయనను దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు. మనికందన్ మృతిపై దర్యాప్తు చేపట్టాలని ఆయన కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

దక్షిణ కొరియా దవాఖానలో అగ్నిప్రమాదం

41 మంది మృతి, 80 మందికి గాయాలు

సియోల్: దక్షిణకొరియా మిర్యాంగ్‌లోని సేజోంగ్ వైద్యశాలలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 41 మంది మరణించారు. 80 మందికి గాయాలయ్యాయి. ఆరు అంతస్తుల దవాఖానలో అత్యవసర గది నుంచి మంటలు చెలరేగాయని నర్సులు తెలిపారు. మంటలు చెలరేగగానే దవాఖాన మొత్తం పొగతో చిమ్మచీకటి ఆలుముకున్నదని అగ్నిమాపక అధికారులు చెప్పారు. ప్రమాద సమయంలో వైద్యశాలలో మొత్తం 200 మంది ఉన్నారని చెప్పారు. దవాఖానలోని మిగతా విభాగాల్లో ఉన్న రోగులను అగ్నిమాపక సిబ్బంది బయటకు తెచ్చారు. ఐసీయూలో ఉన్న 15 మంది రోగులను వైద్యుల సూచనతో తరలించేందుకు అగ్నిమాపక సిబ్బంది వేచిచూడంతో ఆలస్యమైందని ఆ శాఖ అధికారి చోయిమాన్ వూ తెలిపారు. ఈ ఘటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశాలు జారీచేశారు.

స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతునిస్తా

- పరస్పరం ప్రయోజనకారి కావాలి
- అమెరికన్ ఫస్ట్ అంటే అమెరికన్లు మాత్రమేనని కాదు
- డబ్ల్యూఈఎఫ్ ముగింపు కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



దావోస్/ వాషింగ్టన్/ లండన్, జనవరి 26: తాను స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతునిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే అది నిష్పక్షపాతంగా, పరస్పరం ప్రయోజనకారిగా ఉండాలని పేర్కొన్నారు. దావోస్‌లో శుక్రవారం ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'అమెరికన్ ఫస్ట్' పాలసీ అంటే 'అమెరికన్లు మాత్రమే' అని కాదని వివరణ ఇచ్చారు. బిల్ క్లింటన్ తర్వాత డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు హాజరైన రెండో అమెరికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కావడం గమనార్హం. ఇతర దేశాల అధినేతలు.. ట్రంప్ రక్షణాత్మక విధానాలపై దాడి చేయడంతో ఆయన వెనుకకు తగ్గారు. అమెరికాలో వ్యాపారానికి ద్వారాలు తెరిచే ఉన్నాయన్న ట్రంప్.. అయితే అది పోటీ తత్వం కలిగి ఉండాలన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌ను ఉగ్రవాదులకు స్వర్గధామంగా తిరిగి మారనివ్వబోమని స్పష్టం చేశారు. అమెరికా, తన నిర్ణయాలపై ప్రస్తావించిన ట్రంప్.. 'అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేసినప్పటి నుంచి స్టాక్ మార్కెట్ పలుసార్లు తన రికార్డులను తిరుగరాసింది. ఏడు లక్షల కోట్ల డాలర్లకుపైగా నూతన ఆదాయం సృష్టించింది' అని చెప్పారు. అమెరికాలో పెట్టుబడులు, ఉద్యోగాలు, వ్యాపారాలకు ప్రస్తుతం సరైన సమయం అని చెప్పారు. నూతన పన్ను విధానంతోపాటు తన ప్రభుత్వ విధానాలను సవివరంగా వివరించిన ట్రంప్ 'దేవుడు మీ అందరినీ దీవించుగాక' అని ప్రసంగాన్ని ముగించారు. తాను ఒక వ్యాపారవేత్తగా మీడియా ప్రేమికుడినని ట్రంప్ చెప్పారు. కానీ తాను రాజకీయవేత్తగా మారగానే తనకు వ్యతిరేకంగా మీడియా బూటకపు వార్తలు వెలువరించిందన్నారు. కాగా, ఆఫ్రికన్లు మురికివారని ట్రంప్.. వ్యాఖ్యానించినందుకు ఆఫ్రికా దేశాల అధినేతలు, ప్రతినిధులు ఆయన ప్రసంగాన్ని బహిష్కరించారు. కాగా, ఈ సందర్భంగా కార్పొరేట్ సీఈవోలకు ఇచ్చిన ట్రంప్ విందుకు భారత సంతతికి చెందిన ముగ్గురు సీఈవోలతోపాటు 16 మంది ఈయూ సంతతి సీఈవోలు హాజరయ్యారు. నొవార్టీస్ సీఈవో వ్యాస్ నరసింహన్, నోకియా సీఈవో రాజీవ్ సూరి, డెల్లాయిట్ సీఈవో పునీత్ రెంజెన్ విందులో పాల్గొన్నారు.

బ్రిటిష్ పౌరులకు ట్రంప్ క్షమాపణ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలిసారి క్షమాపణ చెప్పారు. దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ట్రంప్.. శుక్రవారం బ్రిటన్ పియర్స్ మోర్గాన్ టీవీ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా జాత్యాహంకార గ్రూప్ వీడియోను నవంబర్‌లో ట్రంప్ రీట్వీట్ చేసిన అంశం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ 'మీరు చెప్పినట్లు ఇస్లామిక్ వ్యతిరేక వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారు జాత్యాహంకార వ్యక్తులైతే.. దాన్ని రీ ట్వీట్ చేసినందుకు నేను తప్పనిసరిగా క్షమాపణ చెబుతున్నా' అని అన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం!

- ముంబైలో ప్రతిపక్షాల 'రాజ్యాంగ పరిరక్షణ' ర్యాలీ

ముంబై, జనవరి 26: ప్రాథమిక హక్కులను కాలరాయడానికి, రాజ్యాంగాన్ని మార్చడానికి అధికార బీజేపీ కుట్రలు పన్నుతున్నదని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నదని, దీనిని కాపాడుకుందామని పిలుపునిచ్చాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిపక్షాలు 'రాజ్యాంగ పరిరక్షణ' పేరిట ముంబైలో ర్యాలీ నిర్వహించాయి. అయితే 2019 సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఒకే వేదికమీదికి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ర్యాలీలో శరద్ పవార్(ఎన్సీపీ), శరద్ యాదవ్(జేడీయూ తిరుగుబాటు నేత), డీ రాజా (సీపీఐ), సీతారాం ఏచూరి(సీపీఎం), హర్దిక్ పటేల్(గుజరాత్ పాటిదార్ నాయకుడు), దినేశ్ త్రివేది(తృణమూల్ కాంగ్రెస్), సుశీల్‌కుమార్ షిండే(కాంగ్రెస్), జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, మాజీ ఎంపీ రాంజెత్మాలానీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వీరంతా మహారాష్ట్ర ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్ నేత రాధాకృష్ణ ఇంట్లో సమావేశమయ్యారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. శరద్ పవార్ మాట్లాడుతూ ప్రమాదంలో ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ర్యాలీ నిర్వహించాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయని చెప్పారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోలేకపోతే తాము పెద్ద తప్పు చేసిన వాళ్లమవుతామని తెలిపారు. ఈనెల 29న ప్రతిపక్షాలు ఢిల్లీలో సమావేశమవుతాయని, బీజేపీకి వ్యతిరేకంగా ఎలాంటి పోరాటాన్ని జరుపాలన్న దానిపై సమాలోచనలు జరుపుతాయని పేర్కొన్నారు. అనంతరం సీతారాం ఏచూరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను అధికార బీజేపీ కాలరాస్తున్నదని తెలిపారు. ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న సందేశాన్ని దేశానికి వినిపించడానికి ఈ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. ఈ ర్యాలీ రాష్ట్ర సచివాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న శివాజీ విగ్రహం వరకు కొనసాగింది. మరోవైపు ప్రతిపక్షాల ర్యాలీకి పోటీగా బీజేపీ కూడా తిరంగ యాత్రను చేపట్టడం విశేషం.



ర్యాలీలో పాల్గొన్న శరద్ యాదవ్, శరద్ పవార్, డీ రాజా, హార్దిక్ పటేల్ తదితరులు

ముంబై రైల్వే పరిధిలో

2017లో 3014 మంది మృతి

రోజుకు సగటున తొమ్మిది మంది ప్రయాణికులు దుర్మరణం

సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు బదులిచ్చిన అధికారులు



ముంబై, జనవరి 26: ముంబైలో అత్యధిక మంది ప్రజలు రవాణా కోసం ఆధారపడే రైల్వేలో ప్రమాద మృతుల సంఖ్య కూడా అధికంగానే ఉన్నది. 2017లో ముంబై మహానగరంలో రైల్వే ప్రమాదాల్లో 3,014 మంది ప్రయాణికులు మృత్యువాతపడ్డారు. నగరానికి చెందిన సామాజిక కార్యకర్త సమీర్ జావేరీ సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా కోరిన ప్రశ్నకు అధికారులు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం.. పశ్చిమ, మధ్య, ఓడరేవు సబర్బన్ సర్వీస్ మార్గాల్లో ట్రాక్‌లపై ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. '2017లో మూడు మార్గాల్లోని సబర్బన్ స్టేషన్లలో 1,651 (పురుషులు 1,467.. మహిళలు 184) మంది రైలుపట్టాలు దాటుతుండగా జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇతర స్టేషన్ల పరిధిలో మిగతా మరణాలు సంభవించాయి. 'రైల్వే మరణాలకు మూడు కారణాలు ఉన్నాయి. ఆత్మహత్య, రైళ్లలో నుంచి కిందపడటం, నిబంధనలు ఉల్లంఘించి పట్టాలు దాటుతుండగా రైళ్లు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకోవడం. ఆత్మహత్యలను నియంత్రించడం సాధ్యంకాదు. మిగతా రెండింటిని నివారిస్తాం' అని జీఆర్పీ సెంట్రల్ రైల్వే ఏసీపీ మచ్చింద్ర చవాన్ తెలిపారు. రోజుకు సగటున తొమ్మిది మంది మృతిచెందుతున్నారని, ప్రమాదాల నివారణ కోసం ప్రజలను చైతన్యపర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

విద్య, ఉద్యోగ సమాచారం

నావికాదళంలో ఎస్‌ఎస్‌సీ ఆఫీసర్లు

భారత నావికాదళం ఎడ్యుకేషన్ బ్రాంచీలో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ), పర్మినెంట్ కమిషన్ లాజిస్టిక్ బ్రాంచీలో ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ఎంఏ ఇంగ్లిష్, ఎమ్మెస్సీ మ్యాథ్స్/ఫిజిక్స్, బీఈ/బీటెక్ అభ్యర్థులకు అవకాశం
- షార్ట్ సర్వీస్, పర్మినెంట్ కమిషన్ లో ఆఫీసర్ ఉద్యోగాలు
- చివరితేదీ ఫిబ్రవరి 10



వివరాలు:

జనవరి 2019 కోర్సు ప్రవేశాల కోసం ఈ ప్రకటనను నేవీ విడుదల చేసింది. ఈ కోర్సును కేరళలోని ఎజిమల ఇండియన్ నేవల్ అకాడమీలో నిర్వహిస్తారు.

- **వయస్సు:** బ్రాంచీల వారీగా..
- **ఎడ్యుకేషన్:** 1994, జనవరి 2 నుంచి 1998, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు.
- **లాజిస్టిక్స్:** 1994, జనవరి 2 నుంచి 1999, జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి. పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

ఎస్ఎస్‌సీ (ఎడ్యుకేషన్):

- ఖాళీల సంఖ్య – 4
- ఎమ్మెస్సీ (ఫిజిక్స్/న్యూక్లియర్ ఫిజిక్స్)తోపాటు బీఎస్సీలో మ్యాథ్స్ చదివి ఉండాలి.
- ఖాళీల సంఖ్య – 5
- **అర్హతలు:** ఎమ్మెస్సీ మ్యాథ్స్/ఆపరేషనల్ రిసెర్చ్‌తోపాటు బీఎస్సీలో ఫిజిక్స్ చదివి ఉండాలి.
- ఖాళీల సంఖ్య – 1
- **అర్హతలు:** ఎంఏ ఇంగ్లిష్ ఉత్తీర్ణత.
- ఖాళీల సంఖ్య – 5
- **అర్హతలు:** బీఈ/బీటెక్ (ఈసీఈ/ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ లేదా ఈఐ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
- ఖాళీల సంఖ్య – 3
- **అర్హతలు:** మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్
- పర్మినెంట్ కమిషన్ (లాజిస్టిక్స్) – 20 ఖాళీలు
- **అర్హతలు:** బీఈ/బీటెక్ ఏదైనా విభాగం లేదా ఎంబీఏ లేదా బీఎస్సీ/బీకాం (ఐటీ)తోపాటు పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్స్/లాజిస్టిక్స్ లేదా సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్/మెటీరియల్ మేనేజ్‌మెంట్ లేదా ఎంసీఏ/ఎమ్మెస్సీ (ఐటీ).

నోట్: పై అర్హత పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.

శారీరక ప్రమాణాలు:

- **ఎత్తు:** పురుషులు – 157 సెం.మీ, మహిళలు – 152 సెం.మీ. ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.

పదోన్నతులు, పేస్కేల్:

- సబ్‌లెఫ్టినెంట్ హోదా నుంచి కమాండర్ వరకు పదోన్నతి పొందవచ్చు.
- **సబ్‌లెఫ్టినెంట్ పేస్కేల్:** రూ. 56,100 – 1,10,700/-
- **షార్ట్ సర్వీస్ కమిషన్:** ఎడ్యుకేషన్ ఆఫీసర్ పోస్టుకు మొదట 12 ఏండ్ల కాలానికి ఎంపికచేస్తారు. ఆ తర్వాత అవసరాన్నిబట్టి మరో రెండేండ్లు పొడగిస్తారు.

ఎంపిక ప్రక్రియ:


- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అకడమిక్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి బెంగళూరు/భోపాల్ లేదా కోయంబత్తూరు, విశాఖపట్నం కేంద్రాల్లో మే 18 – జూన్ 18 మధ్య ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది.
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు ఐదురోజుల పాటు ఉంటాయి.
- స్టేజ్ – 1 ఒక్కరోజు, స్టేజ్ –2 నాలుగు రోజులు నిర్వహిస్తారు.
- స్టేజ్ – 1లో ఇంటెలిజెన్స్ టెస్ట్, పీపీ, డిస్కషన్ టెస్ట్‌లు ఉంటాయి. వీటిలో అర్హత సాధించినవారిని స్టేజ్ –2కు అనుమతిస్తారు.
- స్టేజ్ –2లో సైకలాజికల్ టెస్టింగ్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూలు ఉంటాయి. వీటిలో అర్హత సాధించినవారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.
- వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపికచేస్తారు.
- **శిక్షణ:** ఎంపికైన అభ్యర్థులకు సబ్ లెఫ్టినెంట్ హోదాలో శిక్షణనిస్తారు. ఈ శిక్షణ 2018, డిసెంబర్ చివరివారంలో ప్రారంభమవుతుంది. 22 వారాలపాటు శిక్షణనిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఐఐటీలో ఎల్‌ఎల్‌బీ

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- **కోర్సు:** ఎల్‌ఎల్‌బీ ఆనర్స్ ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా
- **కాలవ్యవధి:** మూడేండ్లు



- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ లేదా మెడిసిన్ లేదా తత్సమాన కోర్సు లేదా సైన్స్/ఫార్మసీ లేదా తత్సమాన సబ్జెక్టుల్లో పీజీ లేదా ఎంబీఏ.
- **కోర్సు:** ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్
- **కాల్యవవధి:** రెండేండ్లు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్ ఇన్ లా/ఎల్‌ఎల్‌బీ/బీఎల్ (ఐదేండ్ల కోర్సు) లేదా ఫస్ట్‌క్లాస్ మార్కులతో ఎల్‌ఎల్‌బీ/బీఎల్ (మూడేండ్ల కోర్సు)తో పాటు మూడేండ్ల హ్యూమానిటీస్/సైన్స్ లేదా కామర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 28
- **ఎంపిక:** జాతీయస్థాయి పరీక్ష ద్వారా
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 29
- **వెబ్‌సైట్:** http://www.iitkgp.ac.in

రిసెర్చ్ అసిస్టెంట్లు

కోల్‌కతాలోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జెడ్ఎస్ఐ) రిసెర్చ్ అసిస్టెంట్, జేఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల శాఖ పరిధిలో జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పని చేస్తుంది. ప్రస్తుత పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.

- రిసెర్చ్ అసిస్టెంట్ III – 1, రిసెర్చ్ అసిస్టెంట్ I – 6, జేఆర్ఎఫ్ – 6, జేఆర్ఏ – 6, ఫీల్డ్ అసిస్టెంట్స్ – 12 ఖాళీలు ఉన్నాయి.
- మొదట ఏడాది కాలానికి ఈ పోస్టులు భర్తీ చేస్తారు. అవసరాన్నిబట్టి మరో మూడేండ్లు పొడగిస్తారు.
- **అర్హతలు:** వేర్వేరు పోస్టులకు వేర్వేరుగా ఉన్నాయి. వెబ్‌సైట్‌లో వివరాలు చూడవచ్చు.
- **వయస్సు:** 2018, ఫిబ్రవరి 15నాటికి 40 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** http://zsi.gov.in

'సెంట్రల్ ఎక్సైజ్'లో 26 ఖాళీలు

కొచ్చిన్‌లోని కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ 'గ్రూప్ సీ' డిపార్ట్‌మెంట్‌లోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- మొత్తం పోస్టులు: 26

విభాగాలవారీగా ఖాళీలు

- సీమెన్–7, గీజర్–11, స్కిప్పర్‌మెట్–2 , ఇంజిన్ డ్రైవర్–1, సుఖాని–1, లాంచ్ మెకానిక్–1, అన్‌స్కిల్డ్ ఇండస్ట్రియల్ వర్కర్– 3
- **అర్హతలు:** పదోతరగతి లేదా తత్సమాన పరీక్షతో పాటు ఫిషింగ్ వెజల్‌లో సెకండ్ హ్యాండ్ సర్టిఫికెట్ ఉండాలి. ఇంజిన్ డ్రైవర్‌కు ఎనిమిదో తరగతి, అన్‌స్కిల్డ్ ఇండస్ట్రియల్ వర్కర్‌కు పదోతరగతితోపాటు మెకానిక్/ డీజిల్/ ఫిట్టర్/ టర్నర్/ వెల్డర్/ ఎలక్ట్రీషియన్/ ఇన్‌స్ట్రుమెంట్/ కార్పెంటరీ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి. కొన్ని పోస్టులకు 30 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తులు:** ఆఫ్‌లైన్
- **చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.cenexcisekochi.gov.in

ప్రాజెక్టు అసిస్టెంట్లు

నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఈఐఎస్‌టీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.


వివరాలు:

- మొత్తం పోస్టుల సంఖ్య: 6
- **అర్హత:** ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ, అగ్రికల్చర్, బాటనీ, బయోటెక్నాలజీ, టిష్యూ కల్చర్, లైఫ్ సైన్స్, బయోఇన్ఫర్మాటిక్స్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ.25,000/– అదనంగా హెచ్ఆర్ఏ చెల్లిస్తారు
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 7
- **వెబ్‌సైట్ :** www.neist.res.in.

కురుక్షేత్ర నిట్‌లో ప్రొఫెసర్లు

కురుక్షేత్ర (హర్యానా)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



కురుక్షేత్ర నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) 1963లో ఏర్పాటుచేశారు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 36
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్–3, మెకానికల్/ప్రొడక్షన్–2, ఎలక్ట్రానిక్స్&కమ్యూనికేషన్–8, కంప్యూటర్ సైన్స్/ఐటీ–10, ఫిజిక్స్–2,మ్యాథమెటిక్స్–2, హ్యూమానిటీస్ &సోషల్ సైన్సెస్–1, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్–3, కంప్యూటర్ అప్లికేషన్స్–5
- **అర్హతలు:** ఇంజినీరింగ్, సైన్స్/హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పీజీతోపాటు పీహెచ్‌డీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. డిగ్రీ, పీజీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. సంబంధిత విభాగంలో అనుభవం.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:**www.nitkkr.ac.in

'ఓషియన్ టెక్నాలజీ'లో ఎస్ఆర్ఎఫ్

తమిళనాడులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎస్ఆర్ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 21

విభాగాలవారీగా ఖాళీలు:

- రిసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)–6
- సీనియర్ రిసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)–11
- జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)–4
- **అర్హత:** పీహెచ్‌డీ (ఓషియనోగ్రఫీ, ఫిజికల్ ఓషియనోగ్రఫీ, మెరైన్ జియోఫిజిక్స్, మెరైన్ జియాలజీ), ఎంటెక్ (ఓషియన్ టెక్నాలజీ/ఓషియనోగ్రఫీ/ ఫిజికల్ ఓషియనోగ్రఫీ, మెరైన్ జియోఫిజిక్స్, మెరైన్ జియాలజీ, బయోటెక్నాలజీ, జెనెటిక్స్), సంబంధిత బ్రాంచిలో బీఈ/బీటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, లైఫ్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ/ పీహెచ్‌డీ ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **వయస్సు:** 28 ఏండ్లు, (ఆర్ఏకు 35 ఏండ్లు, ఎస్ఆర్ఎఫ్‌కు 32 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్
- **చివరితేదీ:** ఫిబ్రవరి 9
- **వెబ్‌సైట్:** http://www.niot.res.in